
ఓం భూర్భువః స్వః తత్సవితుర్వరేణ్యం భర్గోదేవస్య ధీమహి ధియోయోనః ప్రచోదయాత్





# యుగశక్తి గాయత్రి



ఓం వందే భగవతీం దేవీం శ్రీరామంచ జగద్గురుం
పాదపద్మే తయోః శ్రిత్వా ప్రణమామి ముహుర్ముహుః

ప్రఖర ప్రజ్ఞ — సజల శ్రద్ధ

సంకల్పం - సంరక్షణ
వేదమూర్తి, తపోనిష్ఠ, పండిత
**శ్రీరామ శర్మ ఆచార్య**
శక్తి స్వరూపిణి
**మాతా భగవతీ దేవి శర్మ**

ప్రధాన సంపాదకులు
**డాక్టర్ ప్రణవ్ పండ్యా**
సంపాదక మండలి
డాక్టర్ మారెళ్ళ శ్రీరామకృష్ణ
పొన్నూరు హైమవతీశాస్త్రి
ముక్కామల రత్నాకర్
డి.వి.ఆర్.మూర్తి
సాధన నరసింహాచార్య

సంపుటి 16 - సంచిక 7
**డిశంబర్ 2011**
విడిప్రతి రూ॥ 12.00
సం॥ చందా రూ॥ 120
3 సం॥ చందా రూ॥ 350
10 సం॥ చందా రూ॥ 1116

పత్రిక చందా మనీ ఆర్డర్ ద్వారా కాని డ్రాఫ్టు ద్వారా కాని పంపవలసిన చిరునామా
**"శ్రీ వేదమాత గాయత్రీ ట్రస్టు"**
**గాయత్రీ చేతనా కేంద్రము**
హెచ్.పి. రోడ్, మూసాపేట,
అశ్విని హౌస్ దగ్గర,
హైదరాబాదు - 500 018.

## కష్టములు అవసరమే, ఉపయోగకరమే

అగ్ని లేకుండా అన్నం ఉడకదు, చలి దూరమవ్వదు, ధాతువులను కరిగించి రూపాన్నివ్వటం సాధ్యమవ్వదు. ఆదర్శముల పరిపక్వత కొరకు వాటిపట్ల నిష్ఠ అనేది కష్టములనే గీటురాయిమీద పరీక్షించి తద్వారా మంచి-చెడుల యథార్థ వివేచనను అవగాహన చేసుకొనుట తప్పనిసరి. అగ్నిలో పుతం పెట్టకుండా మంచి బంగారము అని ఎలా చెప్పగలుగుతాము? దానికి తగిన మూల్యం ఎలా లభిస్తుంది? ఇది ప్రారంభిక పరీక్ష.

కష్టముల కారణంగా ఉత్పన్నమయ్యే ఇబ్బందుల గురించి అందరికి తెలుసు. అందువలన వాటినుండి తప్పించుకోవటానికి ప్రయత్నం కూడా చేస్తారు. ఈ ప్రయత్నం కొరకు మనిషి ముందుచూపును అలవరచుకొని, ధైర్యమును ఆశ్రయించాలి. విపత్తు నుండి బయటపడటానికి కావల్సిన ఉపాయములను వెదుకవల్సి ఉంటుంది. ఈ తెలివితేటలే మనిషిని యథార్థవాదిగా, సాహసిగా మలుస్తాయి. కష్ట సమయంలో ప్రతికూలతలను అనుకూలతలుగా మార్చుకొనుటకు పరాక్రమమును చూపించకపోతే, అతను సుదృఢమైన వ్యక్తిత్వ నిర్మాణమునకు లభించిన అవకాశాన్ని ఉపయోగించుకోలేదు అని అర్థం చేసుకోవాలి. మట్టితో చేసిన పాత్రలు నీటిచుక్కలు పడగానే పగిలిపోతాయి. అయితే దీర్ఘకాలం వరకు ఆవంలో కాల్చబడిన పాత్రలు స్థిరంగా ఉంటాయి, వాటి శోభ మరియు ఉపయోగం చాలా ఎక్కువగా ఉంటుంది.

కత్తికి పదునుపెట్టటానికి రాతిమీద సానపెట్టాలి. భూమినుండి ముడిలోహాలే లభిస్తాయి. వాటిని శుద్ధిగావించుటకు కొలిమిలో తపింపజేయుట (కాల్చడం) తప్ప మరే ఉపాయమూ లేదు. తపం-తితీక్షలనే కష్టముల కొలిమిలో కాల్చి తపింపజేసినప్పుడే మనిషి వివేకవంతుడు, సిద్ధాంతవాది, ఆచరణ పట్ల నిష్ఠ ఉన్నవాడు అని ఋజువౌతుంది.

పత్రిక అందనివారు ఈ క్రింది నంబరును సంప్రదించగలరు. **9949111175**

పత్రికకు సూచనలు, సలహాలు ఇవ్వదలచినవారు క్రింది నంబర్‌ను సంప్రదించగలరు. **9989659905**

**ఎంతటివారికైనా విమర్శల బాధ తప్పదు. సింహమైనా ఈగల బెడద తప్పించుకోలేదు.**

## విషయ సూచిక


1. **సంపాదకీయం :** కష్టములు అవసరమే ఉపయోగకరమే 1
2. **విషయసూచిక-సద్గురు వచనామృతం :** మీ ఊహలను సార్థకం చేసుకోండి 2
3. **వేదమంత్రం :** గడచిన కాలం తిరిగిరాదు 3
4. **గాయత్రీ విద్య-16 :** గాయత్రీ మంజరి 4
5. **బాలల భవితకు బంగారు బాట-24 :** రెండు కళ్ళు 8
6. **ధారావాహిక ప్రశ్నోపనిషద్ : ప్రథమకాండే పంచమోధ్యాయః :** ఉదార భక్తి భావనా ప్రకరణం 9
7. **సూర్య విజ్ఞానం - 15 :** ఆదివారం ఉపవాసం ఎందుకు చేయాలి? 10
8. **పూజ్య గురుదేవుల శతసూత్ర కార్యక్రమం 11-20 :** ఆరోగ్యాభివృద్ధికి సామూహిక కృషి 13
9. **తత్వజ్ఞానం-3 :** కొన్ని రకములైన భౌతిక కర్మలు 15
10. **జన్మశతాబ్ది ప్రత్యేకం :** ప్రజ్ఞాయుగం ఎలా ఉంటుంది? 16
11. **కాలజ్ఞానం :** కాల చక్రం యొక్క రహస్య విజ్ఞానం 19
12. **ఆదిశక్తి లీలా కథలు-18 :** శ్రీ దుర్గాసప్తశతి గాయత్రీ సాధనా మర్మమును తెలుపుతుంది 22
13. **అతీంద్రియ సామర్థ్యం కల్పనకాదు, వైజ్ఞానికం** 24
14. **జన్మశతాబ్ది ప్రత్యేకం :** రచనా వ్యాసాంగ సాధనలో మునిగిపోయిన సమాధియోగి 26
15. **గీతా జయంతి ప్రత్యేకం :** మనల్ని పరిపూర్ణలను చేసేందుకు అవతరించిన దివ్యసందేశమే భగవద్గీత 28
16. **పూజ్య గురుదేవుల అమృత వాణి :** సంస్కృతి అనే సీతను తిరిగి తీసుకురావటానికి ఇదే సరైన సమయం-3 30
17. **నావారితో నా మాట:** ఒక గొప్ప మహాకుంభమునకు తెరతీసిన ఉద్వేగమునకు నమస్కారము 35
18. **ఆరోగ్యమే మహాభాగ్యం-13 :** హోమియో వైద్య సేవ 38
19. **సుభాషితాలలో సుధారస బిందువులు - 2** 39
20. **ముక్తికి మార్గం - మార్గశిర మాసం** 41
21. **నిత్యస్మరణీయులు - 2 :** ఆదర్శానికి ఆనవాలు అబ్దుల్ కలామ్ 42
22. **యుగ ఋషి, వేదమూర్తి పండిత శ్రీరామశర్మ ఆచార్య జన్మశతాబ్ది మహోత్సవములపై ఒక సమీక్ష** 44
23. **ఆణిముత్యాల శోధన - 1** 48




## సద్గురు వచనామృతం

### మీ ఊహలను సార్థకం చేసుకోండి

ఏవైపు అయినా దృష్టి సారించండి. అన్నింటిలో కల్పనలే కనిపిస్తాయి, ఊహలే కనిపిస్తాయి. కనుక ఊహించడం వ్యర్థం కాదు. కాని ప్రాణ రహితమైన ఊహలు జీవనశక్తిని పెంచక పోగా, దానిని నశింపచేస్తాయి. మనిషిని ప్రాణరహితంగా చేస్తాయి. కనుక - మనం సజీవమైన, ప్రాణవంతమైన ఊహలను చేయాలి.

మనిషి అనే ఈ పెద్ద యంత్రంలో నలువైపులా ప్రాణమే నిండి ఉన్నది. నలువైపులా జీవన తరంగాలు ఉప్పొంగు తున్నాయి. ఆ జీవనమే ఊహగా వెలికి వచ్చి, తన అనేక రూపాలలో ఆకృతులను నిర్మించగోరుతుంది. అది తన శక్తిని, తన చైతన్యాన్నీ నలువైపులా వెదజల్ల గోరుతుంది. కనుక ఊహిస్తుంది. అయితే - దాని పరిధి ఊహకే పరిమితమైతే, అది తన ఆత్మను, ప్రాణాన్ని అందులో జోడించకపోతే - అది నిస్తేజమవుతుంది. కనుక - నీవు కోరుకున్నదాన్ని, నీ మనసులో ఆలోచించినదాన్ని, నీవు చిత్రించిన గాలి మేడల పటాన్ని నేల మీదకు దించాలనే దృఢ సంకల్పం తీసుకోవాలి. నీవు అలా చేసినపుడు - ఆ ఊహను నేల మీదకు దించడాన్ని ఏ శక్తి అడ్డుకుంటుంది?

*- అఖండజ్యోతి, డిశంబర్, 1949*

*అనువాదం: సత్యనారాయణ గుప్తా*

## పండుగలు

**డిశంబర్ 2011**

| | |
|---|---|
| 06-12-2011 | గీతా జయంతి |
| 10-12-2011 | దత్త జయంతి |

**జనవరి 2012**

| | |
|---|---|
| 05-01-2012 | వైకుంఠ ఏకాదశి |
| 14-01-2012 | మకర సంక్రాంతి |
| 26-01-2012 | రిపబ్లిక్ దినోత్సవం |
| 27-01-2012 | వసంత పంచమి |
| 30-01-2012 | రథ సప్తమి |

మహోన్నత వ్యక్తిత్వాన్ని గుర్తించడం చాలా కష్టం.

వేద మంత్రం

# గడచిన కాలం తిరిగిరాదు

**కాలో అశ్వో వహతి సప్త రశ్మిః**
**సహస్రాక్షో అజరో భూరి రేతాః ।**
**తమా రోహంతి కవయో విపశ్చితస్తస్య**
**చక్రా భువనాని విశ్వా ॥ (అథర్వవేదం 19/53/1)**

**భావార్థం :** గడచిన కాలం తిరిగిరాదు. సమయం చాలా శక్తివంతమైనది. ఇది తెలుసుకున్న జ్ఞానులు ఎల్లప్పుడు సమయాన్ని సదుపయోగం చేస్తారు.

**సందేశం :** మానవ జీవనంలో సమయం చాలా విలువైన సంపద. దీని సదుపయోగంతో ప్రపంచంలో అన్ని రకాల సాఫల్యం ప్రాప్తించుకోవచ్చు. అన్ని సుఖాలు, వైభవాలు లభింపచేసుకోవచ్చు. పగలు, రాత్రి, నెల, సంవత్సరం గడచిపోతున్నాయి. సమయం పరుగెత్తుతున్నది. అశ్వగతిలో సమయం పరుగెత్తుతున్నది. ఎంత ప్రయత్నించినా గడచిన సమయం మాత్రం తిరిగి రాదు.

ఈ మంత్రంలో కాలం అనగా సమయం యొక్క అనేక విశేషతలు చెప్పబడ్డాయి. సూర్యుని శక్తి ప్రపంచంలో ఏవిధంగా ప్రముఖమో అలాగే కాలం యొక్క మహత్తు కూడా. కాలుడు సహస్రనేత్రుడు, అన్నివేళలా అందరినీ చూస్తూ ఉంటాడు. కాలచక్రంలో వందలాది ఇరుసులు ఉన్నాయి, వాటి సహాయంతో ప్రపంచం నిరంతరం నడుస్తూ ఉన్నది. కాలం ఎప్పుడు ఒకే విధంగా ఉంటుంది. అది అత్యంత బలశాలి.

ప్రపంచంలో అన్ని కార్యములు కాలం పరిధిలో బంధించబడి ఉన్నాయి. పరమాత్మను, ఆత్మను వదలి మిగిలినవన్నీ కాలం యొక్క బంధనంలో బంధించబడి ఉన్నాయి. కేవలం జ్ఞానులు, బుద్ధిమంతులు మాత్రమే కాలమనే అశ్వాన్ని సవారీ చేయగలుగుతారు. ఎవరి జీవితంలో ఉన్నత లక్ష్యం ఉంటుందో వారు సమయాన్ని సదుపయోగపరచి కాలాన్ని జయించ గలుగుతారు.

సమయం ధనం కంటే విలువైనది. ప్రపంచంలోని వస్తువులన్నింటిలో సమయం యొక్క ప్రాముఖ్యత సర్వోపరి. సమయం విలువ తెలిసిన వారు దాన్ని ఎన్నడు వృథా చేయరు. సమయం శుభ జీవనం, లక్ష్మి యొక్క భాండారం. సమయం సదుపయోగంతోనే మనుష్య జీవితం శుభం, పవిత్రం అవుతుంది. జీవితం శాశ్వతం కాదు అంటే దాని అర్థము సమయాన్ని వృథా చేసుకోవద్దు అని. ఈ అమూల్య నిధిని వ్యర్థం చేసుకోకుండా దీని నుండి అధికాధిక లాభం పొందవచ్చు. నిర్ధారించబడిన సమయంలో నిర్ధారించబడిన పనిచేయుటలో జీవన సాఫల్య రహస్యం ఉన్నది. నేడు అంతటా సమయాన్ని వృథా చేయుటయే చూస్తున్నాము. ప్రతి పని కాలక్షేపం కోసం చేస్తున్నారు. సోమరితనం, నిద్ర, పోసుకోలు కబుర్లలో సమయాన్ని వృథా చేసి తీరిక లేదని చెప్తారు. ఈ వాస్తవికత పట్ల మనం కళ్ళు మూసుకుంటే, కాలం మనలను కాలరాస్తుంది.

**'రేపటి పని నేడే చేయి, నేటి పని ఇప్పుడే చేయి.** ఈ సూక్తిని అనుసరించాలి. రేపటిని ఎవరు చూశారు? భవిష్యత్తు ఎప్పుడు భవిష్యత్తుగా ఉండదు. అది ప్రతిక్షణము మనకు వర్తమాన రూపంలోనే లభిస్తుంది. ఎవరు తమ వర్తమానాన్ని వినియోగించుకుంటారో వారు తమ భవిష్యత్తును నిర్మించుకుంటూ కాలాతీతులు అవుతారు.

సమయం సదుపయోగం వ్యక్తిత్వ నిర్మాణంలో సర్వశ్రేష్ఠ గుణం.

★★★

## సద్భావన యొక్క మహత్యం

*మహాత్ముడైన ఏసుక్రీస్తు శిష్య సమేతంగా ప్రయాణిస్తూ మార్గమధ్యంలో ఒక చెట్టుక్రింద విశ్రమించారు. అందరికి విపరీతంగా ఆకలి అవ్వటంతో దగ్గరున్న మూటలు వెతకగా కేవలం 5 రొట్టెలు మాత్రమే లభించాయి. ఈ ఐదు రొట్టెలతో ఇంతమంది కడుపులు ఎలా నిండుతాయని శిష్యులంతా సందిగ్ధంలో పడ్డారు. క్రీస్తు ఆ ఐదు రొట్టెలను ఒకే గిన్నెలో చిన్న చిన్న ముక్కలుగా చేసి పెట్టి, తలొక ముక్క తినండని ఆదేశించాడు. గురువాజ్ఞను తూచతప్పక శిష్యులు పాటించారు. ఆ ముక్కలు అయిపోయేసరికి మృష్టాన్న భోజనం చేసిన రీతిగా అందరి కడుపులు నిండాయి. శిష్యులు ఇదంతా గురుదేవుని చమత్కారమేనని ప్రశంసించారు. కానీ క్రీస్తు వారిని వారిస్తూ ఇది సద్భావన యొక్క మహత్యమేగాని నా చమత్కారమేమీ కాదని వారికి తెలియజేశాడు.*

– ప్రజ్ఞాపురాణం నుండి

**మరణించిన సింహం కన్నా, బతికున్న కుక్క మేలు.**



## గాయత్రీ విద్య-16

# గాయత్రీ మంజరి

**ఏకదా తు మహాదేవం కైలాసగిరి సంస్థితమ్ ।**
**ప్రపచ్ఛ పార్వతీ వంధ్యా విబుధమండలైః ॥ (1)**

ఒకప్పుడు కైలాస పర్వతం పై విరాజమానమై ఉన్న దేవతలచే పూజింపబడు మహాదేవుని వందనీయమైన పార్వతి ఇలా అడిగింది.

**కమతం యోగమాసినో యోగేశ త్వముపాససే ।**
**యేన హి పరమాం సిద్ధిం ప్రాప్తవాన్ జగదీశ్వర ॥ (2)**

యోగేశ్వర మహాదేవ ! మీరు ఏ యోగమును ఉపాసన చేయుచున్నారు? దేనివలన మీకు పరమసిద్ధి ప్రాప్తించినది.

**శృత్వా తు పార్వతీ వాచం మధుసిక్తం శ్రుతిప్రియామ్ ।**
**సమువాచ మహాదేవో విశ్వకళ్యాణకారకః ॥ (3)**

శ్రవణానందకరమైన, మధురమైన పార్వతీ దేవి వాక్కు విని విశ్వకళ్యాణకరుడైన మహాదేవుడు ఇలా అన్నాడు.

**మహద్రహస్యం తద్గుప్తం యత్తు పృష్టం త్వయా ప్రియే ।**
**తథాపి కథయిష్యామి స్నేహాత్తత్వామహం సమమ్ ॥ (4)**

హే పార్వతి ! నీవు చాలా గుప్తమైన, నిగూఢ రహస్యమయమైన విషయముల గురించి అడిగావు. అయినా నీమీది స్నేహ వాత్సల్యములచే ఆ రహస్యమంతా నీకు చెప్తాను.

**గాయత్రీ వేద మాతాస్తి సాధ్యా శక్తిర్మతా భువి ।**
**జగతాం జననీ చైవ తాముపాసేహమేవ హి ॥ (5)**

గాయత్రి వేదమాత. పృథ్విపై ఆమె ఆద్యశక్తిగా పిలువబడుతున్నది. ఆమె విశ్వమునకు మాత. నేను ఆమెను ఉపాసన చేయుచున్నాను.

**యోగికానాం సమస్తానాం సాధనానాం తు హే ప్రియే ।**
**గాయత్ర్యేవ మతా లోకే మూలాధారో విదాంవరైః ॥ (6)**

హే ప్రియా ! సమస్త యోగిక సాధనలకు మూలాధారం గాయత్రి అని విద్వాంసులు భావిస్తారు.

**అతి రహస్యమయ్యేషా గాయత్రీ తు దశ భుజా ।**
**లోకేతి రాజతే పంచ ధారయంతి ముఖాని తు ॥ (7)**

దశ భుజముల కలిగి అత్యంత రహస్యమయమైన గాయత్రి ప్రపంచమందు పంచముఖములను ధరించి అత్యంత శోభాయమానంగా విరాజిల్లుతున్నది.

**అతి గూఢాని సంశ్రుత్య వచనాని శివస్య చ ।**
**అతి సంవృద్ధ జిజ్ఞాసా శివమూచే తు పార్వతీ ॥ (8)**

శివుని అత్యంత గూఢ వచనములను విని అతిశయింపబడిన జిజ్ఞాసతో పార్వతి శివుని అడిగింది.

**పంచాస్య దశబాహూనామేతేషాం ప్రాణవల్లభ ।**
**కృత్వా కృపాం కృపాళో త్వం కిం రహస్యం తు మే వద ॥ (9)**

హే ప్రాణవల్లభ ! హే కృపాళో ! దయచేసి ఈ పంచ ముఖముల యొక్క, దశ భుజముల యొక్క రహస్యమును నాకు చెప్పండి.

**శ్రుత్వా త్వేతన్మహాదేవః పార్వతీవచనం మృదు ।**
**తస్యాః శంకామపాకుర్వాన్ ప్రత్యువాచ నిజాం ప్రియామ్ ॥ (10)**

పార్వతి యొక్క కోమల వచనములు విని మహాదేవుడు పార్వతి దేవి యొక్క ప్రశ్నకు సమాధానం చెప్తూ ఇలా అన్నాడు.

**గాయత్ర్యాస్తు మహాశక్తిర్విద్యతే యా హి భూతలే ।**
**అనన్య భావతో హ్యస్మిన్నోతప్రోతస్తి చాత్మని ॥ (11)**

పృథ్విపై ఉన్న గాయత్రీ మహాశక్తి ఈ ఆత్మయందు అనంత భావముచే ఓతప్రోతమై (కలసిపోయి) ఉన్నది.

**విభర్తి పంచావరణాన్ జీవః కోశాస్తు తే మతాః ।**
**ముఖాని పంచ గాయత్ర్యాస్తానేవ వేద పార్వతీ ॥ (12)**

జీవుడు పంచావరణములను ధరించి ఉన్నాడు. వానినే పంచ కోశములని పిలుస్తారు. హే పార్వతి ! వీటినే గాయత్రి యొక్క పంచ ముఖములని చెప్తారు.

**విజ్ఞానమయాన్నమయ ప్రాణమయ మనోమయాః ।**
**తథానందమయశ్చైవ పంచ కోశాః ప్రకీర్తితాః ॥ (13)**

అన్నమయ, ప్రాణమయ, మనోమయ, విజ్ఞానమయ ఆనందమయ కోశములని ఈ పంచకోశములు పిలువబడుతున్నవి.

**స్వయం సమృద్ధి సాధించడం ఎంత అవసరమో సామరస్యాన్ని సాధించడం కూడా అంతే అవసరం.**

**ఏష్వేవ కోశకోశేషు హ్యనంతా రిద్ధి సిద్ధయః ।**
**గుప్తా అసాధ్య యా జీవో ధన్యత్వమధిగచ్ఛతి ॥ (14)**

ఈ కోశరూప భాండాగారముల యందు ఉన్న అనంతమైన రిద్ధి సిద్ధులను పొంది జీవుడు ధన్యుడవుతాడు.

**యస్తు యోగిశ్వరో హ్యోతాన్ పంచ కోశాన్ను వేధతే ।**
**స భవసాగరం తీర్త్వా బంధనేభ్యో విముచ్యతే ॥ (15)**

యోగి పంచకోశములను ఛేదించి భవసాగరమును దాటి బంధముల నుండి విముక్తుడవుతాడు.

**గుప్తం రహస్యమేతేషాం కోశానాం యోవగచ్ఛతి ।**
**పరమాం గతిమాప్నోతి స ఏవ నాత్ర సంశయః ॥ (16)**

ఈ కోశముల యొక్క గుప్తమైన రహస్యములను తెలిసినవాడు నిశ్చయంగా పరమగతిని పొందుతాడు.

**లోకానాం తు శరీరాణి హ్యాన్నాదేవ భవంతి ను ।**
**ఉపత్యకాసు స్వాస్థ్యం చ నిర్భరం వర్తతే సదా ॥ (17)**

మనుష్యుని శరీరం అన్నంతో తయారవుతుంది. స్వాస్థ్యం (ఆరోగ్యం) ఉపత్యకలపై ఆధారపడి ఉంటుంది.

**ఆసనేనోపవాసేన తత్త్వ శుధ్యా తపస్యయా ।**
**చైవాన్నమయకోశస్య సంశుద్ధిరభిజాయతే ॥ (18)**

ఆసనం, ఉపవాసం, తత్వశుద్ధి మరియు తపస్సుచే అన్నమయ కోశం శుద్ధి అవుతుంది.

**ఐశ్వర్యం పురుషార్థశ్చ తేజ ఓజో యశస్తథా ।**
**ప్రాణశక్త్యా తు వర్ధంతే లోకానామిత్యసంశయం ॥ (19)**

ప్రాణశక్తి వలన మనుష్యులకు ఐశ్వర్యము, పురుషార్థము తేజస్సు, ఓజస్సు, యశస్సు నిశ్చయంగా పెంపొందుతాయి.

**పంచభిస్తు మహాప్రాణైర్లఘు ప్రాణైశ్చ పంచభిః ।**
**ఏతైః ప్రాణమయః కోశో జాతో దశభిరుత్తమః ॥ (20)**

పంచ మహా ప్రాణములు, పంచ లఘు ప్రాణములు, ఈ పదింటితో ఉత్తమ ప్రాణమయకోశం తయారవుతుంది.

**బంధేన ముద్రయా చైవ ప్రాణయామేన చైవ హి ।**
**ఏష ప్రాణమయః కోశో యతమానం తు సిద్ధ్యతి ॥ (21)**

బంధములు, ముద్రలు, ప్రాణాయామములతో ప్రయత్న శీలుడైన పురుషుని ప్రాణమయకోశం సిద్ధిస్తుంది.

**చేతనాయా హి కేంద్రంతు మనుష్యాణాం మనోమతమ్ ।**
**జాయతే మహతీత్వంతః శక్తిస్తస్మిన్ వశంగతే ॥ (22)**

మనుష్యులలో చేతనత్వమునకు కేంద్రం మనస్సు అని భావిస్తారు. దానిని వశంలో ఉంచుకొనుటవలన గొప్ప అంత రంగమున శక్తి ఉత్పన్నమవుతుంది.

**ధ్యాన త్రాటక తన్మాత్రా జపానాం సాధనైర్నను ।**
**భవత్యుజ్జ్వలః కోశః పర్వత్యేష మనోమయః ॥ (23)**

ఓ పార్వతి ! ధ్యాన, త్రాటక, తన్మాత్రా జప సాధనల వలన మనోమయ కోశము అత్యంత ఉజ్జ్వలమవుతుంది.

**యథావత్ పూర్ణతో జ్ఞానం సంసారస్య చ స్వస్య చ ।**
**నూనమిత్యేవ విజ్ఞానం ప్రోక్తం విజ్ఞానవేత్తృభిః ॥ (24)**

విశ్వమును గురించి, తనను గురించి సంపూర్ణంగా తెలుసు కొనుటయే విజ్ఞానమని విజ్ఞానవేత్తలు అంటారు.

**సాధనా సోహమిత్యేషా తథా వాత్మానుభూతయః ।**
**స్వరాణాం సంయమశ్చైవ గ్రంథిభేదస్తథైవ చ ॥ (25)**

**ఏషాం సంసిద్ధిభిర్నూనం యతమానస్య హ్యాత్మని ।**
**ను విజ్ఞానమయః కోశః ప్రియే యాతి ప్రభుద్ధతామ్॥ (26)**

సోహం సాధన, ఆత్మానుభూతి యోగం, స్వరముల సంయమము, గ్రంథి భేదనం – వీని సిద్ధి వలన ప్రయత్నశీలునికి విజ్ఞానమయ కోశం వికసిస్తుంది.

**ఆనందావరణోన్నత్యాంతశాంతి ప్రదాయికా**
**తురీయావస్థితిర్లోకే సాధకం త్వధిగచ్ఛతి (27)**

ఆనందావరణ ఉన్నతి వలన శాంతి నొసంగే తురీయావస్థ సాధకునికి లభిస్తుంది.

**నాదబిందు కళానాం తు పూర్ణ సాధనయా ఖలు ।**
**నన్వానందమయః కోశః సాధకే హి ప్రబుద్ధ్యతే ॥ (28)**

నాద బిందు కళల సంపూర్ణ సాధనచే సాధకుని ఆనందమయ కోశం జాగృతమవుతుంది.

**భూలోకస్యాస్య గాయత్రీ కామధేనుర్మతా బుధై ।**
**లోక ఆశ్రయణేనామూం సర్వమేవాధిగచ్ఛతి ॥ (29)**

విద్వాంసులు గాయత్రిని భూలోకమున కామధేనువుగా భావిస్తారు. గాయత్రిని ఆశ్రయించి సర్వమును పొందవచ్చు.

**పంచాస్యా యాస్తు గాయత్ర్యాః విద్యాం యస్త్వవగచ్ఛతి ।**
**పంచతత్వ ప్రపంచాత్తు స నూనం హి ప్రముచ్యతే ॥ (30)**

పంచముఖియగు గాయత్రీ విద్యను తెలుసుకున్నవారు పంచ తత్వముల ప్రపంచమును దాటగలరు.

**జ్ఞానం వంశపారపర్య సంపద కాదు. ఎవరికి వారు కష్టపడి ఆర్జించుకోవలసిందే.**

దశభుజాస్తు గాయత్ర్యాః ప్రసిద్ధా భువనేషు యాః ।
పంచశూల మహాశూలాన్యేతాః సంకేతయంతి హి ॥ (31)

ప్రపంచమందు గాయత్రి యొక్క దశ భుజములు ప్రసిద్ధి చెందినవి. ఇవి పంచశూలములకు, పంచమహాశూలములకు సంకేతములు.

దశభుజానామేతాసాం యో రహస్యం తు వేత్తి యం సః ।
త్రాసం శూలమహాశూలానాం నా నైవావగచ్ఛతి ॥ (32)

దశ భుజముల రహస్యములు తెలిసిన వాడికి శూలముల మహాశూలముల భయం ఉండదు.

దృష్టిస్తు దోషసంయుక్తా పరేషామవలంబనమ్ ।
భయశ్చ క్షుద్రతా సావధానతా స్వార్థయుక్తతా ॥ (33)

అవివేకస్తథావేశస్తృష్ణాలస్యం తథైవ చ ।
ఏతాని దశ శూలాని శూలదాని భవంతి హి ॥ (34)

దోషముగల దృష్టి, పరావలంబనం (ఇతరుల మీద ఆధారపడుట), భయం, క్షుద్రత, సావధానం లేకుండా ఉండుట, స్వార్థం, అవివేకం, క్రోధం, బద్ధకం, తృష్ణ - ఇవే దుఃఖమునిచ్చే దశ శూలములు.

నిజైర్దశభుజైర్నూనం శూలాన్యేతాని తు దశ ।
సంహరతే హి గాయత్రీ లోకకల్యాణకారిణీ ॥ (35)

ప్రపంచమునకు శుభమును ఇచ్చే గాయత్రి తన దశ భుజములచే ఈ దశశూలములను హరిస్తుంది.

కలౌ యుగే మనుష్యాణాం శరీరాణీతి పార్వతి ।
పృథ్వీ తత్త్వ ప్రధానాని జానాస్యేవ భవంతి హి ॥ (36)

హే పార్వతి ! కలియుగమందు మనుష్యుల శరీరం పృథ్వీ తత్వ ప్రధానమైనది. ఇది నీకు తెలుసు.

సూక్ష్మతత్త్వ ప్రధానాన్యయాగోద్భూత నృణామతః ।
సిద్ధీనాం తపసామేతే న భవన్త్యధికారిణి ॥ (37)

అందువలన అన్యయుగముల యందు జన్మించిన సూక్ష్మ తత్వ ప్రధానముగా గల మనుష్యులవలె వీరు సిద్ధికి, తపస్సునకు అధికారులు కారు.

పంచాంగ యోగ సంసిద్ధ్యా గాయత్ర్యాస్తు తథాపి తే ।
తథ్యుగానాం సర్వశ్రేష్ఠాం సిద్ధిం సంప్రాప్నువంతి హి॥ (38)

అయినప్పటికి గాయత్రి యొక్క పంచాంగ యోగ సిద్ధి ద్వారా ఆ గుణముల యొక్క సర్వశ్రేష్ఠ సిద్ధి ప్రాప్తిస్తుంది.

గాయత్ర్యా వామమార్గీయం జ్ఞేయమత్యుచ్ఛసాధకైః ।
ఉగ్రం ప్రచండమత్యంతం వర్తతే తంత్ర సాధనం ॥ (39)

ఉత్కృష్ట సాధకుల ద్వారా తెలుసుకోవలసిన గాయత్రి వామమార్గ సాధన అత్యంత ఉగ్రమైనది, ప్రచండమైనది.

అతఏవ తు తద్గుప్తం రక్షితం హి విచక్షణైః ।
స్యాద్యతో దురుపయోగో న కుపాత్రైః కథంచన ॥ (40)

అందువలన విద్వాంసులు పాత్రతలేని వారు దురుపయోగం గావించకుండా ఈ యోగమును రహస్యంగా ఉంచారు.

గురుణైవ ప్రియే విద్యా తత్వం హృది ప్రకాశ్యతే
గురుం వినా తు సా విద్యా సర్వథా నిష్ఫలా భవేత్ (41)

విద్య యొక్క తత్వము గురువు ద్వారా మాత్రమే హృదయంలో ప్రకాశిస్తుంది. గురువు లేకపోతే విద్య ఫలించదు.

గాయత్రీ తు పరావిద్యా తత్ఫలావాప్తయే గురుః ।
సాధకేన విధాతవ్యో గాయత్రీ తత్వ పండితః ॥ (42)

గాయత్రి పరా విద్య. దీని ఫల ప్రాప్తి కొరకు సాధకునికి గాయత్రీ తత్వమును సంపూర్ణంగా తెలిసిన గురువు అవసరము.

గాయత్రీం యో విజానాతి సర్వం జానాతి స నను ।
జానాతీమాం యస్తస్య సర్వా విద్యాస్తు నిష్ఫలాః ॥ (43)

గాయత్రి తెలిసిన వానికి సర్వం తెలియును. ఇది తెలియని వానికి వాని అన్ని విద్యలు నిష్ఫలమే.

గాయత్రైవ తపో యోగః సాధనం ధ్యానముచ్యతే
సిద్ధినాం సా మతా మాత నాతః కించిత్ బృహత్తరం (44)

గాయత్రియే తపము, యోగము, సాధన, ధ్యానము, ఆమెయే సిద్ధులకు మాతగా భావించబడుతుంది. గాయత్రిని మించిన వస్తువు వేరే ఏమి లేదు.

గాయత్రీ సాధనా లోకే న కస్యాపి కదాపి హి ।
యాతి నిష్ఫలతామేతత్ ధృవం సత్యం హి భూతలే ॥ (45)

ఎవరికి, ఎప్పుడు గాయత్రీ సాధన ఈ ప్రపంచంలో నిష్ఫలం కాదు. ఇది పుడమిపై తిరుగులేని సత్యము.

గుప్త ముక్తం రహస్యాం యత్ పార్వతి త్వాం పతివ్రతామ్ ।
ప్రాప్స్యన్తి పరమాం సిద్ధిం జ్ఞాస్యన్త్యేతత్ తు యే జనాః ॥ (46)

హే పరమ పతివ్రత పార్వతి ! నేను చెప్పిన గుప్త రహస్యములను తెలుసుకున్నవాడు పరమసిద్ధిని పొందుతాడు.

**ఎదుటివారిలో తప్పులు వెదకడమే పనిగా పెట్టుకుంటే బంధువులు మిత్రులు ఎవరు మిగలరు.**

గాయత్రీ మంజరి యందు ఉన్న 46 శ్లోకములలో భారతీయ ఆధ్యాత్మిక విద్య సారాంశం ఇవ్వబడింది. దీనిని జాగ్రత్తగా గ్రహించి చక్కగా ఆచరించినవారు ఇహ పర లోకములందు ఉన్న అన్ని కష్టములన్నింటిని గట్టెక్కి, సత్పురుషుల సాంగత్యమును పొందటానికి అర్హత లభిస్తుంది.

మనకు కనిపించే భౌతిక శరీరం "అన్నమయకోశ" అంతర్గతము. దీనిని స్థిరంగా ఉంచడానికి మనుష్యులు తినుచు, త్రాగుచు, నిద్రించుచు, మలమూత్ర విసర్జన చేస్తుంటారు. మనుష్యులు ఆరోగ్యంగా దీర్ఘ ఆయువుతో, శక్తితో శరీరమును ఉంచుకునే కిటుకును తెలుసుకోవడం లేదు. అన్నమయకోశం లోపల అంతకన్నా ముఖ్యమైన ప్రాణమయ కోశం ఉన్నది. దీని సాధన ద్వారా విభిన్న శారీరిక అంగములపై అధికారం ప్రాప్తించుటయే గాక, వాని శక్తి ఎంతో అధికమవుతుంది. ప్రాణమయ కోశము కన్నా సూక్ష్మమైన మనోమయ కోశం ఉన్నది. దీని సాధన వలన మానసిక శక్తులు కేంద్రీకృతం అయి అనేక అద్భుత కార్యములు సాధ్యమవుతాయి. దీని సాధనా విధానములలో ముఖ్యమైనది ధ్యానము. దీనివలన ఇతర వ్యక్తులను వశమునందు ఉంచుకొనుట, జరుగబోయే సంఘటనలను ముందరే తెలుసు కొనుట, భూత-భవిష్యత్తులకు సంబంధించిన జ్ఞానము వంటి శక్తులు లభిస్తాయి.

మనోమయ కోశం తరువాత దీనికన్నా సూక్ష్మమైన విజ్ఞానమయ కోశమున్నది. దీనిని సాధించుకున్న సాధకుడు ఆత్మ యొక్క క్షేత్రం నందు ప్రవేశిస్తాడు, జీవుని బంధించి ఉన్న మూడు గ్రంథుల విడిపోతాయి. చివరిలో ఆనందమయకోశం వస్తుంది. దీని సాధనచే పంచతత్త్వములచే తయారుచేయబడిన మానవుడు పరమాత్మ సన్నిధికి చేరతాడు. ఈ ప్రకారంగా గాయత్రి మంజరి యందలి కొద్ది శ్లోకములందే యోగశాస్త్రం యొక్క గంభీరమైన జ్ఞానస్వరూపం చెప్పబడింది.

★★★

## భరతుని సౌజన్యం

*వాస్తవానికి సంపద, సౌకర్యాలు సర్వస్వం కాజాలవు. ఆదర్శం ముఖ్యం. దానికోసం ఒక్కొక్కసారి లభించిన వాటిని త్యాగం చేయవలసి వచ్చినా ఏ మాత్రం హాని, లోటు సంభవించవు. భరతునికి రాజ్య సింహాసనం లభించింది. కాని ఆయన దానిని అవినీతితో లభించినదిగా భావించి తిరస్కరించాడు. తన నిర్లిప్తతను, నిర్మోహాన్ని ఋజువుచేస్తూ రాముని వలెనే జటాజూటాలు ధరించి ఇంట్లోనే ఉండి వనవాసం చేశాడు. సింహాసనంపై రాముని పాదుకలను ప్రతిష్ఠించి ఆయన ప్రతినిధిగా రాజ్యపాలన గావించాడు.*

*ఈ విధమైన ఆత్మీయతా భావాన్ని పెనవేసికొన్న కుటుంబం కావటమువలనే రాముని కుటుంబం ప్రతి వ్యక్తి చేత ఆరాధించబడింది. రాముని స్థానం రామునిదైతే భరతుని స్థానం భరతునిది. ఒకరు మర్యాదపాలన కోసం దిగివచ్చిన మర్యాదా పురుషోత్తముడై, అవతారమూర్తిగా కీర్తింపబడితే మరొకరు తన త్యాగ భావన, కుటుంబం పట్లగల నిష్ఠ, ఆత్మీయత వంటి ఉత్కృష్ట గుణనిధివలన వందనీయుడైనాడు.*

*- ప్రజ్ఞాపురాణం నుండి*

## ప్రేమ్‌చంద్ యొక్క విశ్వకుటుంబ భావన

*సుప్రసిద్ధ రచయిత ప్రేమ్‌చంద్‌యొక్క కోటు చాలా శిధిలమై చిరిగిపోయింది. అయినా అలాగే కాలక్షేపం చేస్తున్న ఆయనను భార్య కొత్త కోటు కొనుక్కోమని ఎన్నోసార్లు చెప్పింది. కానీ ఆయన డబ్బు సర్దుబాటు కావటంలేదని వాయిదా వేస్తుండేవాడు. ఒకనాడాయన భార్య అతికష్టంమీద ఆదాచేసిన డబ్బును భర్తచేతుల్లో పెట్టి, ఈ రోజు తప్పకుండా క్రొత్తకోటు కొని తీసుకొని రమ్మని కోరింది. అయినా ఆ రోజు కూడా ఖాళీ చేతులతోనే ఇంటికి తిరిగి వచ్చిన ఆయనను భార్య కోటు తీసుకొని రాకపోవటానికి కారణ మేమిటని ప్రశ్నించగా ఆయన ఒక పేదపిల్ల వివాహం కొంత డబ్బు కొరత వల్ల ఆగిపోతోంది. నీవు నీ అవసరాలను మాను కొని నా కోసం డబ్బులు దాచి కోటు కొనాలనుకున్నావు. నేను నా కంటె అవసరంలో ఉన్నవారికి నా అవసరాన్ని వాయిదా వేసి నా దగ్గరున్న డబ్బులు ఇవ్వటం జరిగింది.* ***మన కుటుంబానికి గీచుకొన్న పరిధి నుండి బయటకు తొంగి చూస్తే మన నిజమైన కుటుంబం దృష్టి గోచరమవుతుంది.*** *నా కుటుంబానికి నేను సహాయం చేయటం నా బాధ్యత. ఇది సర్వ సాధారణమైన విషయం. కాని ఇదే నీకు కష్టం కలిగిస్తే నన్ను మన్నించు" అన్నాడు ప్రేమ్‌చంద్. ఆమె భర్తవంక అభినందన దృక్కులతో ఒక్కసారి కన్నులెత్తి చూచి తిరిగి తలవంచుకున్నది.*

*- ప్రజ్ఞాపురాణం నుండి*

**మనం గుర్తించడానికి నిరాకరించినంత మాత్రాన నిజం అబద్ధమైపోదు.**



### బాలల భవితకు బంగారు బాట-24

# రెండు కళ్లు

సరస్వతిపురంలో విద్యాధరుడు అనే పండితుడు ఉన్నాడు. ఆయన అనేక గ్రంథాలు చదివి అంతులేని జ్ఞానాన్ని సంపాదించుకున్నాడు. ఆ జ్ఞానాన్ని అందరికి పంచి పెట్టాలన్న జిజ్ఞాసతో "సరస్వతీ నిలయం" అనే పేరుతో ఒక గ్రంథాలయం నిర్వహిస్తున్నాడు. ఆ గ్రంథాలయంలో జ్ఞానాన్ని అందించే పుస్తకాలు, విజ్ఞానాన్ని పంచే పుస్తకాలు, చరిత్రను తెలియచేసే పుస్తకాలు, ధర్మాన్ని బోధించే పుస్తకాలు, పిల్లలకు ఉపయోగపడే పుస్తకాలు మొదలయినవి చాలా చాలా ఉన్నాయి. వాటిని అన్నింటినీ వర్గాలుగా విభజించి చక్కగా ఒక క్రమంలో అమర్చాడు. ఆసక్తి గలవారు వచ్చి, అక్కడే కూర్చుని చదువుకుని వెళ్లేవారు. వయస్సుతో సంబంధం లేకుండా అనేక మంది స్త్రీలు, పురుషులు, బాలబాలికలు వస్తుండేవారు. చదువుకునే సమయంలో ఎవరికైనా, ఏదైనా అనుమానం వస్తే విద్యాధరుని అడిగి తెలుసుకునేవారు.

కొంతకాలం ఇలాగే గడిచిపోయింది. విద్యాధరుడు వృద్ధాప్యం లోకి అడుగుపెట్టాడు. తన తర్వాత ఈ గ్రంథాలయాన్ని నడిపించే వారు కావాలి కదా! అని ఆలోచించాడు. మిత్రులతో చర్చించాడు. "గ్రామంలోని నిరుద్యోగులను పిలిపించి ఇద్దరు ఉద్యోగులను నియమించండి" అని సలహా ఇచ్చారు మిత్రులు. మరునాడే కొంతమంది నిరుద్యోగులను పిలిపించాడు. వారిని తనకు కావలసిన విధంగా రకరకాలుగా ప్రశ్నించాడు. చిట్టచివరకు 'కేశవుడు, సదాశివుడు' అనే ఇద్దరు యువకులు నచ్చారు. ఆ ఇద్దరిని మరురోజు రమ్మన్నాడు. అనుకున్నా విధంగానే వారిద్దరు ఉదయానికల్లా వచ్చేశారు. మిక్కిలి పాతబడిపోయిన రెండు పుస్తకాలను తెచ్చి, చెరి ఒకటి ఇచ్చాడు విద్యాధరుడు. "మీరు ఈ ఈ పుస్తకాలను చదివి, రేపు ఉదయం తీసుకురండి. ఈ పుస్తకాల్లో చిన్న చిన్న ప్రశ్నలు అడుగుతాను. వాటికి సమాధానాలు చెప్పాలి" అని చెప్పి పంపించాడు.

మర్నాడు ఇద్దరు తమకు ఇచ్చిన పుస్తకాలను తీసుకుని వచ్చారు. కేశవుడు తనకు ఇచ్చిన పుస్తకాన్ని ఇచ్చివేస్తూ "ఇది చాలా పాత పుస్తకం. కమ్మలు ఎక్కడ చిరిగిపోతాయో అని చాలా భయపడ్డాను సార్. చాలా జాగ్రత్తగా చదవాల్సి వచ్చింది" అన్నాడు. విద్యాధరుడు చిరునవ్వుతో పుస్తకం తెరిచాడు. అందులోంచి కొన్ని ప్రశ్నలు అడిగాడు. కేశవుడు చురుగ్గా టకాటక సమాధానాలు చెప్పాడు. విద్యాధరుండు సంతోషంగా సదాశివుని పిలిచాడు.

సదాశివుడు పుస్తకం ఇచ్చి వినయంగా నిలబడ్డాడు. అందులోంచి కొన్ని ప్రశ్నలు అడిగాడు విద్యాధరుడు. సదాశివుడు ఒక్కదానికి కూడా సమాధానం చెప్పలేకపోయాడు. "ఇంతమంచి పుస్తకాన్ని చేతికిస్తే చదవకుండానే తెచ్చావేంటి? ఉద్యోగం మీద నీకున్న శ్రద్ధ ఇంతేనా?" అని కొంచెం కటువుగా ప్రశ్నించాడు విద్యాధరుడు. సదాశివుడు "నిన్న ఇంటికి వెళ్లగానే పుస్తకం తెరిచి చూశాను సార్. అది కుట్లు తెగిపోయి కనిపించింది. పేజీల మధ్యలో అక్కడక్కడా చెద పురుగులు పాకుతూ కనిపించాయి. దాంతో మెల్లగా ప్రతిపేజీని దులుపుకుంటూ, క్రమంలో పెట్టి కుట్టాను. నాకు రాత్రంతా అదేపని సరిపోయింది. ఉదయం మీరు చెప్పిన సమయానికి వచ్చే తొందరలో చదవలేకపోయాను క్షమించండి" అంటూ తలవంచుకున్నాడు.

ఇద్దరి సమాధానాలు విద్యాధరుని సంతృప్తిని కలిగించాయి. "నాయనలారా ! నాకు మీలాంటి యువకులే కావాలి. ఈ గ్రంథాలయం నాకు పంచప్రాణాలు. ఇక్కడకు వచ్చి చదువుకునే పాఠకులకు ఓపిగ్గా సందేహాలు తీర్చడానికి ఒక వ్యక్తి కావాలి. దానికి ఒకరు సరిపోతారు. దుర్లభమైన ఈ పుస్తకాలను సరిచేసి, క్రమంలో పెట్టగల సమర్థుడు కావాలి. దానికి మరొకరు సరిపోతారు. రేపే మీరు ఇద్దరు వచ్చి మీమీ ఉద్యోగాలలో చేరిపోండి. మీరు చూపించిన శ్రద్ధాసక్తులు చూస్తూ ఉంటే నా తర్వాత ఈ గ్రంథాలయ సంగతి ఏంటి? అన్న బెంగ తీరి పోయింది. నేను బ్రతికి ఉన్నంతకాలం మీకు కావలసిన సలహాలను ఇస్తూ అండగా నిలుస్తాను. ఈలోగా తీరిక సమయాల్లో ఈ పుస్తకాలను అన్నింటినీ చదవండి. అన్ని విధాలుగా మీకు నేను అండగా ఉంటాను" అంటూ ప్రోత్సహించాడు.

విన్నారుగా బాలలూ! జీవితంలో స్థిరపడాలి అనుకున్న వారికి "శ్రద్ధ-ఆసక్తి" రెండూ రెండు కళ్లలాగా పనిచేస్తాయి.

**క॥ శ్రద్ధాసక్తులు చూపుచు**
**బుద్ధిగ దొరికిన పనులు పూర్తిగ సేయన్**
**బుద్ధికి మెచ్చుచునందరు**
**శ్రద్ధకు జోహారులంద్రారయమున బాలా!**

– మధుర కవయిత్రి,
పొన్నూరు హైమవతీ శాస్త్రి

**గెలవాలన్న తపన బలీయంగా ఉన్నచోట ఓటమి అడుగైనా పెట్టలేదు.**

ధారావాహిక ప్రజ్ఞోపనిషద్ : ప్రథమకాండే పంచమోఽధ్యాయః

# ఉదార భక్తి భావనా ప్రకరణం

**ప్రేమేవ పరమేశోఽస్తి స ఆనంద స్వరూప దృక్ ।**
**జడో వా చేతనో వాఽపి ప్రియతాం యాతి ప్రేమతః ॥ 54**

ప్రేమయే పరమేశ్వరుడు. ఆ పరమేశ్వరుడే ఆనంద స్వరూపుడు. చేతన, అచేతనములను కూడా పరమేశ్వరుడు ప్రేమ తత్త్వంతో అలరిస్తాడు. ఈ ప్రేమ స్వరూపుడైన భగవంతుని నవవిధ భక్తి రూపములతో (శ్రవణం, కీర్తనం, స్మరణం, పాదసేవనం, స్నేహం, దాస్యం, వందనం, అర్చణం, ఆత్మనివేదన) సేవించి ఆ ఆనందస్వరూపుని దివ్యచరణావిందాలను అనునిత్యం సేవించి తరించడమే భక్తులకు పరమావధిగా చెప్పబడుతుంది. నిశ్చల భక్తితో, నిర్మలమైన రీతిలో, వేరే ఇతర ద్యాసలు లేకుండా, తన, మన, ధనములను అర్పించినపుడే ఆ అలౌకిక ఆనందాన్ని భక్తుడు పొందగలుగును. 'ఆనందో బ్రహ్మ', 'చిదానందస్వరూపుడు' అన్న నామాంతరాలతో భగవంతుడు భక్తుల హృదయాలలో విలసిల్లుతూ ఉంటాడు.

**ఈశ్వరం ప్రతి ప్రేమ్నేతి, శ్రద్ధాదర్శాన్ ప్రతిధృవమ్ ।**
**ఆత్మవత్ సర్వభూతేషు దృష్టికోణో భవిష్యతి ॥ 55**

భగవంతుని పట్ల ప్రేమను ప్రదర్శించడం, అంటే భక్తి, శ్రద్ధ, ఆదర్శాలతో సేవించడమే. ఇది భగవంతుని సృష్టి. ఆ భగవంతుడు ఇచ్చిన జన్మను, ఆయనకే అర్పించడం న్యాయం. అది భక్తుని ధర్మం. కేవలం కోరికలతో మాత్రమే భగవంతుని దర్శించరాదు. సమస్త జీవులు నావంటివారే, నాలోగల భగవంతుడే అందరి లోనూ ఉన్నాడు. కావున భగవంతుని సేవించడం కంటే ఆయనచే సృష్టించబడిన జీవులను సేవించడం పరమ ప్రీతికరం.

ఇతర స్త్రీలను మాతృప్రేమతో, ఇతరుల సంపదలను మట్టి అన్న నిర్గుణ భావనతో, అందరూ నావారే. అందరికీ భగవంతుడు నాకు ఇచ్చిన అవకాశం లాంటిదే ఇచ్చాడు. కావున తర, తమ భేదాలను విడిచి, ఆ ఆనంద స్వరూపుని సేవించి తరించాలి అన్న రీతిలో భక్తుడు మెలగాలి.

**వసుధైవ కుటుంబం చ, భావనాయాః క్రియాన్వితిః ।**
**కర్తారస్తే, క్రియాలాపాశ్చలిప్యంత్యంజసైవ తు ॥ 56**

"ఉదార చరితానాం తు వసుధైవ కుటుంబకమ్" అన్న ఆర్యోక్తి మనకు తెల్సినదే. మహనీయులకు తనవారు, పరాయివారు అన్న భేదం ఉండదు. సామాన్యులకు మాత్రమే అటువంటి సాధారణ స్థితి ఉంటుంది. కానీ ఆత్మాశ్రయ ప్రేమతో, అనవరతం ఆ భగవంతుని సేవిస్తారు. అటువంటి మహా భక్తులు ఏ పనిచేసినా పారలౌకిక దృష్టితోనే చేస్తారు. లౌకిక దృష్టి, వాంఛలు, భౌతిక ఆనందం అనే అంశాలకు వారి భక్తిలో తావుండదు. మహాభక్తులు తమ నిత్యకృత్యాలను సైతం ఎటువంటి లాభాపేక్ష లేకుండా, భగవత్ సేవగానే భావించి తరిస్తారు.

కబీర్‌దాస్, తులసీదాస్, మీరాబాయి వంటి ఎందరో భక్తులు తమను తాము, త్రికరణశుద్ధిగా సమర్పించుకొన్న కథలు మనకు తెల్సినవే.

**బాలానాం భక్షణే ప్రీతిస్తథాఽఽ దానే పరంతు తే ।**
**ప్రౌఢా విభజ్య కాలేచ క్షుధార్తాస్తే దదత్యపి ॥ 57**

బాలలు ఆకలి ఉన్నా, లేకున్నా తినడంలోను, ఆస్వాదించడం (ద్రవ ప్రదార్థాలను స్వీకరించడం) లోనూ ఆసక్తి ప్రదర్శిస్తూ, ఆనందాన్ని పొందుతారు. కానీ వయస్సు చేత అనుభవం వల్ల పరిపక్వత చెందిన పెద్దవాళ్లు, ఆకలివేసినపుడు మాత్రమే తగిన కాలంలో తాము తినగల్గిన వాటినే తింటారు. బాలలకు ఆరోగ్యం పట్ల అవగాహన లేకపోవడం వల్ల అనారోగ్యం పాలయ్యే అవకాశం ఉంది.

పెద్దవాళ్ళకు నియంత్రిత ప్రణాళిక వల్ల అనారోగ్యం కలుగక పోవచ్చును. అలాగే ప్రతి ఒక్కరు తమ శక్తి, యుక్తులకు అనుగుణంగా ప్రవర్తిస్తే అనర్థాలు ఉండవు.

**ఏవం విధా ఉదారానుదానినో యేవరంతు తే ।**
**అభావగ్రస్తా దృశ్యంతే రసాగ్రాహి విలాసినామ్ ॥ 58**

ఇటువంటి అవగాహనతో, ఎవరైతే జీవన స్థితిగతులను అన్వయించుకుంటారో వారు ఆహార విషయముతో రసాన్ని గ్రోలి, ఆత్మానంద స్థితికి చేరుకుంటారో, అదేవిధంగా దైవసంబంధమైన భక్తి ప్రపత్తులను కల్గి ఉన్నవారు కూడా అలౌకిక ఆనందాన్ని ఆస్వాదించగలరు.

**ఆత్మతోషస్య లోకస్య మానస్యానుగ్రాహస్యచ ।**
**దైవస్య త్రివిధోలాభః ప్రాప్యతే తైస్తు యః సదా ॥ 59**

ఆత్మసంతృప్తి, లోకమునందు పరపతి, దైవానుగ్రహము అనే మూడు ప్రయోజనాలు మానవులకు లభిస్తాయి. మనం చేపట్టే పనులందు ఆత్మసంతృప్తిని పొందుతూ, అత్యాశ, నిరాశలకు దూరంగా ఉంటూ, అందరికీ ఆదర్శప్రాయులై, ఉన్నత పరపతిని పొందడం, తద్వారా దైవానుగ్రహం పొందడం అనే స్థితులు కల్గి, మానవులకు పరిపూర్ణత్వాన్ని ఆపాదిస్తాయి.

*– కథాకథన వ్యాఖ్యానం : సాధన నరసింహాచార్య*

**నాయకత్వమంటే దారి పొడవునా ముందు నడవడం కాదు. బాట వెయ్యడం, దారిచూపడం.**

సూర్య విజ్ఞానం - 15

# ఆదివారం ఉపవాసం ఎందుకు చేయాలి?

ఉపవాసం వల్ల కలిగే లాభాల గురించి అందరికి తెలుసు. దీనివల్ల అజీర్ణం నయమవుతుంది. జీర్ణాశయం క్రొత్త చేతనత్వంతో ఇంకా బాగా పనిచెయ్యడం మొదలు పెడ్తుంది. పొట్టలో ఉన్న జీర్ణం కాని ఆహారం వల్ల ఉత్పన్నమయ్యే విషం తయారవదు. ఆహారం తక్కువగా తీసుకునేవారు దీర్ఘజీవులవుతారని డాక్టర్ల అభిప్రాయం. ఎక్కువగా తినేవారు, పొట్టనిండా ఖాళీ లేకుండా తినేవారు, ఎప్పుడూ పొట్టకు విశ్రాంతినివ్వనివారు, పొట్టకు ఒక్క రోజు కూడా సెలవు ఇవ్వనివారు జీవన సంపదను తొందరగా పోగొట్టుకుంటారు. దీర్ఘాయుర్దాయం మాట అలా ఉంచి ఈ ప్రపంచం నుంచే మూటముల్లె సర్దుకోవాల్సి ఉంటుంది.

ఆరోగ్యదృష్టితో ఉపవాసం యొక్క మహత్వాన్ని గురించి చెప్తూ ఆయుర్వేద శాస్త్రం **"లంఘనం పరమౌషధం"** అంటుంది. ఆకలిగా ఉండటం వల్ల రోగాలు పోతాయి, రోగి రక్షించబడతాడు. అంటువ్యాధులలో, ప్రమాదకరమైన రోగములు సంభవించినపుడు రోగులను ఉపవాసం ఉంచడం చికిత్సలో ఒక భాగం. ఇన్ఫ్లూయెంజా, నిమోనియా, ప్లేగు, టైఫాయిడ్ వంటి రోగాలు వచ్చినపుడు చికిత్సలో లంఘనం – ఉపవాసం లేకుండా రోగాలు తేలికగా తగ్గవు. ప్రాకృతిక చికిత్సా విజ్ఞానంలో సమస్త రోగములకు ఉపవాసమే (పాక్షికం కావచ్చు, సంపూర్ణం కావచ్చు) ప్రధానంగా భావించబడుతున్నది.

కాని ఉపవాసం యొక్క ఉపయోగం ఇంతవరకే కాదు. దీనిలో అనేకమైన గుహ్యమైన (రహస్యమైన) లోతైన విషయాలు కూడా ఉన్నాయి. వీటిని అర్థం చేసుకున్నప్పుడు ఉపవాసం కూడా ఒక గొప్ప యోగసాధన అని తెలుస్తుంది. గీతలో **"విషయాని వర్తన్తే నిరాహారస్య దేహినః"** అని చెప్పారు. దీనిని చక్కగా అర్థం చేసుకున్న ఋషులు ప్రతి నెలలో చేయదగిన ఉపవాసాలకు ధార్మిక మహత్వాన్ని ఇచ్చారు.

సాధనా విజ్ఞానంలో అన్నమయ కోశ శుద్ధికి ఉపవాసం అత్యంత ఆవశ్యకం అని చెప్పబడింది. శరీరంలో అనేక రకాల ఉపత్యికలు కనబడతాయి. "శరీర విజ్ఞాని వీటిని నాడీ గుచ్ఛకము లని అంటారు. శరీరంలో చాలా స్థానములలో సన్నని నాడులు దగ్గర దగ్గరగా అంటుకుని కనుపిస్తాయి. ఈ గుచ్ఛకములు చాలాసార్లు తాడువలె పేనుకుని కనుపిస్తాయి. కొన్నిచోట్ల ఈ గుచ్ఛకములు ముడులవలె గట్టిగా గుండ్రంగా తయారవుతాయి. అనేకసార్లు ఇవి సమానంతరంగా వెళ్లే సర్పముల వలె వెళ్తాయి, చివరిలో వాటి తలలు కలసిపోతాయి. అనేక చోట్ల ఇవి మర్రిచెట్టు వలె శాఖోపశఖలుగా విస్తరిస్తాయి. ఈ విధంగా అనేక గుచ్ఛకములు పరస్పర సంబంధం పెట్టుకుని ఒక పరిధిలో ఉంటాయి. వీటి రంగు, ఆకారాలలో చాలా తేడాలుంటాయి.

వైజ్ఞానికులు ఈ నాడి గుచ్ఛకముల (nerve plexus) గురించి పెద్దగా తెలుసుకోలేకపోయారు. కాని సాధనా విజ్ఞాన మర్మములు తెలిసిన వారు ఈ ఉపత్యికలు శరీరంలో అన్నమయ కోశమును బంధించి ఉంచే గ్రంథులని చెప్తారు. మృత్యువు సంభవించినపుడు ఈ బంధనాలన్నీ విడిపోతాయి. ఒక గుచ్ఛకం కూడా కనిపించదు. ఈ ఉపత్యికలు అన్నమయకోశం యొక్క గుణ దోషముల ప్రతీకలు.

"ఇంధికా" జాతి ఉపత్యికలు చంచలత, అస్థిరత్వానికి ఉద్విగ్నతకు ప్రతీకలు. ఏ వ్యక్తులలో ఈ జాతి నాడీ గుచ్ఛకములు అధికంగా ఉంటాయో వారు ఒక స్థానంలో కూర్చుని పనిచేయలేరు.

"దీపక్" జాతి ఉపత్యికలు ఆవేశం, క్రోధం, శారీరిక వేడిని, నీరసాన్ని కలుగజేస్తాయి. ఇటువంటి గుచ్ఛకములు అధికంగా ఉన్నవారు చర్మరోగాలు, కురుపులు, మొటిమలు, ముక్కు నుండి రక్తం కారడం, మూత్రం పచ్చగా ఉండటం, కళ్ళలో మంట మొదలైన రోగాల బారినపడతారు.

"భోచికా" జాతి ఉపత్యికలు అధికంగా ఉన్న శరీరంలో చమట, కఫం, మూత్రం ఎక్కువవుతాయి. నీళ్ళ విరోచనములు తరచూ అవుతుంటాయి. జ్వరం వస్తుంటుంది.

"అప్యాయని" జాతి ఉపత్యికలు బద్ధకం, అధిక నిద్ర, ఉత్సాహం లేకపోవడం, శరీరం బరువెక్కడం కలుగజేస్తాయి. ఇవి ఉన్న వ్యక్తి కొంచెం శ్రమ చేసినా అలసిపోతారు. అతని వల్ల కష్టమైన శారీరిక, మానసిక పనులు జరుగవు.

"పూషా" జాతి ఉపత్యికలు కామవాసన వైపు మనస్సును లాగుతాయి. సంయమము, బ్రహ్మచర్యం నిలవవు. 'పూషా' ఉపత్యికల యొక్క కొంచెం ఉత్తేజన మనస్సును వికలం చేస్తుంది. శివునిపై మన్మథుడు తన కుసుమబాణంతో శరసంధానం చేసి పూషా ఉపత్యికలను ఉత్తేజింపజేశాడు.

**ఓటమి గురువులాంటిది. ఏమి చెయ్యకూడదో అది నేర్పుతుంది.**

"చంద్రికా" జాతి ఉపత్యికలు సౌందర్యాన్ని ఇనుమడింప జేస్తాయి. అవి ఎక్కువగా ఉండటం వల్ల మాటలలో మాధుర్యం, ముఖంలో ఆకర్షణ, కోమలత్వం పెంచుతాయి.

"కపిల" జాతి ఉపత్యికలు, నమ్రత, భయం, గుండెలో దడ, చెడు స్వప్నములు, సందేహాలు, మనస్సు నిలకడగా లేకపోవడం, నపుంసకత్వం, వీర్యరోగం కలిగిస్తాయి.

"ధూసార్వి" ఉపత్యికల వల్ల సంకోచించే శక్తి ఎక్కువ అవుతుంది. కురుపులు ఆలస్యంగా పక్వానికి వస్తాయి. కఫం బయటకు రాదు, కాలకృత్యములు ఆలస్యంగా అవుతాయి. మనస్సులో మాట చెప్పేందుకు సంకోచం వంటి లక్షణాలు ధూసార్వి ఉపత్యికలు కలుగజేస్తాయి.

"ఊష్మ" జాతి ఉపత్యికలు ఎక్కువగా ఉండటం వల్ల మనిషి రొప్పుతుంటాడు. చలికాలంలో కూడా వేడిగా ఉంటుంది. కోపం తొందరగా వస్తుంది, హడావుడి చేస్తుంటారు. శ్వాస ప్రశ్వాసలు వేగం ఉంటాయి.

"అమాయా" జాతి గుచ్ఛకములు దృఢతకు, బలానికి, కఠోరతకు, గంభీరతకు మొండితనానికి ప్రతీకలు. ఇలాంటి శరీరాలకి బాహ్యంగా చేసే పరిచర్యలు ఉపయోగపడవు. మందులు పనిచేయవు. వాటంతవే తగ్గాలి. పథ్యం చేసినా ప్రయోజనం ఉండదు. సంయమ నియమపాలనలు కూడా ఉపకరించవు.

"ఉద్గీత" జాతి ఉపత్యికల వల్ల సంతానం కలుగదు. అవి స్త్రీ పురుషులలో అధికంగా ఉంటే, సంపూర్ణ ఆరోగ్యం ఉన్నప్పటికి సంతాన యోగ్యత ఉండదు.

స్త్రీ-పురుషులలో "అసితా" జాతి ఉపత్యికలు అధికంగా ఉంటే వారు ఆ లింగమునకు చెందిన సంతానం పొందుతారు. 'అసితా' ఉపత్యికలు ఎక్కువగా ఉన్న స్త్రీలు బాలికలను, పురుషులు పుత్రులను పొందే అవకాశం ఎక్కువగా ఉంటుంది.

"యుక్త హిస్రా" జాతి గుచ్ఛకములు క్రూరత, దుష్టత్వం, పరులను పీడించడానికి ప్రేరణనిస్తాయి. అటువంటి వ్యక్తులు కావలసిన ధన సంపత్తులు ఉన్నప్పటికి అనుచిత మార్గములను అనుసరిస్తారు. అకారణంగా ఇతరులపై ఈర్ష్య, ద్వేషం పెంచుకుంటారు, దౌర్జన్యాలు చేస్తుంటారు.

"హిస్రా" ఉపత్యికలు అశాంతికి ప్రతీకలు. తమ తలలను తామే కొట్టుకుంటుంటారు. ఆత్మహత్యలు చేసుకుంటారు. తమ పిల్లలను చావగొడ్తుంటారు, చెడ్డ పనులు చేస్తుంటారు.

యోగ శాస్త్రములలో ఇటువంటి 96 రకాల ఉపత్యికల వర్ణన ఉన్నది. ఈ గ్రంథులు వ్యక్తులను వారి ఇచ్ఛానుసారం ఉండనివ్వవు. మనిషి తన వ్యక్తిత్వాన్ని పెంపొందించుకునేందుకు ఉపాయాలు ఉండవచ్చు కాని ఈ ఉపాయాలు చాలాసార్లు ఫలించవు. ఇటువంటి వ్యక్తి తనను అసహాయుడిగా, చాతగాని వాడిగా భావిస్తుంటాడు.

ఉపవాసానికి ఈ ఉపత్యికలను సంతులనంగా ఉంచడానికి ఒక విస్తృత విజ్ఞానమున్నది. ఒక ప్రత్యేక ప్రయోజనానికి, ఒక ప్రత్యేక మాసంలో, ఒక ప్రత్యేక ముహూర్తంలో, ఒక ప్రత్యేక పద్ధతి ప్రకారం ఉపవాసం చేయటం వల్ల ఒక ప్రత్యేకమైన ఫలితం లభిస్తుంది. ఇలాంటి వివరాలు శాస్త్రాలలో అనేక చోట్ల లభిస్తాయి. ఋతువుల అనుసారం శరీరంలోని ఆరు అగ్నులు తగ్గుతూ, ఎక్కువవుతూ ఉంటాయి. ఊష్మ, బహువృచ, హ్వాతి, రోహితా, ఆతృతా, వ్యాతి అనే శారీరిక అగ్నులు గ్రీష్మం నుండి వసంత పర్వం వరకు క్రియాశీలంగా (active) ఉంటాయి.

ఉత్తరాయణ దక్షిణాయన గోళార్ధ స్థితి, చంద్రుని యొక్క వృద్ధి క్షీణతలు, భూమిపై నక్షత్రాల ప్రభావం, సూర్య కిరణముల మార్గము వీటన్నింటికి శరీరంలోని ఋతు అగ్నులతో సంబంధం ఉండటం వల్ల ఎలాంటి పరిణామాలు కలుగుతాయి అనేది ధ్యానంలో ఉంచుకుని, ఏ తిథిలో పద్ధతి ప్రకారం ఉపవాసం ఉంటే ఎలాంటి పరిణామం ఉంటుందో నిర్ధారించారు. **కార్తీక మాసం కృష్ణ పక్షం నాల్గవ రోజు ఉపవాసం ఆచరిస్తే దాంపత్య ప్రేమ పెరుగుతుంది.** ఎందుకంటే ఆ రోజు గోళార్ధస్థితి, చంద్రకళలు, నక్షత్ర ప్రభావము, సూర్య మార్గం - వీటన్నింటి పరిణామం శారీరిక అగ్నితో సమాన్వితమై శరీరం, మనస్సు యొక్క స్థితిని ఎలా మారుస్తుందంటే దాని వల్ల దాంపత్య సుఖం దృఢతరం, చిరస్థాయిగా చేయడానికి చాలా సహాయం చేస్తుంది. ఈ విధంగా అన్య వ్రతాలు, ఉపవాసాలు - కావలసిన కోరికలు, అవసరాలు తీరడానికి, ఇబ్బందులను దాటటానికి అనేక వ్రతాలు, ఉపవాసాలు సహాయం చేస్తాయి.

**ఉపవాస ప్రక్రియ తెలిసిన వారు ఉపవాసములను ఐదు రకములుగా పేర్కొన్నారు. అవి పాచక, శోధక, శామక, ఆనస, పావక. పాచక ఉపవాసం పొట్టకు సంబంధించిన అజీర్ణం మొదలైన రోగాలను వదిలించుకోవడానికి ఉపయోగపడుతుంది. ఆకలితో రోగాలను వదిలించుకోదానిని శోధక ఉపవాసం చేయబడుతుంది. దీనిని లంఘనం అని కూడా అంటారు. శామక ఉపవాసం చెడు ఆలోచనలను, మానసిక వికృతులను, దుష్ప్రవృత్తులను వికృతమైన ఉపత్యికలను శమింపచేస్తుంది. ఆనస**

**మనసులో మాలిన్యం ఉన్నపుడు శరీరాన్ని ఎంత శుభ్రంగా ఉంచుకుంటే ఏం లాభం?**

**ఉపవాసం ఏదైనా విశేష ప్రయోజనం కొరకు, కావలసిన దైవీ శక్తిని ఆకర్షింపజేసుకోవడానికి చేయబడుతుంది. పావక ఉపవాసం ప్రాయశ్చిత్తం కొరకు చేయబడుతుంది.** ఆత్మిక మానసిక స్థితి అనురూపంగా ఎటువంటి ఉపవాసం అవసరమవుతుందో, ఎటువంటి నియమాలు ఉండాలో నిర్ణయించడానికి సూక్ష్మ వివేచన అవసరమవుతుంది.

సాధకుని అన్నమయ కోశం ఏ స్థితిలో ఉన్నది? దాని ఏ ఏ ఉపత్యికలు వికృతమయ్యాయి? ఏ ఏ ఉత్తేజన స్థానాలను శాంతింపజేయాలి? ఏ మర్మ స్థలాన్ని తేజోవంతం చేయాలి? వీటిని గమనించి ఏ వ్యక్తి ఎటువంటి ఉవాసం చేయాలి అనేది నిర్ణయించాలి.

పాచక ఉపవాసంలో విపరీతమైన ఆకలి అయ్యేవరకు అన్నం ముట్టకూడదు. ఒకటి రెండు రోజులు ఆహారం మానివేయడం వల్ల మలబద్ధకం పోతుంది. పాచక ఉపవాసంలో నిమ్మకాయ నీళ్ళు, జీర్ణ ప్రక్రియను పెంపొందించే ఔషధాన్ని సేవించవచ్చు. శోధక ఉపవాసంలో విశ్రాంతి అవసరమవుతుంది. రోగి ప్రమాద స్థితి దాటేవరకు ఈ ఉపవాసం అవసరమవుతుంది. కాచి చల్లార్చిన నీటినే ఈ ఉపవాసాలలో వినియోగించాలి.

శామక ఉపవాసాలలో పాలు, మజ్జిగ, పండ్ల రసం మొదలైన తేలిక పదార్థాలను తీసుకోవాలి. ఈ ఉపవాసంలో ఆత్మ చింతనం, మౌనం, జపం, ధ్యానం మొదలైన ఆత్మను శుద్ధి చేసే ఉపచారాలు జరగాలి. ఆనస ఉపవాసంలో సూర్య కిరణముల ద్వారా అభీష్ట దైవీ శక్తిని ఆహ్వానించాలి. సూర్యుని సప్తవర్ణ కిరణములలో రాహు కేతువులు మినహా ఇతర సప్త గ్రహముల రశ్మలు (కిరణములు) కలసి ఉంటాయి. **సూర్యుని తేజస్వితా, ఉష్ణత, ఉష్ణ ప్రవృత్తి ప్రధానమైనది. చంద్రుడు – శీతలత్వం, శాంతిదాయకం, ఉజ్జ్వల భవిష్యత్తుకు కారణము. మంగళుడు (కుజుడు) కఠోర బలం ఇవ్వగలడు. బుధుడు సౌమ్య, శిష్ట, కఫ ప్రధానమైనది. బుధునికి అందం ఆకర్షణ ఇచ్చే శక్తి ఉన్నది. గురువు విద్యా, ధనం సూక్ష్మ దర్శిత, శాసన, న్యాయ, రాజ్య అధిష్ఠాత. శుక్రుడు వాత ప్రధానం, చంచల, కూటనీతిక ప్రవృత్తి. శని స్థిరత, ధృడత, పరిపుష్టి, ఏ గుణము అవసరమో దానికి తగిన దైవీ తత్త్వమును ఆకర్షించుకొనేందుకు వారంలో ఆ రోజు ఉపవాసముండాలి.**

పావక ఉపవాసాన్ని పాపముల ప్రాయశ్చిత్తం కొరకు చేయాలి. ఈ ఉపవాసంలో కేవలం జలం మాత్రమే తీసుకోవాలి. చేసిన తప్పుకు భగవంతుని క్షమించమని వేడుకోవాలి. భవిష్యత్తులో అటువంటి తప్పు చేయనని ప్రమాణం చేయాలి. చేసిన అపరాధానికి శారీరిక కష్టసాధ్యమైన తితీక్ష (శ్రమ), శుభ కార్యముల కొరకు దానం చేయాలి. చేసిన పాపం పుణ్యం సరి సమానమవ్వాలి. చాంద్రాయణ వ్రతం, కృచ్ఛ చాంద్రాయణ వ్రతం ఇటువంటివే.

ఉపత్యికల శోధన పరిమార్జన కొరకు ఉపయోగించుకునే సాధన, సూక్ష్మ తత్త్వములతో కలసి ఉన్న ఐదు రకాల ఉపవాసాలు – ఇవన్నీ కలిపితే, ఆదివారం (రవివారం) సూర్య వ్రతం అవుతుంది. ఆ రోజు ఏడు గ్రహాల కలసిన శక్తి పృథ్వి మీదకు వస్తుంది. దానిని అనేక ప్రయోజనాలకు ఉపయోగించవచ్చు. ఆదివారం ప్రాతఃకాలంలో స్నానం చేసి శుద్ధ వస్త్రములు ధరించి ఉదయిస్తున్న సూర్యుని ఎదురుగా కూర్చోవాలి. ఒకసారి తెరచిన కళ్ళతో సూర్యనారాయణుని చూచి, కన్నులు మూసుకుని సవితా తేజ పుంజమును ధ్యానం చేస్తూ 1000 గాయత్రీ మంత్ర జపం చేయాలి. జపం చేస్తున్నపుడు భావన ఇలా ఉండాలి – సూర్యుని తేజోరూపమైన సముద్రంలో స్నానం చేస్తున్నాను. ఆ తేజస్సు నా నలువైపులా కలసిపోతున్నది. ఇలా చేయడం వలన సవితా యొక్క బ్రహ్మరశ్మలు సాధకుని ఆత్మచేతనత్వమును జాగృతం చేసి తేజస్సుతో నింపుతాయి. బయట ముఖంపై సూర్యుని వేడి పడుతుంది, లోపల ధ్యానాకర్షణ ద్వారా సూక్ష్మరశ్మలను లాక్కుని ఉపత్యికలను వికసింపచేసుకొనవచ్చును.

జప ధ్యానముల తర్వాత హవనం చేయగలిగితే మంచిది. హవనం జప ధ్యానముల వేడిని తగ్గిస్తుంది. **ఇంకేమి చేసినా చేయకపోయినా ఆదివారం (Sunday) నాడు చేసే ఉపవాసం ఒక గొప్ప సాధన. 12 ఆదివారాలు నాగా లేకుండా ఉపవాసం చేయడం వల్ల సాధకునిలో కావలసిన మార్పు చూడగలుగుతారు.** 12 ఆదివారాలు వరుసగా సూర్యవ్రతం చేయడంలోని ద్వాదశ ఆదిత్యుల ఉపాసన యొక్క అలౌకిక విజ్ఞానం దాగి ఉన్నది.

ఆదివారం ఉపవాసం చేసేటప్పుడు శ్వేతవర్ణం (తెలుపు రంగు) వస్తువులు ఎక్కువగా ఉపయోగించాలి. శ్వేత వస్త్రములు సప్త వర్ణములు కలసిన శ్వేత ప్రకాశం యొక్క ప్రతీకగా భావించాలి. మధ్యాహ్నం 12 గంటల వరకు ఏమి తీసుకోకూడదు. 12 గంటల తరువాత జలం లేక ఇతర పల్చని పదార్థములు, పళ్ళ రసం మొదలైనవి తీసుకువచ్చు. సూర్యాస్తమయం అయిన తర్వాత ఏమి తీసుకోకూడదు. సూర్యుడు తపస్సు యొక్క అధిదేవత. ఆదివారం చేసే ఉపవాసం తపస్సు యొక్క ప్రతీక. దీని ప్రభావం సాధకునిలో పవిత్రత, ప్రఖరత, తేజస్విత రూపంలో కనుపిస్తాయి.

*– అఖండజ్యోతి, జూన్ 1993*

**సక్రమంగా ఉండాలా లేదా దయగా ఉండాలా అన్న సంశయం వస్తే దయవైపే మొగ్గు, అది ఎప్పుడు సక్రమమే అవుతుంది.**

## పూజ్య గురుదేవుల శతసూత్ర కార్యక్రమం 11-20

# ఆరోగ్యాభివృద్ధికి సామూహిక కృషి

**వనస్పతుల ఉత్పత్తి :** కూరగాయలు, పండ్లు, పువ్వులను ఉత్పత్తి చేసే ఉద్యమం ఆరోగ్యాభివృద్ధికి ఎంతో ఉపయోగకరం అవుతుంది. పెరటిలో, పరిసరాలలలో పూలమొక్కలను నాటాలి. ఇళ్ల కప్పులపై సొర, బీర, చిక్కుడు తీగలను పాకించాలి. ప్రాంగణంలో తులసి మొక్కలు పెంచాలి. ఖాళీ స్థలాలలో పూల మొక్కలు పెంచాలి. అరటి, బొప్పాయి వంటి వాటిని కొద్దిపాటి స్థలంలోనే పెంచవచ్చు. మొక్కలు నాటడం, వాటికి నీళ్లు పోయడం, మట్టిని త్రవ్వి తిరగబోయడం, పాదులు కట్టడం వంటి వాటిని ఇంటిలోని వ్యక్తులు చేయాలి. అందువల్ల శ్రమించే అలవాటు ఏర్పడుతుంది. ఆరోగ్యం మెరుగవుతుంది. వనమూలికల తోటను, ఫారమ్‌ను నిర్వహించడం ఆరోగ్యాభివృద్ధికి మంచిది.

**వంట వండే పద్ధతిలో సంస్కరణ :** ఆవిరితో వంట వండేందుకు తగిన పాత్రలు లభ్యం కావాలి. ప్రెజర్ కుక్కరు వాడడం మంచిది. ఇప్పుడు బాల్ బేరింగ్‌లు అమర్చిన తిరగళ్లు తయారవుతున్నాయి. వీటిని నడపడం తేలిక. ఒక గంటలో చాలా పిండి తయారవుతుంది. ఇంటింటా వీటి వాడకం జరగాలి. వీటిని నడిపే విధానం, మరమ్మత్తు చేసే విధానం నేర్పబడాలి. ఇళ్లలో ఆడవాళ్లు తిరగలితో పిండి విసరడం అసౌకర్యంగా, నామోషీగా భావిస్తున్నారు. తిరగలి వల్ల ఆరోగ్యానికి కలిగే మేలు గురించి వారికి తెలియజెప్పాలి. మగవాళ్లు స్వయంగా పిండిని విసరడం మొదలుపెట్టాలి. అప్పుడు తిరగళ్ల వాడకం పెరుగుతుంది. అలాగే, **ఆవిరితో వంట వండితే ఆహారం 70 శాతం హెచ్చుగా పౌష్టికంగా ఉంటుంది.** రుచి కూడా పెరుగుతుంది. వీటి ప్రచారం ఉద్యమ రూపం ధరించాలి.

**సాత్విక ఆహారం వండే విధానం :** వేయించిన, మాడిన మిఠాయిలు, పిండివంటలు ఆరోగ్యానికి హాని కలిగిస్తాయి. వీటి బదులు ఆరోగ్యకరములు, రుచికరములు అయిన పదార్థాల వాడకాన్ని ప్రోత్సహించాలి. ఆనపకాయ పరమాన్నం, ముల్లంగి హల్వా, మొలకెత్తిన గింజలతో వంటకాల వంటి పదార్థాలను తయారుచేసే పాక విద్యను వికసింపజేయాలి. అవి విందులలోను పనికివస్తాయి. ఆరోగ్యానికి ఏ మాత్రం హాని కలిగించవు. రుచికరంగా ఉంటాయి. టీ త్రాగే అలవాటు మాన్పించడం కోసం గోధుమతో చేసిన దలియా, వనమూలికలతో తయారుచేసిన పానీయం వాడవచ్చు. వక్కపొడి బదులు సోపు, ధనియాలతో పొడిని తయారుచేసి వాడవచ్చు. ప్రాకృతిక ఆహారంతో తయారైన వంటకాల పాకవిద్యకు ప్రాచుర్యం లభిస్తే, ఆరోగ్య రక్షణ దిశలో ఎంతో ముందంజ వేయవచ్చు.

**మురికిపై సమరం :** పరిసరాల పారిశుద్ధ్య సమస్యను ప్రభుత్వానికి వదిలివేసి ప్రయోజనం లేదు. చెడు అలవాట్లను వదులుకోవడానికి, పరిసరాల పారిశుద్ధ్యం పట్ల శ్రద్ధ వహించే ప్రవృత్తిని అలవరచడానికి కృషి జరగాలి. పిల్లలను ఇంటిబయట స్థలాలలో, కాలువలలో మలమూత్ర విసర్జనకు కూర్చోబెట్టడం, వీధులలో సందులలో ఇంటి చెత్తను పారవేయడం, సత్రాలలో, రైల్వే ఫ్లాట్‌ఫారంలలో, రైలు పెట్టెలలో చెత్త కాగితాలు, వేరుశెనగకాయ తొక్కలు పడవేసి వాటిని ఖరాబు చేయడం వంటి చెడు అలవాట్లవల్ల మురికి, రోగాలు వ్యాపిస్తాయి.

పల్లెలలో మలమూత్ర విసర్జనకు తగిన స్థలాల ఏర్పాటు తగినంతగా జరగడం లేదు. పల్లెకు దగ్గరగా ఉన్న స్థలాలలో, సందు గొందులలో ఇలాంటివి జరుగుతున్నాయి. ఈ అలవాటు పోవాలి. గొయ్యి త్రవ్వి, దానిలో కంకరరాళ్లు వేసి మరుగుదొడ్డిని తయారుచేసి దానిలో సున్నం ఫినాయిల్ వేసి ఉంచడం ఒక పద్ధతి. ఎక్కడ పడితే అక్కడ మూత్రవిసర్జన చేయడం వల్ల వ్యాపించే రోగాలను దీనివల్ల నిరోధించవచ్చు. సెప్టిక్ లెట్రిన్ల నిర్మాణం ఎంతో ఉపయోగకరం.

**మత్తు పదార్థాలను వదులుకోవడం :** మత్తు పదార్థాల అలవాటు వల్ల కలిగే దుష్పరిణామాలను తెలియచెప్పడానికి, ఈ వ్యసనాన్ని వ్యక్తులు వదులుకునేటట్లు చేయడానికి ప్రచార సాధనా లన్నింటినీ వినియోగించాలి. పంచాయతీలలో, మతపరమైన ఉత్సవాలలో, శుభ కార్యాలలో ఈ వ్యసనాన్ని వదులుకునేందుకు వ్యక్తులచేత ప్రతిజ్ఞలు చేయించాలి.

**వ్యాయామం, దాని శిక్షణ :** ఆసనాలు, వ్యాయామం, ప్రాణాయామం, సూర్య నమస్కారాలు, క్రీడలు, ఉదయం నడక, యోగ, వ్యాయామం, మాలీష్‌వంటివి నేర్పడానికి శిక్షణ తరగతులు నిర్వహించాలి. సామూహిక వ్యాయామానికి అవకాశం ఉన్న స్థలాలలో రోజువారీ ఏర్పాటు జరగాలి. వ్యాయామం దానికదిగా ఒక సర్వసమగ్రమైన చికిత్సా శాస్త్రం. మంచం మీద పడి ఉన్న రోగి సైతం కొన్ని ప్రత్యేకమైన యోగ వ్యాయామాలు, తేలికయిన వ్యాయామాలు చేయడం ద్వారా గడ్డు రోగాల నుండి విముక్తి పొందవచ్చు. బలహీనులు, చిన్న పిల్లలు, విద్యార్థులు, కిశోరులు, యువతీ యువకులు, స్త్రీలు, ఆడపిల్లలు చివరికి గర్భిణి స్త్రీలు తమతమ పరిస్థితులకు అనుగుణములైన వ్యాయామాలు చేసి ఎంతో ఆశాజనకమైన ఫలితాలు పొందగలుగుతారు.

**నవ్వడం, నవ్వించడం అలవాటైతే జీవితంలోని ఒడిదుడుకులు నిన్నేమీ చెయ్యలేవు.**

అఖాడాలు, వ్యాయామశాలలు, క్రీడా ప్రాంగణాల వంటి ఆరోగ్యవర్ధక సంస్థలను ప్రతిచోట స్థాపించాలి. లాఠీ, బల్లెం, కత్తి, బాణం వంటి ఆయుధాలను ప్రయోగించే శిక్షణ వల్ల వ్యక్తుల ఆరోగ్యం మెరుగవుతుంది. శరీర వ్యాయామం జరుగుతుంది. వ్యక్తుల మనోబలం, సాహసం పెరుగుతాయి. ఆత్మరక్షణ సామర్థ్యం ఏర్పడుతుంది. కుస్తీ, పరుగు, ఈత, బంతి ఆట వంటివాటిలో పోటీలు ఏర్పాటుచేసి, బహుమతులు ప్రదానం చేయాలి. ఇందువల్ల ఈ ఆటలపట్ల ప్రజల ఉత్సాహం పెరుగుతుంది. అయితే ఇలాంటి పోటీలలో అసూయ, ద్వేషాలకు తావు ఇవ్వకూడదు. లేనిపోని శతృత్వాలు తలెత్తకుండా జాగ్రత్తపడాలి. అప్పుడు ఈ పోటీలవల్ల పరస్పర ప్రేమాభిమానాలు పెరుగుతాయి.

**వారానికో రోజు ఉపవాసం :** వారాంతపు సెలవు పొట్టకు కూడా ఇవ్వాలి. ఆరు రోజులు పనిచేసిన తర్వాత పొట్టకు ఒకరోజు విశ్రాంతి ఇవ్వాలి. ఉపవాసం ఉండాలి. అలా చేస్తే జీర్ణక్రియ దెబ్బతినకుండా ఉంటుంది. పొట్టకు విశ్రాంతి ఇచ్చిన రోజున వారంలో పేరుకుపోయినదంతా జీర్ణం అవుతుంది. తర్వాతి రోజు చక్కగా పనిచేయడానికి పొట్ట సమర్ధంగా తయారవుతుంది. రోజంతా ఉపవాసం ఉండడం కుదరకపోతే, కనీసం ఒక్కపూట అయినా భోజనం మానివేయాలి. బాగా బలహీనులుగా ఉన్నవారు, పాలు, పండ్లు, కూరలు తీసుకోవచ్చు. ఏది ఏమయినా, వారానికి ఒకపూట భోజనం మానివేసి ఉపవాసం ఉండే అలవాటును తప్పనిసరిగా చేసుకోవాలి. ఉపవాసం వల్ల శరీరానికి కలిగే ప్రయోజనం సుస్పష్టమే. దానివల్ల కలిగే ఆధ్యాత్మిక ప్రయోజనం తక్కువేమీ కాదు.

**విందులు, ఎంగిళ్ళు :** పెద్ద పెద్ద విందులలో ఆహారం వృథా కాకుండా చూడాలి. విందులలో తినేవారి సంఖ్య వీలైనంత తక్కువగా ఉండాలి. వడ్డించే పదార్థాల సంఖ్య తక్కువగా ఉండాలి. దీనివల్ల ఆహార పదార్థాలు వృథాకాకుండా ఉంటాయి. కంచంలో ఎంగిలి పదార్థాలు వదిలివేసే అలవాటును పూర్తిగా వదులుకోవాలి. పనివాళ్లకు కాని, కుక్కలకు కాని భోజనం పెట్టదలిస్తే మంచి భోజనం, స్వచ్ఛమైన భోజనం పెట్టాలి. ఎంగిలి పదార్థాలు ఇవ్వడం వల్ల పాపం చుట్టుకుంటుంది. వాటిని తినేవాళ్లకు కూడా శారీరకంగా, మానసికంగా హాని కలుగుతుంది. అన్న దేవతను అవమానించడం ధార్మిక దృష్టిలో పాపం.

**సంతానానికి పరిమితి :** దేశంలో పెరుగుతున్న జనాభా, ఆర్థిక సమస్యలు, సాధనాల కొరత, సామాన్య ప్రజల ఆరోగ్యం దిగజారడం-వీటన్నిటినీ దృష్టిలో పెట్టుకుని ప్రతి గృహస్థు వీలైనంత తక్కువ సంతానాన్ని కనడం సముచితం. సంతానం పెరగడం వల్ల తల్లులు బలహీనులై అకాల మృత్యువుకు లోనవుతారు. పిల్లలు దుర్బలులు అవుతారు. సరైన పోషణ అందకపోవడం వల్ల అనారోగ్యానికి, అకాల మృత్యువుకు గురి అవుతారు. విద్యా వికాసాలకు తగు సౌకర్యాలు లేకపోవడంతో పిల్లల పెరుగుదల కుంటుపడుతుంది కనుక సంతానాన్ని కనీస స్థాయికి తగ్గించాలి. ప్రజలు బ్రహ్మచర్యాన్ని పాటించాలి. లేదా కుటుంబ నియంత్రణ నిపుణులను సంప్రదించాలి. సంతానపు బాధ్యతలను, చింతలను ఎంత తగ్గించుకుంటే అంత ఆరోగ్యంగా ఉంటారు. ప్రతి గృహస్థు ఈ వాస్తవాన్ని గుర్తించాలి. ఇందులో వారి శుభం ఉన్నది.

**ప్రకృతి వైద్య సమాచారం :** పంచతత్వాల ద్వారా రోగాన్ని నివారించే ప్రకృతి చికిత్సా విధానాన్ని ప్రజానీకానికి అందించాలి. ప్రకృతి చికిత్సా కేంద్రాలు వివిధ స్థలాలలో స్థాపించబడాలి. ఈ కేంద్రాలలో ఉపవాసం, ఎనీమా, జల చికిత్స, సూర్య చికిత్స, మట్టి, ఆవిరి మున్నగు సాధనాల సహాయంతో కాయకల్ప చికిత్స జరుగుతుంది. శరీరక్షాళన జరుగుతుంది. సమస్త రోగాల మూలాలను ఈ చికిత్స తొలగించి వేస్తుంది. సామాన్య ప్రజలకు ఈ చికిత్సా పద్ధతుల పరిజ్ఞానం విస్తృతంగా లభించాలి. తద్వారా వ్యక్తులు తమకు, తమ కుటుంబ సభ్యులకు ఈ చికిత్సను వారు స్వయంగా చేయగలుగుతారు.

పైన పేర్కొన్నవన్నీ సామూహికంగా చేయదగిన పద్ధతులు. ఇవి ఒక ఉద్యమంగా సాగాలి. గాయత్రీ పరివార్ పరిజనులు సామూహికంగా ఇందుకు తగు చర్యలు తీసుకోవాలి.


★★★

## కలసి ఉంటే కలదు సుఖం

*వన ప్రదేశాలలో భయంకరమైన తుఫాను వచ్చినప్పుడు దూర దూరంగా ఉన్న వృక్షాలు ఎంత పెద్దవైనాసరే నేలకూలి పోతూ ఉంటాయి. కానీ దగ్గరదగ్గరగా ఉన్న వృక్షాలు తమ ఆత్మీయతా భావనవలన తుఫాను ధాటికి తట్టుకొని నిలబడ గలుగుతాయి. ఎంత పెద్ద తుఫాను అయినా వాటిని ఏమీ చేయలేదని ఒకనాడు బుద్ధుడు తన ప్రవచనంలో శిష్యులకు తెలియజేశాడు. ఇదే విధంగా పరస్పరం కలసి ఉంటే కుటుంబ సభ్యులకు, కలసికట్టుగా జీవించే బంధు జనులకు ఎవ్వరూ ఏ నష్టం కల్గించలేరు. అందుకే సంఘారామాలలో బలమైన కుటుంబ భావనలను, ఆత్మీయతను, స్నేహాన్ని వ్యక్తుల మధ్య స్థిరపడి ఉండేటట్లు అభ్యాసం చేయించటం జరుగుతుందని ఆనాడు బుద్ధుని మాటల ద్వారా శిష్యులు గ్రహించారు.*

– ప్రజ్ఞాపురాణం నుండి

**నీతిని పాటించని వారు నీతి సూక్తులు చెప్పకూడదు.**



తత్వజ్ఞానం-3

# కొన్ని రకములైన భౌతిక కర్మలు

**గత సంచిక తరువాయి...**

అవిటితనం, చెవుడు, కాళ్లు చేతులు లేకుండాపోవడం, కుంటి, గ్రుడ్డి - ఇవి కొన్ని కంటికి కనిపించే మానవ జీవిత బాధలకు ఉదాహరణలు. వారిని చూచినపుడు మన హృదయాలు జాలితో ద్రవించిపోతాయి. అవి మనకే వస్తే ఎంత బాధ కలిగిస్తాయో మనకందరికి తెలుసు. ఇలా ఎందుకు జరుగుతున్నదని భగవంతుని కోపంతో, బాధతో ప్రశ్నించవచ్చు. నాకే ఎందుకు ఇలా జరిగింది? అని

జాబ్ చాలా మంచి వ్యక్తి. అతని ప్రాపంచిక ఆస్తులు మొత్తం అంతరించిపోయాయి, పిల్లలు చనిపోయారు. అంత బాధ భరిస్తున్నప్పటికి ఒక్కరోజు కూడా కంప్లైంట్ చేయలేదు. చివరకు శరీరమంతా భయంకరమైన కురుపులు వచ్చినప్పుడు, దేవునిపై అరచాడు. చెప్పు నేను ఏమి తప్పు చేశానో, నాకు ఎందుకు ఈ బాధలు వచ్చాయో నేను ఏమి పొరపాట్లు చేశానో చెప్పు" అని భగవంతుడిని వేడుకున్నాడు.

ఏదో తప్పుచేయడం వల్ల బాధలు వస్తున్నాయనే నమ్మకాన్ని, మూఢ నమ్మకంగా భావించి ఈనాటి మనుష్యులు వదిలివేశారు. దీనిని కొందరు మెట్టవేదాంతమంటారు. కాని ఇప్పటికి కొందరు అంటుంటారు - "ఎప్పుడు ఏ పాపం చేశామో" అని తమ బాధలను తలచుకుంటూ. కేసీ రీడింగ్సులో పాపం, బాధ కార్యకారణ (cause-effect) సంబంధాలను చెప్తాయి అసలు ఏమి పాపం చేశామో మన దృష్టికి అందుబాటులో ఉండకపోయినను దీనిని బాగా అర్థం చేసుకోవడానికి ముందు అసలు కర్మ అంటే ఏమిటి, అనేది తెలుసుకోవడం చాలా ముఖ్యం. సంస్కృతంలో కర్మ అంటే పనిచేయడం (action) కాని ఆధ్యాత్మిక దృష్టికోణంలో ఇది cause-effect చేసిన పని దాని ఫలితం; పని - దాని ప్రతిస్పందన. ఇది ప్రతి ఒక్క మానవునికి కూడా వర్తిస్తాయి. క్రీస్తు ఇలా అన్నాడు - "What so ever a man soweth, that he also reap" అంటే మనిషి ఏమి నాటుకుంటాడో అదే కోసుకుంటాడు (అనుభవిస్తాడు). న్యూటన్ 3వ సూత్రం-ప్రతి చర్యకు దానికి సమానమైన వ్యతిరేకమైన ప్రతిచర్య ఉంటుంది (Law of motion namely that every action has its reaction which is equal and opposite). ఇది ఫిజిక్స్‌కే కాక నీతి శాస్త్రానికి కూడా అన్వయిస్తుంది.

కేసీ చూచినటువంటి అనేక కేసులను గమనించినట్లయితే కర్మలు పలు రకాలని తెలుస్తుంది. ఒక దానిని బూమరాంగ్ కర్మ (boomerang karma) అంటారు. దీనికి ఈ పేరు ఎలా వచ్చిందంటే - ఆస్ట్రేలియాలో బూమరాంగ్ అనే ఆయుధాన్ని విసిరివేస్తే అది తిరిగి విసిరిన వాడికి చేతిలోనికి వస్తుంది. అదే విధంగా ఇతరులకు చేసే హాని తిరిగి వారిపైకే వచ్చిపడుతుంది. (దీనినే మనం తెలుగులో చెరపకురా చెడేవు అంటాము)

కేసీ చూచిన కేసులలో ఒక ఉదాహరణ. ఒక కాలేజి ప్రొఫెసర్ పూర్తిగా గుడ్డివాడు. కేసీ గురించి విని తన బాధ గురించి చెప్పుకుంటాడు. కేసీ అతని లైఫ్ రీడింగ్ ఇస్తాడు. ఇతనికి కళ్లు లేకపోవడానికి, చూపులేకపోవడానికి కారణం ఇతను పర్షియాలో తీసుకున్న జన్మలో చేసిన పని. ఆ సమయంలో ఇతను ఒక ఆటవిక జాతిలోని ఒక సభ్యుడు. వీరు తమ శత్రువుల కళ్లను అత్యంత వేడిగా ఎర్రగా ఉన్న కొలిమిలతో పొడిచి, వారిని గుడ్డివాళ్లను చేసే వారు. ఈ వ్యక్తి అలాంటి పనే చేశాడు. దాని యొక్క ఫలితాన్ని ఇప్పుడు అనుభవిస్తున్నాడు. కేసీ ఇతనికి కొన్ని సూచనలు ఇచ్చాడు. అవి పాటించిన తరువాత అతని ఎడమ కన్నులో కొంచెం మార్పు వచ్చింది. ఆ విధంగా చేసిన పాపం పోదు. ఎప్పుడో అప్పుడు అది మీద పడుతుంది"

ఇంకొక ఉదాహరణ. ఒక బాలిక. చిన్నతనంలోనే పక్షవాతం వచ్చింది. రెండు కాళ్లు చచ్చుబడ్డాయి, ఎక్కడకయినా పోవాలంటే ఆమె ఊతకర్రలను వాడవలసి వచ్చింది. ఈ పరిస్థితికి కారణం ఇలా చెప్తాడు కేసీ - ఈమె అట్లాంటిక్ జన్మలో (పూర్వం అద్భుతమైన అట్లాంటిక్ పిరియడ్ ఉండేదని అది కాలగర్భంలో ప్రస్తుత అట్లాంటిక్ మహాసాగర గర్భంలో కలసిపోయిందని చెప్తారు) ఈమె మందుల ద్వారా, హిప్నోసిస్ ద్వారా ఇతరుల కాళ్లను చచ్చిపడేలా చేసేదని, దాని ఫలితంగా ఈ జన్మలో ఈ పరిస్థితి దాపురించదని అంటాడు.

ఇంకొక ఉదాహరణ. 40 సంవత్సరాల ఆమెకు రకరకాల బాధలు. డాక్టర్లు వీటి ఎలర్జీ (allergy) గా నిర్ధారించారు. ఈమె బ్రెడ్ తిన్నా, కొన్ని రకాల ధాన్యాలు తిన్న వెంటనే ముక్కు కారడం మొదలవుతుంది. లెదర్ వస్తువులను, ప్లాస్టిక్ వస్తువులను ముట్టుకుంటే శరీర ఎడమ భాగంలో విపరీతమైన నొప్పి వస్తుండేది. ఆమె ఎంతో మంది డాక్టర్లను సంప్రదించింది. కాని ఏమి ఉపయోగం కనుపించలేదు. చివరకు హిప్నోటిక్ ట్రీట్‌మెంట్‌తో కొంత ఉపశమనం కలిగింది. పూర్తిగా కోలుకోవడం కొరకు ఈమె కేసీని సంప్రదించింది. కేసీ దివ్యదృష్టితో ఈ రోగానికి కారణం చెప్పాడు - ఈమె ఒకప్పుడు ఒక కెమిస్టు. ఈవిడ కొన్ని రసాయనిక ద్రవ్యాలతో ఇతరులకు దురద పుట్టేటట్లు చేసేది, కొంతమంది శ్వాసను విషమయంగా చేసేది. దానికి ప్రతిఫలంగా ఈనాడు కొన్ని కొని మెటల్స్, ప్లాస్టిక్స్, కొన్ని వాసనలు, చర్మాలు ఈమెకు విషమయమయ్యాయి.

- ఎడ్గర్‌కేసీ - "మెని మాన్షన్స్" పుస్తకం నుండి

(సశేషం)

**డబ్బు కాదు... డబ్బు మీద ప్రేమ, మోహం, దురాశ అనర్థాలకు హేతువులు.**

జన్మశతాబ్ది ప్రత్యేకం

# ప్రజ్ఞాయుగము ఎలా ఉంటుంది?

నేను భవిష్యత్తును చూశాను. దానిని ఒక గొప్ప యుగంగా చూశాను. రాబోయే యుగము ప్రజ్ఞా యుగము. **ప్రజ్ఞా యుగం అనగా దూరదర్శి వివేకశీలత కలిగిన వ్యక్తుల సముదాయము.** ఇప్పుడు కనిపిస్తున్న లోభమోహావేశము, కూడబెట్టుకొనుట, పరస్పర వేర్పాటు ప్రవృత్తులు, రాబోయేకాలంలో ఒక చేదు స్మృతివలె మిగిలిపోతుంది. **ప్రతి వ్యక్తి ఒక ఆదర్శానికి ప్రమాణమై ప్రతి కుటుంబము అటువంటి వ్యక్తుల సముదాయమై, ఆదర్శ సమాజానికి ఒక అవయవముగా రూపొందుతుంది.** అందరి ఆలోచనలు ఉచ్చస్థాయిలో ఉంటాయి. ప్రతిఒక్కరు వ్యక్తిగత లాభం చూడకుండా సామూహిక హితము కొరకు ఆలోచిస్తారు.

ప్రజ్ఞాయుగంలో ప్రతి వ్యక్తి తనను తాను సమాజము యొక్క అవిచ్ఛిన్న అంగంగా గుర్తిస్తాడు. **స్వంతలాభము, హానిని గూర్చి ఆలోచించకుండా విశ్వహితముతోపాటు తన హితము కలసి ఉన్నదని తెలుసుకుంటాడు.** అందరి మహత్వకాంక్షలు, క్రియా కలాపాలు, సంకీర్ణ స్వార్థపరతమీద కాక లోకహితంపై కేంద్రీకృత మౌతాయి. రాబోయే రోజులలో అహంకారాన్ని పరబ్రహ్మములో లీనం చేసి ఆధ్యాత్మిక జీవనముక్తి సాధించబడుతుంది. తన గురించి, తన కోర్కెల గురించి, కుటుంబముల ప్రగతి గురించి పట్టించుకునే అవసరము కానీ, కోరిక కానీ ఉండదు. ఒక కుటుంబంలోని వ్యక్తులందరు పంచుకుని జీవించే ఆలోచనా విధానానికి మాన్యత (importance) ఇవ్వబడుతుంది.

పూర్వం ఋషులు, మునులు పర్ణకుటీరాలు వేసుకొని, తమ తమ కుటుంబాలతో ఉండేవారు. కానీ సమాజం నుండి దూరం కాలేదు. ఆ రోజులలో లోభ, మోహ బంధనాలనుండి యోగ సాధనల ద్వారా ముక్తి పొందేవారు. తపఃపురుషార్థమును సాధించే వారు. ఆ శక్తుల చక్కని వినియోగము సత్ప్రవృత్తుల సంవర్ధన కొరకు జరిగేది. ఇప్పుడు అదే పని ఆలోచనలలో ఉత్కృష్టత, జీవనక్రమ నిర్ధారణ, వాతావరణ ప్రభావం వల్ల జరుగుతుంది. అందరు అటువంటి జీవితమే జీవిస్తూ పరస్పరము సహకరించు కుంటారు.

ప్రజ్ఞాయుగ ప్రజలు మహామానవులమవ్వాలని **కోరుకుంటారు. గుణ, కర్మ స్వభావాలలో ఎవరు ఎంత శ్రేష్ఠతను సంపాదించారో అదే నిజమైన ప్రగతిగా గుర్తింపబడుతుంది.** ఎవరు కూడా విలాస వైభవములలో పోటి పెట్టుకోరు. ఎంత సజ్జనులయ్యారో, శ్రద్ధాస్పదులయ్యారో అనేదానిమీద పోటి ఉంటుంది. ఇతరులు అనుకరించాలనిపించే ఎన్ని కార్యాలు చేశారో అది వైభవంగా గుర్తింపబడుతుంది. ఈనాడు సంపద సాఫల్యం యొక్క చిహ్నంగా భావించబడుతున్నది. రాబోయే రోజులలో ఈ కొలమానం పూర్తిగామారి మానవత్వ స్థాయి ఆధారంగా తీసుకొనబడుతుంది.

శరీర పోషణకు అవసరమయ్యే సాధనాలతోపాటు ప్రజ్ఞా యుగంలో మానవుడు 'సద్‌జ్ఞానం' యొక్క అవసరము తెలుసుకుంటాడు. ఆహార ఉపార్జనకొరకు, లౌకిక విషయాలు తెలియజేసే విద్యమాత్రమే తృప్తి నివ్వదు. దృష్టికోణాన్ని మార్చుకుని సద్గుణాలను పెంపొందించి, వ్యక్తిత్వాన్ని ప్రఖరం (Intense) చేసి, ప్రమాణికతను పెంచే రీతి-నీతులు (Ways & means) నేర్పబడతాయి. అందరి జీవితాలు పరస్పర సహయోగముతో నిండి ఉంటాయి. దీనికొరకు అవసరమయ్యే స్వాధ్యాయ, సత్సంగ, మననం యొక్క ఉచ్చస్తరీయ మార్గదర్శనము లభించే స్థానాలను వెతుక్కుంటారు. ఋషికల్ప-మహామానవుల సాన్నిధ్య, సద్భావ అనుదానాలు సర్వోచ్చ స్థానాలను అలంకరిస్తాయి.

చెడుసంస్కారాల శమనము, నిరోధము కొరకు ప్రజ్ఞాయుగ ఆలోచనపరులు పూర్తిగా ప్రయత్నిస్తారు. సంయమనము పాటించి సంతులితముగా ఉంటారు. శౌర్యసాహసాల కేంద్రబిందువు ఎవరు ఎంత దృష్టికోణము, స్వభావము, ఆచరణలో ఉత్కృష్టత పెంపొందించగలిగారో అన్నదానిమీద ఆధారపడి ఉంటుంది. జనకళ్యాణము, సత్ప్రవృత్తి సంవర్ధనములో ఉపయోగపడే ప్రతిభ, పరాక్రమ వైభవాలు మాత్రమే కొనియాడబడతాయి. వివేక వంతులు ఈ ఆధారంగానే ఆత్మనిర్మాణము చేసికొని, తమ పురుషార్థ క్షేత్రమును వారి సుఖమునకు, కుటుంబ అవసరాలకు మాత్రమే ప్రాముఖ్యత ఇవ్వక విశ్వఉద్యానవనమును సమున్నతం, సుసంస్కృతం చేయటానికి ప్రాముఖ్యతను ఇస్తారు. ధనవైభవాలకు గాక గరిమకు ప్రాధాన్యత ఇవ్వడుతుంది. సంకీర్ణ స్వార్థములో మునిగిన వ్యక్తులను చిన్న చూపు చూస్తారు. శ్రమశీలత దురదృష్టం యొక్క చిహ్నముగా కాక ప్రతిభ, నైపుణ్యము సంపాదించు కోవడానికి, ఉపార్జనకు, భౌతిక వికాసానికి చాలా అవసరమనే భావన ఏర్పడుతుంది. శ్రమ యొక్క గొప్పదనాన్ని గుర్తించక పోవడం ఒక విధంగా దారిద్ర్యమునకు, వెనకబడిపోవటానికి

**కనిపించేదాన్ని చూడటానికి కళ్ళు చాలు, కనిపించని దాన్ని చూడటానికి వివేకం కావాలి.**

కారణము. పని లేకుండా కూర్చొనుట వలన ఇంకొక ప్రమాదం కలుగుతుంది. పనిలేని మస్తిష్కము, రాక్షసుని దుకాణము (empty mind is devils work shop) అన్నది అక్షరాలా సత్యము. పనిలేని వారి మస్తిష్కము దురాలోచనలకు, శరీరము దుర్వ్యసనములకు లొంగిపోతాయి. మెల్లమెల్లగా దుర్గుణాల సంఖ్య పెరుగుతుంది. కాలయాపనకొరకు అటువంటి మిత్రులనే ఎన్నుకుంటారు. లేకపోతే ఇతరులను తమ వలలో వేసుకుని, వారి భవిష్యత్తును కూడ నాశనము చేస్తారు. ఈనాటి తరము బాధ్యతారహితంగా ఉండటానికి కారణము లక్ష్యరహితమైన మిత్రమండలి ఉండటమే. తమ కాలాన్నే కాక తమ మిత్రుల కాలాన్ని, ప్రతిభను నిరుపయోగపరచగలిగే వ్యక్తులే, స్నేహితులుగా భావించ బడుతున్నారు. సమస్యలన్నీ లక్ష్య రహితంగా ఊరికే కూర్చోవడం వల్ల వస్తాయి. **లక్ష్య రహితంగా ఒక సెకండు కూడా గడవకూడదు అనే అద్భుత ఆలోచనాసరళి ఎంత తొందరగా ఒంట బట్టించుకుంటే అంత మంచిది.**

**ప్రజ్ఞాయుగంలో ఆలోచన, ఆచరణ, వ్యవహారం అన్నింటిలోను కాయకల్పం వంటి మార్పులు వస్తాయి. ఇదే యుగపరివర్తన.** దీనికి ఆధారము దూరదర్శి, వివేకశీలతను వినియోగించి కావలసిన పనులు చేయుట. ఇన్నాళ్ళుగా ఏది సవ్యమని ఆలోచిస్తున్నారో ఏ జీవిత విధానము ఆచరణయోగ్యమని అనుకుంటున్నారో అవన్నీ మారిపోతాయి. తర్కము, తథ్యము, ప్రమాణము, న్యాయము లోకహితము అనే గీటురాయి మీద పరీక్షించబడిన ఆచరణ ఉంటుంది. **జరిగిపోయిన కాలమే మంచి దనే భావన పోగొట్టుకొని భవిష్య ప్రణాళికలకు అనుగుణ్యంగా మారాలి.** ఉజ్జ్వల భవిష్యత్తుయొక్క నిర్మాణానికే ప్రాముఖ్యతనివ్వాలి. రాబోయే రోజులలో ఇటువంటి వారినే యుగశిల్పులుగా గౌరవిస్తారు.

పవిత్రత-ప్రఖరతల ఉచ్చస్థరీయ అభివృద్ధే మహత్త్వా కాంక్షలకు నిజమైన ఆధారము. నిజజీవితంలో గుణ, కర్మ, స్వభావాలను ఉత్కృష్టం చేసికొని లోకోపయోగకరమైన కార్యము లందు తమ సామర్థ్యాలను వినియోగించి ఇతరులకు అనుసరణీయమైన ఆదర్శాన్ని నెలకొల్పుటకు వ్యక్తియొక్క గొప్పదనం కొలమానమౌతుంది, 'సాదాజీవనము-ఉన్నత ఆలోచనలు' అనే ప్రేరణకి కారణమౌతుంది. ఆదర్శవంతమైన ప్రగతి సాధించటానికి ఎంత సాహసపరాక్రమము చూపించ గలిగారో అది అంత జీవన సాఫల్యానికి కొలబద్ద అవుతుంది. **రాబోయే రోజులలో మనుష్యులు చాతుర్యం, సంపద, సఫలతల యొక్క ప్రదర్శనను చులకన భావనతో చూస్తారు.** ప్రతిభయొక్క వికాసం, దాని సదుపయోగములో సంతృప్తిని, సంతోషాన్ని పొందుతారు.

ప్రజ్ఞాయుగంలోని ప్రతి వ్యక్తి సామాజిక నీతి-మర్యాదలకు ప్రాముఖ్యమిస్తాడు. మానవ సహజమైన విలువలను, సమాజ వ్యవస్థను భంగపరచే ఏ పని చేయడు. మర్యాద, సౌజన్యము, పరస్పర సహయోగము, త్రికరణశుద్ధి, నిశ్చలంగా ఉండగలుగుట అనేవి జీవితానికి గీటురాళ్ళుగా ఉంటాయి. అవినీతికి సహకరించకుండా ఉండటమేగాక, దానికి ప్రత్యక్ష, పరోక్ష సమర్థన కూడా చేయబడదు.

ప్రజ్ఞాయుగంలో శారీరక, మానసిక వ్యాధుల నుండి సహజంగానే ముక్తి లభిస్తుంది. వ్యక్తులు ప్రకృతి అనుశాసనంలోనే ఉండి, ఆహార విహారాలలో సంయమనము పాటించుటవలన మిగతా ప్రాణులలాగే అంతఃప్రేరణను, దాని శాసనమును పాటిస్తారు గనుక నీరసాలు, రోగాలు ఉండవు. అకాలమృత్యువు, సమయానికి ముందే ముసలితనము రావు.

**ప్రజ్ఞాయుగంలో అందరు సంతోషపూర్ణమైన, నీతివంతమైన, ఉదార, సరళ, సౌమ్య జీవన పద్ధతిలో కలసిమెలసి పంచుకొని, నవ్వుతూ, నవ్విస్తూ జీవిస్తారు. అందువలన వారు అన్ని పరిస్థితులలోను, ఆనందోల్లాసాలతో నిండి ఉంటారు. అందరి శరీరాలు రోగరహితంగా, శాంతిమయ మస్తిష్కాలతో ఉంటాయి.**

మానవుడు ఒక సామాజిక జీవిగా రూపొందించబడ్డాడు. అతనికి లభించినవన్ని సమాజంయొక్క సహయోగము, అనుదానము వలననే లభించాయి. కావున సమాజాన్ని సమున్నతము, సుసంస్కృతము చేయటానికి ప్రయత్నించాలి. యోగదానము చేయాలి. ఈ పనిని కుటుంబమనే 'చిన్న సమాజం' నుండి ఆరంభించాలి. భార్యాపిల్లలే కుటుంబమని అనుకోనక్కర్లేదు. **ఏ సముదాయంలో కలసిమెలసి జీవించే వీలు ఉంటుందో అదే కుటుంబము.**

ఈ సముదాయాన్ని తన అవయవములుగానే గుర్తించి సమాజం యొక్క అతి చిన్నరూపంగా భావించి, ఉద్యానవనంలో తోటమాలివలె సేవారతుడై ఉండాలి. **కలసిమెలసి, పంచుకొని, నవ్వుతూ, నవ్విస్తూ జీవించడమే కుటుంబ జీవనము.** ప్రజ్ఞాయుగం లోని ప్రతివ్యక్తి శరీర నిర్వహణలోనేగాక, కుటుంబజీవితంలో కూడా సంపూర్ణానందమును పొందుతూ కార్యరతుడౌతాడు.

ప్రజ్ఞాయుగంలో కుటుంబ వ్యవస్థలోకి అడుగుపెట్టేముందు ప్రతి వ్యక్తి తన సహయోగికి అవసరమైన సాధనములు సమకూర్చ గలమా? అని ఆలోచిస్తాడు. పిల్లలను సుసంస్కారవంతులుగా మంచి పౌరులుగా తీర్చిదిద్దగలిగే సామర్థ్యము ఉన్నదో లేదో ముందే తెలుసుకుని అప్పుడు మాత్రమే గృహస్థ ఆశ్రమంలో ప్రవేశిస్తాడు. ఎంత కాలము, ఎంత ధనము అవసరమౌతుందో కూడా అంచనా

దుష్టులకు దూరంగా ఉండాలి. కానీ వారితో విరోధంగా ఉండకూడదు.

వేసుకుంటాడు. సంతానోత్పత్తి ముందు అనేకసార్లు క్రొత్త బాధ్యతను వహించటానికి భార్య ఆరోగ్యం, తన సంపాదన, ఇంటి వాతావరణం అనువుగా అమరాయో లేదో ఆలోచిస్తాడు. సామర్థ్యానికి మించి ఒక్క అడుగు కూడా ముందుకు వెయ్యడు. పోషించే శక్తి లేనప్పుడు, సంతానం బాగోగులను చూడలేమని వారి భవిష్యత్తును అంధకారమయం అవుతుందని, అది శాపంగా పరిణమిస్తుందని తెలుసుకొంటాడు.

వివాహాలు కాముకతను తృప్తిపరచుకోవటానికి, రూప సౌందర్యాలతో ఆడుకొనటానికి కాక-ఇరువురు స్నేహ, సహయోగాలు ఇచ్చుకొని జీవితం యొక్క అపూర్ణతను (లోటుపాట్లను) దూరం చేసుకోవటానికి, కలసిమెలసి చాలా ఉచ్చస్థరీయ ప్రగతి సాధించేందుకు జరుగుతాయి.

ఒకరికి ఒకరు సహకరించుకుంటు, అధికారాన్ని ప్రదర్శించ కుండా, ఓర్పుతో, కలసిమెలసి నిర్ణయాలు తీసుకుంటారు. మత భేదాలు తీవ్రరూపం దాల్చవు. వాటిని పెద్దగా భూతద్దంతో చూడరు. ఔదార్యంతో విభిన్న ప్రకృతులను అర్థం చేసుకుంటారు. ఈ రోజులలో అనేకమంది స్త్రీని దాసిగా మాత్రమే చూస్తున్నారు. ఈ పరిస్థితిపోయి వారికి సమాన అధికారాలు లభించి, సహయోగినిగా గౌరవ ప్రదమైన స్థానము లభిస్తుంది. శృంగార సామగ్రి స్త్రీ యొక్క ఆంతరిక హీనతగా (Inferiority complex) భావించబడుతుంది. వాటిని ఉపయోగించకూడదని భావిస్తారు.

**ప్రజ్ఞాయుగంలో ప్రతిగృహం, భూమిమీద స్వర్గంవలె స్నేహ, సద్భావ, ఉత్సాహ, ఉల్లాసాలతో నిండి ఉంటుంది. ప్రతి కుటుంబ సభ్యుడు, శ్రమశీలత, సువ్యవస్థిత (organised) ఉదారత, సహకారం, సుసంస్కారపూరితమైన సజ్జనత్వము అనే పంచ శీలములను సుఖశాంతులకు ఆధారములని పరిపూర్ణంగా విశ్వసిస్తాడు.** అందరు అభివృద్ధి చెందడానికి తమవంతు పాత్రను నిర్వహిస్తారు తప్ప దొరకినది దొరికినట్లు తీసుకుపోదాం అని అనుకోరు. అందరు కలసి కుటుంబంలో చక్కని వ్యవస్థ సద్భావనల వాతావరణం నిర్మించి, ఎక్కువ ప్రసన్నతను పొందుతారు. కుటుంబంలో ఉన్నవారికి ఉజ్జ్వల భవిష్యత్తు యొక్క అవకాశాలు స్పష్టంగా దృగ్గోచరమౌతాయి. ఇలాంటి సుసంస్కృత కుటుంబాలే నవరత్నాల గనిగా అందరిని ధన్యులను గావిస్తాయి.

కుటుంబ సభ్యుల యొక్క శారీరక అవసరాలకు తగిన అర్థవ్యవస్థ, సుఖసాధనములకు కావలిసిన వసతి, ప్రగతి, రక్షణలకు సదుపాయాలు ప్రజ్ఞాయుగంలో కూడా ఉంటాయి. కానీ వాటన్నింటితోపాటు అధికార వ్యామోహం తగ్గించుకొని కర్తవ్యపాలన మీద ఎక్కువ దృష్టి ఉంచుకుంటారు. దానికి తగిన ప్రయత్నాలు లేకపోతే సిగ్గుపడతారు. కుటుంబాలు సుసంస్కార విద్యాలయాలుగా రూపొందుతాయి. వానినుండి అనేక నరవత్నాలు ఆవిర్భవిస్తాయి. ఉదాత్తభావనలు ఆత్మీయభావము, సద్వ్యవహారము, సహయోగాలు మాత్రమే కుటుంబ వ్యవస్థయొక్క సార్థకతకు, ప్రగతికి గీటురాళ్ళవుతాయి.

**ఆడపిల్లకి, మగపిల్లవానికి సమానమైన స్నేహ సన్మానాలు ఇవ్వబడతాయి. తన కాళ్ళమీద తాను నిలబడి క్రొత్త గృహము యొక్క అనేకానేక బాధ్యతలను సహించగలిగిన సామర్థ్యము వచ్చినపుడే వివాహం తలపెట్టబడుతుంది. సంతానమును సుసంస్కారవంతులుగా చేయుటయే గురుతర బాధ్యతగా గుర్తిస్తారు.**

**ప్రతి పనిని నియమిత కాలంలోనే పూర్తిచేయుట, వస్తువులను యథాస్థానంలో సురక్షితంగా అందంగా ఉంచుట, ఫ్యాషన్లను చిన్న చూపు చూచి వానినుండి దూరంగా ఉండుట, సాదా స్వచ్ఛతతో రుచిని జోడించుట, బడ్జట్ వేసికొని ఆదాయం కంటే తక్కువ ఖర్చుపెట్టుట, ఎంతోకొంత దాచుకొనుట, ఒకరికొకరు పరస్పర సానుభూతి, సహయోగములు పెంపొందించుకొనుట, నమ్రతతో కూడిన వ్యవహారము చేయుట, చరణస్పర్శలు, శుభ్రంగా, అందంగా ఉంచుటకు కలసిమెలసి ప్రయత్నించుట, పాడైపోయిన వాటిని బాగుచేయుట ఇంటిలో ఎక్కడ ఏమాత్రము స్థలమున్నా పూలచెట్లు, ఆకుకూరలు, కాయగూరలు లాంటివి పెంచుటవలన ఇంట్లో స్వర్గీయ వాతావరణము నిర్మించవచ్చు. రాత్రిళ్ళు కథ ప్రవచనము, ప్రొద్దున సాయంత్రము పూజ, ఆరతులు లాంటి ధార్మిక కృత్యాలతో కుటుంబాలలో ఆస్థిక బుద్ధిని పెంచే వీలు కలుగుతుంది.**

నేను పైన వ్రాసిన పంక్తులలో వ్యక్తి, కుటుంబ, సమాజం యొక్క ఆదర్శ నిర్మాణము ఒక యుటోపియా (Utopia) గా, ఒక కల్పన అని అనుకోవద్దు. ఒక ద్రష్టయొక్క రాబోయే దశాబ్దాలలో సాకారమైతీరే ఒక భవిష్యవాణిగా తెలుసుకోండి. ఇది ఎవరు చేస్తారు? ఈ ప్రశ్న అంత ముఖ్యం కాదు. ఉచ్చస్థరీయ భావనలు, బీజరూపంగా ఉన్న ప్రతి వ్యక్తి పరోక్షజగత్తు సహకారముతో ప్రజ్ఞాయుగ అవతరణ కొరకు తమవంతు పురుషార్థము చేసితీరుతాడు. ఈనాడు ఆవరించి ఉన్న కషాయ కల్మషాలు, లోభ-మోహ బంధనాలు వారు త్వరలోనే త్రెంచేసుకుంటారు. ఇటువంటి తరం జన్మించింది, వికసింపబడుతున్నది. నా సూక్ష్మీకరణ సాధన దానికి కావల్సిన పోషణ ఇవ్వటానికి వినియోగింపబడుతుంది.

*- అఖండజ్యోతి, జులై 1984*

మంచి పుస్తకం చదవటమంటే మహనీయులతో మాట్లాడటమే.

కాలజ్ఞానం

# కాల చక్రం యొక్క రహస్య విజ్ఞానం

ఏ విధంగా అయితే నీటి ప్రవాహపు మార్గాన్ని మనకు కావలసిన రీతిలో, దాని దిశను మార్చి, మన అవసరానికి ఏర్పాటు చేసుకొంటామో ఆ విధంగానే కాలచక్రం దిశను కూడా మార్చుకోవచ్చని మన భారతీయ ఆధ్యాత్మికవేత్తలు తెలుసుకోవటం జరిగింది. మన శరీరములోని ప్రాణవాయువు యొక్క ప్రవాహ ప్రకంపనలను బాగా వేగిరపర్చగలిగితే ఆ వాయువు దిశమారి "భవిష్య కాలానికి, ఆ ప్రకంపనలను బాగా తగ్గించి, శాంత పర్చగలిగితే సుదూర భూతకాలానికి" చేరవచ్చని తెలియపర్చారు. మామూలుగా సాధారణ వ్యక్తులు ఈ జటిల ప్రక్రియను చేయలేరు గాని మన యోగులు, యతులకు ఈ విధానం చాలా సాధారణ విషయం. వీరందరు క్షణ మాత్రంలో కాలచక్రగతిని ముందుకు-వెనుకకు మార్చి తమ ఇచ్ఛానుసారం భూత భవిష్యత్తులకు సంబంధించిన జ్ఞానం పొందగలరు. అయితే ఏదో ఒక సంఘటన జరిగినప్పుడు, ప్రత్యేక పరిస్థితులలో మాత్రమే వారి శారీరక, మానసిక వికాసం ద్వారా అనాయాసంగా ఈ ప్రక్రియను చేయగలరు.

ఇలాంటి ఒక సంఘటన గురించి ప్రఖ్యాత చరిత్రకారుడు జాన్ ఫోర్‌మాన్ తన గ్రంథం "The mark of time" లో వివరించుట జరిగింది. ఫేజ్ అనే వ్యక్తి 1968వ సం॥లో ఒక రోజున వెల్లింగ్‌టన్‌లోని బస్టాండ్‌లో బస్ కొరకు ఎదురుచూస్తూ అది రావటానికి ఇంకా సమయమున్నందున యథాలాపంగా పచార్లు చేస్తూ ముందుకు నడిచాడు. కొంతదూరంలో ఎండుగడ్డితో కప్పిన అందమైన రెండు గుడిసెలు ఉన్నట్లుగా గమనించి అటువైపుకు నడిచాడు. అందమైన ఉద్యానవనం ఆ గుడిసెలకు నాలుగు ప్రక్కల వ్యాపించి, రకరకాల పూల మొక్కలతో రంగు రంగుల పూలతో శోభాయమానంగా ఉండటం చూసాడు. ఆ వనంలో ఒక ప్రక్క ఒక వ్యక్తి తోటమాలి కాబోలు తోటపని చేస్తూ మరొక వ్యక్తి ఇంకో ప్రక్క మొక్కలను పాదులు చేయటం చూసాడు. గుడిసె ద్వారం వద్ద ఒక ముదుసలి వ్యక్తి జారగిలి పడి ఎండలో వెచ్చదనం పొందుతూ, ఆనందించడం చూచాడు. రెండవ గుడిసెలో నుండి ఎవరో మాట్లాడుకొంటున్నట్లు చిన్న చిన్న శబ్దాలు వినిపిస్తున్నాయి. ఆ గుడిసె గుమ్మానికి చిన్న చెక్క పలక వ్రేలాడదీయబడి, దానిమీద వాటి నిర్మాణం 1837వ సం॥గా వ్రాయబడి ఉంది. వీటనన్నిటిని చూస్తున్న ఫేజ్ కు ఎంతో ఆశ్చర్యం గలిగి, కేవలం ఎండుగడ్డితో నిర్మించిన ఈ పూరి గుడిసెలు ఇంతకాలం ఎలా నిలబడి ఉన్నాయి అని అనుకొంటూ, బస్సుకు సమయం అయినందున వీటి గురించి పెద్దగా పట్టించుకోకుండా తిరిగి బస్సు స్టాప్‌కి చేరుకున్నాడు. మరుసటి రోజున తనతో పనిచేస్తున్న వ్యక్తితో ఆ గుడిసెల గురించి చెప్పగా, అక్కడ అలాంటి గుడిసెలు ఏమీ లేవని, ప్రస్తుతం అక్కడ ఇటుకలతో నిర్మించిన రెండు నివాసాలు మాత్రం ఉన్నాయి అని చెప్పగా, ఫేజ్ తను స్వయంగా కంటితో చూసిన విషయం భ్రమ ఎలా అవుతుందని అనుకొంటూ ఒకవేళ భ్రమే అయితే పలకమీద ఉన్న 1837సం॥ అంకెలను, తోటలోని పనివారు; ఎండలో చలి కాచుకుంటున్న ముదసలి, రెండవ గుడిసె నుండి తను విన్న మాటల శబ్దాలు ఇవన్నీ భ్రమ ఎలా అవుతాయని తీవ్రంగా ఆలోచిస్తూ సత్యం తెలుసుకోవటానికి నిన్న తను చూసిన ప్రదేశానికి వెళ్ళి గమనించగా అక్కడ ఇటుకలతో కట్టిన రెండు ఇళ్ళు తప్ప ఇంకేమి కన్పించలేదు. ఆ గుడిసెలు, తోట, మనుషులు ఏమైనాయో అని తర్కించుకొంటూ అక్కడున్న ఒక పెద్దాయనకు తను చూసిన వివరాలు తెలిపి వాటి గురించి వాకబు చేసాడు. ఆ పెద్దాయన దాదాపుగా 80 సం॥ల క్రితం రెండు గుడిసెలు అక్కడ శిథిలావస్థాలో ఉండేవని అంతకు మించి తనకు తెలియదని" అన్నాడు. దానితో ఫేజ్ గారికి తను చూసింది భ్రమ కాదని, యదార్థమని, భూతకాలంలోని ఈ సంఘటనను తను ఎన్నో దశాబ్దాలు వెనుకకు వెళ్ళినందున చూడటం జరిగిందని అనుకొన్న విషయం "ది మార్క్ ఆఫ్ టైం" గ్రంథంలో జాన్ ఫోర్‌మాన్ వ్రాయుట జరిగింది.

ఇలాంటిదే మరొక సంఘటన జీవన విజ్ఞాన శాస్త్రవేత్త Evan Sander Son తన గ్రంథం "More things" ఆఖరి అధ్యాయంలో వ్రాస్తూ తనకు రహస్య విజ్ఞానం మీద ఎలాంటి ఆసక్తి లేదని కాని కొన్ని సంఘటనలు గమనించాక వాటిని ఇంకా లోతుగా పరిశీలించి ఆ సత్యాలను వర్ణించి వ్రాయుట జరిగిందని, ఈ క్రింది వివరణలో తెలిపాడు.

ఒకసారి ఆయన జీవన వైజ్ఞానిక సర్వే సందర్భంలో Hithy అనే ప్రదేశానికి వెళుతూ తన భార్య మరొక సహాయకునితో కలసి బయలుదేరాడు. అక్కడ సుందరమైన ఎంతో ప్రసిద్ధి చెందిన అజూ అనే జలపాతాన్ని చూడటానికి కారులో ప్రయాణిస్తూ, త్వరగా సూర్యాస్తమయ సమయానికి ముందుగా చేరుకోవాలని మెయిన్ రోడ్ వదిలి షార్ట్‌కట్ దారిగుండా వెళుతూండగా బురదలో వారి కారు కూరుకు పోయింది. ఎంత ప్రయత్నించినా కారుని కదపలేకపోయినందున దాన్ని అక్కడే వదిలి కాలినడకతో

**ఒక గమ్యమంటూ లేనివారికి ఏ దీపం దారి చూపలేదు.**

వెళ్ళడానికి సిద్ధమయ్యారు. మెల్లిమెల్లిగా చీకట్లు ముసురుకుంటున్నాయి, భార్యభర్తలు ఏదో మాట్లాడుతూ నడుస్తూంటే వారి సహాయకుడు ఫ్రెఢిరిక్ కొంచెము వేగంగా ముందుకు నడుస్తున్నాడు. ఆకాశం నిర్మలంగా ఉంది. శుక్ల పక్షపు రోజులు అవటంతో దారి స్పష్టంగా కనిపిస్తుంది. ప్రయాణంలో ఎలాంటి ఇబ్బందులు లేనందున ముందుకు నడుస్తున్న సమయంలో హఠాత్తుగా శాండర్ సన్ తల ఎత్తి చూడగా దారికి ఇరుప్రక్కల మూడు అంతస్థుల భవన సముదాయం విభిన్న ఆకారాలతో ఉండుట చూసాడు. వాటి రూపురేఖలు గమనించి అవి ఎలిజబెత్ రాణి పరిపాలన కాలానివిగా, ఏదో కారణంగా ఇంగ్లాండులో కాకుండా ప్యారిస్‌లో నిర్మించినట్లుగా అనుకొన్నాడు. ఆ భవనాలపై కప్పు ఏటవాలుగా పోతపోసినట్లు, సింహద్వారం గట్టి కలపతో నగిషీలు కలిగినట్లు, చిన్న చిన్న కిటికీలు వాటికి అద్దాలున్నట్లు గమనించాడు. వాటి వెనుక లేత ఎర్రరంగు వెలుగు ప్రసరిస్తున్నట్లు, అది మైనపు ఒత్తుల వల్ల వస్తున్నట్లు అనుకొన్నాడు. కొన్ని గదుల గుమ్మాలకు లాంతర్లు వ్రేలాడుతూ గాలిలో ఊగుతున్నట్లుగా గమనించాడు. కాని వాతావరణంలో ఏ విధమైన గాలి లేదని గమనించాడు.

ఇదంతా చూసి శాండర్‌సన్ ఎంతో ఆశ్చర్యపోయాడు. ఎందువల్లో అతని భార్యా ఎగశ్వాసతో రొప్పుతూ నిలబడగా ఆమెతో ఆరోగ్యం ఎలా ఉందని అడిగితే ఆమె మాట్లాడలేక కొంతసేపు అలాగే ఉండి తరవాత భర్త చేతిని గట్టిగా పట్టుకొని, ఆ భవనాల వైపు సైగ ద్వారా చూపి వాటి వివరాలన్నీ భర్త చూసినట్లుగానే గమనించి దేనికోసమో వెదుకుతున్నట్లుగా ఉండి పోయింది. అతను "ఎందుకిలా దేనికొరకు వెదుకుతున్నట్లుగా చూస్తున్నావని" అడగగా ఆమె చెప్పిన సమాధానం విన్న తనకు ఇప్పటికి కూడా ఎంతో జ్ఞాపకం ఉందని, అప్పుడు జరిగిన సంఘటనతోపాటు, ఆమె చెప్పిన సమాధానం, ప్రశ్న రూపంలోని ఆమె మాటలను తను ఎప్పటికి మరచిపోనని తన గ్రంథంలో వ్రాసుకొన్నాడు. ఇంతకు ఆమె ప్రశ్నరూపంగా పలికిన మాటలు "ఈ ప్రజలు 500 సం॥ల పూర్వం ఫ్రాన్సులోనికి ఎలా వచ్చారని?

కంటికెదురుగా కనిపిస్తున్న దృశ్యాలను చూసి విస్మయానికి లోనై, ఒకరికొకరు, ఆ భవనాల గురించి, వాటిలోని వస్తువుల గురించి చర్చించుకొంటూ ఏదో తెలియని మైకంలోకి జారిపోతూ, ఎంతో అలసటకు లోనై, తమ సహాయకుణ్ణి పెద్దగా కేక వేసి పిలుస్తూ ఆయాసంతో కళ్ళు తిరిగి దగ్గరలోని బండమీద కూర్చుండిపోయారు. కేక విన్న ఫ్రెఢిరిక్ పరుగున వచ్చి వారి పరిస్థితిని గమనించి, ఏం జరిగిందని అడుగుతూ, చెరొక సిగరెట్టు ఇచ్చి లైటర్‌తో వెలిగించాడు. దాని వెలుగులో అతను చుట్టుప్రక్కల పరికించి హైరానపడిపోయి, తను చూసిన గృహ సముదాయపు స్థలంలో ముళ్ళపొదలు, అడవి తుప్పలతో నిండిన ఖాళీ ప్రదేశాన్ని మాత్రమే చూసాడు. అతని భార్యా కూడా మెల్లిగా తేరుకొని పరిసరాలను గమనించి 15వ శతాబ్దం నాటి గృహ సముదాయం మాయమై అక్కడ అడవి మొక్కలు చూసి మాటలు రాక విస్మయానికి గురైంది. తరువాత కాలంలో చరిత్ర ఆధారంగా తేలిందేమనగా ఈ హైతీ భూభాగం ఫ్రాన్స్‌లో ఉండేదని 500ల సం॥ల క్రితం ఇక్కడ నాగరికత చెందిన శిల్పకారులు ఉండేవారని తన గ్రంథంలో వ్రాసాడు.

కోలిన్ విల్‌సన్ అనే గ్రంథకర్త Time Slip గురించి వేరొక సంఘటన "Beyond the Occult" అనే గ్రంథంలో ఈవిధంగా వ్రాసాడు. 1973వ సం॥ వసంత కాలంలో కేంబ్రిడ్జ్‌లో చదువు కొంటున్న Geo-o-leen అనే విద్యార్థిని తన స్నేహితురాలితో ఫోదరిధో అనే చర్చిని చూడటానికి వెళ్ళింది. ఒకప్పుడు ఆ స్థలంలో ఒకప్పటి ఆ దేశపు రాణిని ఉరిదీయటం జరిగింది. అదే స్థలంలో ఈ "ఫోదరిదో" అనే చర్చిని నిర్మించుట జరిగింది. ఆ చర్చి వేదిక వెనుక భాగంలో క్రీస్తుని శిలువవేసిన చిత్రాన్ని చూసి ఎంతో ఆశ్చర్యపడింది. ఆ చిత్రం గురించి తన మిత్రురాలితో ఏదో మాటల సందర్భములో చెప్పగా, అలాంటి చిత్రము అసలు లేనే లేదని నిక్కచ్చిగా వాదించింది. దానితో జేన్ ఆ చర్చిని కట్టించిన ఆమెకు ఫోన్ చేసి దాని గురించి వాకబు చేయగా, అలాంటి పెయింటింగ్ గల చిత్రం చర్చిలో లేదని తెలిపింది. ఒక సంవత్సరం తరువాత మిత్రులిద్దరు అదే చర్చిని చూడటానికి వెళ్ళారు. చర్చిలోపల పరిస్థితి చూసి జెన్ ఉలిక్కిపడింది. ఎందుకంటే తను క్రితం చూసిన చర్చికి, ఇప్పటి ఈ చర్చికి భూమి–ఆకాశం అంత తేడా ఉన్నట్లు గమనించి, ఇంత త్వరగా ఈ విధంగా ఎలా మారిపోయిందనే సందేహంతో వ్యవస్థాపకురాలితో చర్చించింది. ఆమె ఈ చర్చి అప్పుడెలాగుందో ఇప్పుడు కూడా అలాగే ఉందని, ఏ విధమైన మార్పు ఈ చర్చిలో జరగలేదని విని జేన్ ఎంతో ఆందోళనకు గురైంది. చివరకు ఆ చర్చి యొక్క గత చరిత్రను పరిశీలించగా తేలినదేమంటే జేన్ చూసింది. 4 శతాబ్దాల వెనుక ఉన్న చర్చి అని, ఆమె Time Slipలో భూతకాలం లోనికి వెళ్ళి చూసినదిగా తేలింది. అంత పురాతన కాలపు నాటి చర్చిని దర్శించిన జేన్ మిగిలిన వివరాల గురించి ఏమి చెప్పలేకపోయింది. ఇదంతా కాల చక్రములోని రహస్య కోణాలలో ఒక భాగం అని, ఈనాటి వైజ్ఞానిక వేత్తల ఆలోచనలకు అందని విషయమైనదని కొలిన్ విల్సన్ తన గ్రంథంలో వ్రాయుట జరిగింది.

సుప్రసిద్ధ సాహిత్యకారుడు శ్రీ హరివంశరాయ్ బచన్ తన ఆత్మకథలో తన అనుభూతిని గురించి ఈ విధంగా వ్రాసుకోవటం జరిగింది. ఆయన విదేశాంగ శాఖలో ఒక మంత్రిగా పని చేస్తున్నప్పుడు, సఫ్దర్ జంగ్ రోడ్డులోని 219-D-1, Diplomatic

నిరంతరం ఏదో ఒక పనిలో నిమగ్నమయ్యేవారికి నిరాశ అనేది కలగదు.

Enclave లో నివాసం ఉంటూ భగవద్గీత శ్లోకాలను జనగీత పేరు మీద అనువదించేవారు. ఆయన ఈ అనువాద రచన చేసేటప్పుడు అనేక సార్లు శ్రీకృష్ణ పరమాత్మ దర్శనం పొందానని తను కూర్చొన్న స్థలం వద్దనే పరమాత్మ యొక్క రథం ద్వారక నుండి హస్తినకు వచ్చేటప్పుడు ఆగి ఉండేదని, రథానికి కట్టిన గుర్రాలు రథసారథి బాగా అలసినట్లు ఉండేవారని, రథం పైన శ్రీకృష్ణ పరమాత్మ ఉండటం తను అనేకసార్లు చాలా స్పష్టంగా దర్శించుకొనేవాడినని వ్రాసుకొన్నారు. ఈ విధమైన ద్వాపర యుగపు సాక్షి రూపంగా ఉన్న అనేక అనుభూతులను ఆయన తన గ్రంథంలో వ్రాసారు.

మరొక కాలచక్రంలో జరిగిన సంఘటన Gay Playfeer అనే ఒక రచయిత "Indefinate Boundry" అనే తన గ్రంథంలో ఈ విధంగా వ్రాయుట జరిగింది. ఒకసారి తన మిత్రునితో కలసి ఏదో పనిమీద కారులో Derbyseyar నుండి Pont Fract కి వెళుతూ దారిలో ఒక పార్క్ వద్ద కారు ఆపిలోనికి వెళ్ళారు. పార్క్ లోపల అందమైన పూలవనం దర్శనమిచ్చింది. రకరకాల పూలు మంచి సువాసనలతో పరిమళిస్తూ అందం మనసులకు ఆహ్లాదాన్ని చేకూర్చుతున్నాయి. రకరకాల మొక్కలతోపాటు, పూపొదరిళ్ళు చూస్తూ ఆనందిస్తూ వనమంతా కలియ తిరిగి, ఒక చోట మిత్రుణ్ణి వదిలి తనొక్కడే వనం చివరి భాగానికి చేరుకొని నాలుగు ప్రక్కల గల అందాలను దర్శించు కొంటున్నప్పుడు పార్క్‌కి బైట ఒక పురాతన శైలిలో కట్టిన కొన్ని నివాస గృహాలను చూసి ఆశ్చర్యపోయాడు.

ఎందుకంటే ఇంత పురాతన గృహాల గురించి తను పుస్తకాలలో చదవటం తప్ప కంటితో ఎప్పుడూ చూడనందున, ఇప్పుడు స్వయంగా వాటిని చూడటంతో ఎంతో విస్మయం పొందాడు. ఆ భవన నిర్మాణం, వాటికి శైలిని ఎంతో ఆసక్తితో గమనిస్తూ చాలా సేపటి వరకు ఉండిపోయాడు. భవనాల ముందు కొన్ని జంతువుల బొమ్మలు నిలబెట్టబడి ఎంతో అందంగా ఉన్నాయి. ఇంటి పై కప్పు నుండి వ్రేలాడుతున్నట్లు ఇంటి ముందు చూరు నగిషీ పనితంతో ఎంతో ముచ్చట గొలుపుతుంది. ఆ కాలపు చేతి పనివారు చూపిన పనితనాన్ని గుర్తు చేసుకొంటూ ఆలోచనల్లో మునిగిపోయాడు. కాలానికి సంబంధించిన లెక్కలు గుణించు కొంటూ, ప్రస్తుతం 1966 సం॥ మే నెల అయితే ఇంగ్లండులోని చారిత్రక ఆధారాల వల్ల ఇలాంటి నమూనా గల ఇళ్ళ నిర్మాణం గల 14వ శతాబ్దానికి కొంచెము అటు ఇటుగా ఉన్నట్లు బేరీజు వేసుకొన్నాడు. అంటే ఈ భవన నిర్మాణం 600 వందల సం॥ల క్రితం జరిగినట్లు నిర్ధారణకు వచ్చి, ఇంత సుదీర్ఘ కాలం గడచినా అవి సురక్షితంగా ఏ మాత్రం డామేజ్‌కి గురికాకుండా ఇప్పుడే నిర్మించినట్లుగా కన్పించుటలో కారణం తెలియక తికమక పడుతున్న సమయంలో దూరం నుండి మిత్రుని కేకతో ఈ లోకానికి వచ్చి మిత్రుణ్ణి చేరుకొని, చాలా ఆలస్యమైన కారణంగా చేరవలసిన గమ్యానికి కారులో బయలు దేరారు. తను చూసిన విషయాలను మిత్రునితో చెప్పినప్పుడు, అలాంటి గృహాల సముదాయం పార్క్ చుట్టు ప్రక్కల ఎక్కడా లేవని కొట్టి పారేశాడు. తన కళ్ళతో స్వయంగా చూసిన దానిని భ్రాంతికి గురి అయ్యావని అనేటప్పటికి Flay Feer కి అనుమానమొచ్చి, తను స్వయంగా కంటితో చూసిన దానిని మిత్రుడు ఒప్పుకోక పోవటంతో అసలు అసత్యమేమిటో తిరుగు ప్రయాణంలో తేల్చుకోవాలని నిశ్చయించు కొన్నాడు.

తిరిగి వచ్చేటప్పుడు తిరిగి మిత్రులిద్దరూ పార్క్‌లోనికి ప్రవేశించి నాలుగు ప్రక్కల తిరిగి చూసారు గాని Flay Feer చూసిన భవనాలు ఎక్కడా కన్పించలేదు. తను చూసింది భ్రాంతి కాదని యదార్థమని ఋజువు చేయటానికి ఏ ఆధారం కన్పించనంత మాత్రాన అతను భ్రాంతిలో మాత్రం ఉండలేదు. ఇదంతా కాలచక్రములోని రహస్య అలలాంటిది. 600 సం॥ల క్రితం జరిగిన సంఘటనను అతను దర్శించగలిగాడు. తరువాత చరిత్రకారుల ద్వారా తేలిన విషయం ఏమనగా 600 సం॥ల వెనుక ఆ ప్రదేశంలో నాగరికత గలిగిన ఒక బస్తీ ఉండేదని, దానిలో విశిష్ట గుర్తింపు కలిగిన పనివారు ఉండేవారని ఆ సంఘటననే ప్రస్తుతం ప్లే ఫియర్ దర్శించినట్లు, అది సత్యమేనని బయటకు తేలింది.

జల ప్రవాహంలాంటిదే కాల ప్రవాహం కూడా దాని స్వాభావిక గతి ప్రయాణంలో వెనుక నుండి ముందుకు, వర్తమానం నుండి భవిష్యత్తుకు జల ప్రవాహం మాదిరిగా తన దిశలు మార్చుకోగలదని పై నిదర్శనాల వల్ల తెలుస్తుంది. ఇది ఒక విశిష్టమైన వైజ్ఞానిక విషయం దీనిని తెలుసుకోవటం సర్వ సాధారణంగా ఎవరైతే శుద్ధ మనస్కులో, ఉత్కృష్ట చింతనాపరులో, విశుద్ధ వ్యవహర్తులో వారికి మాత్రమే ఆ దైవీ శక్తిని హస్తగతం చేసుకొనే విధానం లభిస్తుంది. వారికి జన్మ-జన్మాంతర కాలచక్ర రహస్యపు లోతులలోని విజ్ఞానం కరతలామలకమవుతుంది. అలాంటి వారే మన ఋషులు యతులు, యోగులు మరియు భారతదేశపు ఆధ్యాత్మిక పెద్దలు.

*- అఖండజ్యోతి, మార్చి 2000*

*అనువాదం : చెన్నకేశవరావు*

**గెలవాలన్న తపన తగ్గితే ఓటమి దగ్గరయినట్లే.**

ఆదిశక్తి యొక్క లీలాకథలు - 18

# శ్రీ దుర్గాసప్తశతి కథ గాయత్రీ సాధనా మర్మమును తెలుపుతుంది

ఆదిశక్తి లీలాకథలోని ప్రతి అక్షరము గాయత్రీ సాధన యొక్క ఆధ్యాత్మిక అనుభూతులతో నిండి ఉంటుంది. దీనిలోని ప్రతి చరిత్ర, ప్రతి అధ్యాయం, ప్రతి మంత్రం, ప్రతి శబ్దములో గాయత్రీ మంత్ర అధిష్ఠాత్రి శక్తి యైన భగవతి గాయత్రి కరుణ కిరణములు ప్రకాశిస్తాయి. అంతేకాదు ఈ పవిత్రమైన కథలో సవితాదేవుడైన భర్గుని తేజస్సు ధారణ చేసే విజ్ఞానం ఉద్ఘాటించబడినది. ఈ వ్యాస పరంపరలో ముందు ప్రచురించబడిన వ్యాసాలు తాత్త్విక దృష్టితో గాయత్రీ మంత్ర సాధన చేస్తున్నప్పుడు ఆచరించే షట్కర్మల తత్త్వపరమైన విస్తృత వర్ణనలే. వాటిని గాయత్రీ పురశ్చరణకు ముందు చేసే షట్కర్మలు మరియు తదుపరాంతం ఆచరించే క్రియారూపంలో కూడా అనుభూతి చెందవచ్చును.

**పాఠకులను అన్య ఉపాసనల వైపుకు ప్రేరేపిస్తున్నామేమో అన్న సందేహం పాఠకులకు మనస్సులో ఏ మూలనో తొంగి చూడవచ్చును. కానీ ఆ సందేహమును త్యజించవలెను.** నిజమేమిటంటే ఈ వ్యాసపరంపర ద్వారా వారిని గాయత్రీ సాధన యొక్క ఉచ్చస్తరీయ సోపానాల దిశగా తీసుకువెళ్ళే ప్రయత్నం జరుగుతున్నది. వ్యాసపరంపర సహాయంతో శరీర త్రయము, సప్తచక్రాలు, పంచకోశసాధనా విజ్ఞానముల సాధనా విధానమును తెలుసుకొనగలరు. మరియు గాయత్రీ సాధనా ప్రక్రియతో కుండలినీ తత్త్వజ్ఞానం, సత్య సాక్షాత్కారం ఏ చరణముల ద్వారా, ఏవిధంగా జరుగుతుంది అనేది సాధకులు గ్రహించగలరు.

ఇప్పటివరకు ఏ సాధకులైతే గాయత్రీమంత్ర సాధన ద్వారా తమ లౌకిక సమస్యలనుండి బయటపడి, వాటిని అధిగమిస్తూ వచ్చారో, వారు ఇప్పుడు గాయత్రీమంత్ర సాధన ద్వారా సత్త్వ, రజ, తమో గుణముల వలన కలిగే అవరోధములను అధిగమిస్తూ ఆధ్యాత్మిక విభూతులను తత్త్వపరమైన సత్యరూపంలో ఏవిధంగా పొందగలరో కూడా గ్రహించగలరు. ఈ స్థితిలో ఏ భయాలు ఉండరాదు, ఏ భ్రాంతులకు తావివ్వకండి. వివేకమును కోల్పోకండి. అంతఃకరణలో అణువంత భక్తి, లేశమాత్రపు వివేకం ఉన్నవారు గాయత్రి తత్త్వమునకు వేరుగా బాహ్యజగత్తులో, సృష్టిలో మరేది లేదు అన్న విషయమును తెలుసుకుంటారు. సర్వ స్వరూపాలలో భగవతి దర్శనానుభూతి చెందగలవారే నిజమైన భక్తులు.

***ఆదిశక్తి లీలాకథ నిజానికి యథార్థంగాను, సంపూర్ణమైన అర్థంలోను గాయత్రీమాత గాథయే!*** ధర్మాచరణగావించే మనుష్యులలో వివేకం జాగృతమైనప్పుడు అతను ఆధ్యాత్మిక సాధనను, గాయత్రీ సాధనను ఆరంభిస్తాడు. సాధకునిలో శ్రమ, దమ, విరక్తి, తితిక్ష, వివేక-వైరాగ్య-ముముక్షత్వాలు జాగృతమై నప్పుడు అతని యథార్థ సాధన ప్రారంభమౌతుంది. అవే ఆదిశక్తి లీలాకథ యొక్క షడంగములు. కవచం, అర్గళ, కీలకం, ప్రాధానిక రహస్యం, వైకృతికరహస్యం మరియు మూర్తి రహస్యములను అనుభూతి చెందిన సాధకుడే ఆధ్యాత్మిక మార్గంలో పయనించుటకు యోగ్యుడు.

సాధకుని ఈ యోగ్యతే ఆధ్యాత్మిక మనస్సు రూపంలో, పరమేశ్వరుని కృపారూపంలో అంకురిస్తుంది. దానినే శేషసాయి మీద శయనించిన విష్ణుభగవానుని నాభినుండి బ్రహ్మదేవుని ప్రకటీకరణగా వర్ణిస్తారు. పరమేశ్వరుని కృపతో ఉద్భవించిన ఆధ్యాత్మిక మనస్సు ముందుగా తమస్సును ఎదుర్కొంటుంది. నలుచెరగులా అంధకారం ఆవరించి ఉంటుంది. ఆ గాఢాంధ కారంలో విష్ణుదేవుని కర్ణములలోని గుబిలినుండి ఆవిర్భవించిన మధు-కైటభులు అనగా మోహం-భయములు ఆధ్యాత్మిక మనస్సును భయపెడతాయి. అప్పుడు గాయత్రి సాధకుని ఆధ్యాత్మిక మనస్సు, అనగా బ్రహ్మదేవుడు తన రక్షణ కొరకు భగవతి జగన్మాతను ఎలుగెత్తి పిలుస్తాడు. ఆ సమయంలోనే భక్తి యొక్క ప్రారంభరూపం, ఆర్తిభావన ప్రకటితమౌతుంది. రాత్రిసూక్త రూపంలో దీని వ్యక్తీకరణ జరుగుతుంది. సాధకుని ఆధ్యాత్మిక మనస్సు యొక్క ఈ ప్రార్థనను ఆలకించి భగవతి గాయత్రి కుండలినీ జాగరణ ప్రథమ చరణంగా ఆవిర్భవిస్తుంది.

దీనితోపాటు సహస్రారదళం మీద నిదురించిన అనగా సహస్ర పడగల శేషనాగుమీద శయనించిన విష్ణుభగవానుని యోగ నిద్ర భంగమౌతుంది. దేవదేవుడు మధు-కైటభులతో యుద్ధం చేస్తాడు. అయితే అనుభవజ్ఞుడైన సాధకునికి మోహం-భయముల నుండి బయటపడుట అంత తేలికకాదని తెలుసు. అందువల్ల పరమేశ్వరి కుండలినీ మహాశక్తి మధు-కైటభులను మోహింప జేస్తుంది. ఆమె మాయచే మోహితులైన మధు-కైటభులు 'విష్ణు భగవానుడినే తమనుండి వరదానమును గ్రహించమని'

**మిత్రుడు ఆనందంగా ఉన్నప్పుడు పిలిస్తే వెళ్ళాలి. కష్టాలలో ఉన్నప్పుడు పిలవకున్నా వెళ్ళాలి.**

అడుగుతారు. 'నాచేతిలో మీరు మరణించాలి' అని విష్ణువు ఆ రాక్షసుల నుండి మాటను తీసుకుంటాడు. మాటకు కట్టుబడిన రాక్షసద్వయం భగవానుడు విష్ణువు చేతిలో అసువులు కోల్పోతారు. తదుపరాంతం అస్తిత్వంలో ఆధ్యాత్మిక ప్రకాశం కాంతులీనుతుంది. దానికితోడు కుండలినీ జాగరణ ప్రారంభిక ప్రక్రియ పూర్ణమౌతుంది.

దీని పిమ్మట గాయత్రీ సాధన ద్వితీయ చరణం ఆరంభమౌతుంది. ఈ స్థితిలో సాధకుని సాధన మీద సంస్కారాలు ఆధిపత్యం చెలాయిస్తాయి. సాధకుని ప్రాణబలం ఈ వాసనల కుతంత్రంలో చిక్కుకుని అర్ధ-పశు రూపును ధరిస్తుంది. ఆ రూపే మహిషాసురుడు. మహిషుని నాశనం కొరకు ఇంద్రియాల అధిదేవత, మనస్సు అనగా బ్రహ్మ, వైరాగ్యభావం అనగా శివునితో కలిసి శేష శయనుడైన విష్ణుభగవానుడిని మార్గదర్శనమునకై అర్థిస్తారు. విష్ణువు మార్గదర్శన స్వరూపం ఇక్కడ మరల భగవతి గాయత్రీ మహాశక్తిగా అవతరిస్తుంది. ఈ వాసనలను - భావనలుగా రూపాంతరం కావిస్తుంది. ఈ తత్త్వం ఎలా ముందుకు సాగుతుంది అన్న విషయము యొక్క విస్తారమైన కథా వర్ణనయే ద్వితీయ చరిత్ర.

తన సాధన ప్రారంభ చరణాలలో సాధకుని చేతన మూలాధారం నుండి జాగృతమై స్వాధిష్ఠానచక్రమునకు చేరి ఆ చక్రానుభూతి చెందుతూ మణిపూరకచక్రంలో ప్రతిష్ఠితమౌతుంది. ఈ ద్వితీయ చరణంలో అనాహతచక్రంలో అతని వికాసం జరుగుతుంది. ఈ కథానుభూతిని చెందని సాధకుడు ఎప్పటికీ వాసనలనే బురదలో కూరుకుపోయి ఉంటాడు. సాధకుడు తప్పకుండా సాధనలోని సూక్ష్మ అనుభూతులను చెందాలి. ఈ అనుభవం తర్వాతనే సాధకుడు తృతీయచరణంలోకి అడుగు పెట్టగలడు.

ఈ తృతీయ చరణంలో 'ధియో యోనః ప్రచోదయాత్' యొక్క లక్ష్యమైన బంధనముక్తి తత్త్వదర్శనంతో జరుగుతుంది. అయితే ఇక్కడ సాధకుడు అహంకారం, మమత అనే భావాలు అనగా శుంభ-నిశుంభులు అను రాక్షసులతోను, అతని సేనయైన 1) సుగ్రీవుడు (పరిగ్రహించుట), 2) ధూమ్రలోచనుడు (భ్రాంతి), 3 ముండుడు (దర్ప-నివృత్తి), 4) చండుడు (క్రోధ ప్రవృత్తి), 5) రక్తబీజుడు (కామన-కర్మబీజం) అనే రాక్షస సేనతో తలపడవల్సి ఉంటుంది. ఈ స్థితిలో సాధకుడు ప్రబల భావనతో గాయత్రీ సాధన చేస్తే ముందుగా మూలాధారం, తర్వాత అనాహత చక్రములలో ప్రకటితమయ్యే భగవతి గాయత్రి తిరిగి ఇప్పుడు ఆజ్ఞాచక్రంలో ప్రత్యక్షమౌతుంది.

ఆజ్ఞా చక్రంలో ఆవిర్భవించిన గాయత్రీదేవీ అక్కడున్న అహంకార-మమకారాలతో తలపడి వాటితోను, వాటి సేనతోను భీకర సంగ్రామం చేస్తుంది. ఈ క్రమంలోనే సాధకునిలో గాయత్రీ మహా ప్రజ్ఞరూపం అవతరించి, ఆ దేవి సాధకునికి 'ధర్మమేధ సమాధిస్థితి' ని అనుగ్రహిస్తుంది. అంతేకాక సాధకుడిని తీసుకుని దేవి స్వయంగా సహస్రారచక్రం మీద ప్రతిష్ఠితమౌతుంది. ఇదే సాధకుడు అందుకోవల్సిన చరమస్థితి. గాయత్రీ సాధన యొక్క సారం కూడా ఇదే. **అందువల్ల సాధకులు ఆదిశక్తి లీలాకథ రూపంలో ఈ గాయత్రీ సాధనను లోతుగా మననం చెయ్యవల్సి ఉంటుంది.**

*- అఖండజ్యోతి, జూన్ 2008*

*అనువాదం : శ్రీమతి లక్ష్మీరాజగోపాలు*

## శ్రీ గాయత్రీ శతకం

**63.** ***గ్రహములన్నింటి కిచ్చును గమనశక్తి***
***జీవులన్నింటి కొసగును జీవశక్తి***
***భక్తకోటికి అందించు భవ్యశక్తి***
***విశ్వ జనయిత్రి గాయత్రి వేదమాత***

*తా:- సూర్యుడు, చంద్రుడు, కుజుడు, బుధుడు, గురుడు, శుక్రుడు, శని, రాహువు, కేతువు అనే నవగ్రహాలకు గ్రహరాశి మండలాలలకు చలనశక్తిని ప్రసాదించేది గాయత్రీమాత. ఎనుబది నాలుగు లక్షల జీవ రాసులకు జీవశక్తిని సమ కూర్చేది ఆ మహాతల్లే. అట్టి మహామాత తన భక్తులందరికి భవ్యమైన శక్తిని అనుగ్రహిస్తుంది.*

**64.** ***మందమతియైన విద్యార్థి మనసు పెట్టి***
***భవ్య మంత్రమున్ దీక్షతో పలుకునంత***
***తనను ఆయమ్మ తీర్చు మేధావిగాను***
***విశ్వ జనయిత్రి గాయత్రి వేదమాత***

*తా:- చదువులో బాగా వెనుకబడి ఉండే విద్యార్థి మనః పూర్వకముగా భవ్యమైనట్టి ఆ మహామంత్రమును నిత్యము పఠిస్తూ ఉంటే ఆ తల్లి అనుగ్రహించి ఆ విద్యార్థిని బుద్ధి శీలునిగా తీర్చిదిద్ది మహామేధావిగా మార్చివేస్తుంది.*

*రచన : సహజ కవి, సాహిత్య రత్న,*
*శతక చతురానన, పద్య కవితాసుధానిధి*
*శ్రీ అయినాల మల్లేశ్వర రావు*

**నిన్ను నువ్వు పొగుడుకోనవసరం లేదు. తిట్టుకోనవసరం లేదు. నువ్వేంటనేది నీ పనులే చెబుతాయి.**

# అతీంద్రియ సామర్ధ్యం - కల్పన కాదు, వైజ్ఞానికం

ఆత్మ పరమాత్మలో కలవడానికి, జీవుడు పరబ్రహ్మలో ఐక్య మవ్వడానికి, లక్ష్యాన్ని సాధించడానికి చేయవలసిన సాధనలన్నీ యోగ శాస్త్రాలలో తెలుపబడ్డాయి. ఈ విధమైన సాధనల ద్వారా దివ్య శక్తులను కూడా సాధించవచ్చని ఆ శాస్త్రాలే చెప్తున్నాయి. విలక్షణమైన, చమత్కారమైన శక్తులను కూడా సాధించవచ్చు. యోగ దర్శనంలోని నాలుగు పాదాల్లో ఒక పాదం, అంటే ఒక అధ్యాయంలో పూర్తిగా యోగసాధనల గురించిన వివరణ ఉంది. సాధకులు ఎటువంటి సిద్ధులు పొందుతారు అనేది తెలుపబడింది. వాటిలో కొన్ని – దివ్యదృష్టి, దివ్యశ్రవణం, దూరదృష్టి, భూత భవిష్యత్ జ్ఞానం, అణిమ, గరిమ, లఘిమ, ప్రాప్తి, ప్రాకామ్య, ఈశిత్వ, వశిత్వ, కాయ, సపత, అనభిఘాత మొదలైన సిద్ధులు. ఈ సిద్ధుల గురించి విస్తారమైన వర్ణన మరెన్నో శాస్త్రాలలో ఇవ్వ బడింది. అవి చదివినంతమాత్రాన వీటిపై విశ్వాసం ఏర్పడ నవసరం లేదు. అందుకే చాలా మంది యోగశాస్త్రాలను, అందులో చెప్పిన సిద్ధులను కల్పితాలని భావించారు. గతంలో వైజ్ఞానికులు కూడా అలాగే భావించారు. కాని అసంఖ్యాకమైన సంఘటనలను, సిద్ధపురుషులను విశ్లేషించి, పరీక్షించి నేడు తేల్చిందేంటంటే అతీంద్రియ సామర్ధ్యం అనేది కేవలం కల్పన కాదు. అవి తాత్త్వికమైనవి, యోగసాధన ద్వారా వికసింప చేసుకోవడం అనేది వైజ్ఞానిక ప్రక్రియ. ఈ విధంగా విశ్వ బ్రహ్మాండంలో వ్యాపించి ఉన్న పరమ చైతన్యంతో జీవ చైతన్యం తాదాత్మ్యం స్థాపించుకుని దాని సామర్ధ్యాన్ని సంపాదిస్తుంది.

ముండకోపనిషత్తులోని రెండవ అధ్యాయంలో అంగిర మహర్షి శౌనకునితో ఈ విధంగా చెప్పారు – ప్రజ్వలిస్తున్న అగ్ని గుండం నుండి ఏ విధంగా అగ్నికి సమానమైన అసంఖ్యాకమైన నిప్పు రవ్వలు నలుదిక్కులా కురుస్తాయో, అదే విధంగా పరమపురుషుడు, శాశ్వత బ్రహ్మ నుండి కూడా నానావిధములైన మూర్త, అమూర్త భావాలు బహిర్గతమౌతాయి. వాటిని జీవసత్తా అని కూడా అనవచ్చు. అగ్నిలోని సమస్త లక్షణాలు నిప్పురవ్వల్లో ఉన్నట్టే, జీవాత్మలో కూడా పరమాత్మలోని సమస్త లక్షణాలు అంతర్నిహితమై ఉంటాయి. యోగ సాధన, తపశ్చర్యల ద్వారా ప్రయత్నపూర్వకంగా వాటిని జాగృతపరుచుకోవచ్చు. అలా జాగృత పరుచుకోవడం వల్ల ఇంద్రియాలకు అతీతమైనవి కూడా ఇంద్రియాల పరిమితిలోకి వస్తాయి. సామాన్య బుద్ధి ద్వారా అర్థం చేసుకోలేని వాటిని ప్రజ్ఞ ద్వారా, జాగృత సూక్ష్మ బుద్ధి ద్వారా సులువుగా తెలుసుచేసుకోవచ్చు.

కొన్ని సందర్భాల్లో ఏ ప్రయత్నం లేకుండానే కొందరిలో ఈ అతీంద్రియ సామర్ధ్యాలు జాగృతమవుతాయి. పూర్వ జన్మల సంచిత సంస్కారాలే దీనికి కారణమని శాస్త్రకారులు చెప్తారు. అభ్యాసాల వల్ల కూడా ఇవి సిద్ధిస్తాయి. ఇది ఎలా సంభవమన్న విషయాన్ని పక్కన పెడితే, అసంఖ్యాకమైన సంఘటనల్లో బహిర్గతమైన ఈ ఆశ్చర్యకరమైన సిద్ధులకి మూలం మనిషిలోనే దాగి ఉందని, వాటిని ఆధ్యాత్మిక సాధనల వల్ల కాని, భౌతిక ఉపాయాల వల్ల కానీ జాగృతపరుచుకోవచ్చు అనేది తేటతెల్లమవుతోంది. మొత్తానికి ఈ సంఘటనల ఆధారంగా చైతన్యం యొక్క స్వతంత్ర్య సామర్ధ్యం, బ్రహ్మాండంలో వ్యాపించిన చైతన్య జగత్తు, అతీంద్రియ సామర్ధ్యం అనేవి నిరూపించబడ్డాయి.

ఈ మధ్య ఆలోచనాపరులైన దృష్టి ఈ పరిశోధనలపై మళ్ళింది. పరిశోధన లక్ష్యం – "నిజంగా చైతన్యం అనే దానికి అస్తిత్వం, పరిధి, బలం ఉంటుందా? అదే నిజమైతే దాన్ని వికసింపజేసుకుని ఉపయోగించుకోవచ్చా?" ఈ విషయమై జరిపిన పరిశోధనల వల్ల మనిషిని మరింత సమర్థవంతంగా చేసేది, ప్రపంచంలో సుఖసంతోషాలకు ఆధారంగా నిలిచేది ఆధ్యాత్మిక వైజ్ఞానిక సమన్వయం మాత్రమే అని ఋజువైంది.

అతీంద్రియ సామర్ధ్యంతో ముడిపడిన అనేక సంఘటనలను, మనుషుల్ని పరిశోధించారు. ఒకప్పటి జెకొస్లోవేకియాలో నివసించిన ప్రోతిలావ్ కాఫ్ట్ అనే శిల్పికి అతీంద్రియ దృష్టి సామర్ధ్యం ఉండేది. ఉత్తర ధృవ ప్రాంతంలోని వాతావరణ పరిస్థితుల సమాచారం సేకరించడానికి ఇతని దృష్టి ఎంతో సహకరించేది. రెండవ ప్రపంచ యుద్ధంలో ఇతనిచ్చిన సమాచారం అక్షరాలా నిజమైంది. అతని ఈ దివ్య సామర్ధ్యాన్ని యుద్ధంలో ఉపయోగించుకున్నారు కూడా. తంత్రవిద్యకు తలమానికంగా భావించే ఎన్సైక్లోపీడియా ఆఫ్ ఆకల్ట్ అనే పుస్తకంలో ఎటిన్ మెస్కర్ అనే వ్యక్తి పొట్ట ద్వారా అదృశ్య వస్తువులు, ప్రత్యక్షంగా కనిపించని వస్తువుల గురించి వివరించే వాడని వ్రాసారు. ఫ్రాన్స్‌కి చెందిన వైజ్ఞానికులు ఈ వ్యక్తిని పరిశోధించారు. వారు తేల్చిందేంటంటే ప్రతి వ్యక్తి యొక్క చర్మంలోను చూడగలిగే శక్తి కలిగిన కోశాణువులు ఉంటాయి, ఎటిన్ మెస్కర్‌లో ఈ కోశాణువులు మామూలు కన్నా ఎక్కువ వికసించి ఉన్నాయి. అంధులు కూడా తమ చెవుల ద్వారా, స్పర్శ ద్వారానే కళ్ళలోటును తీర్చుకుంటారని గుర్తుంచుకోవాలి.

1959 లో అమెరికా పరిశోధకులు టెలిపతిని ఉపయోగించి మరే ఇతర యంత్రాలు లేకుండా నాటిలస్ అనే జలాంతర్గామికి

**ప్రతి అవకాశంలోనూ కొన్ని అడ్డంకులు ఉంటాయి. ప్రతి అడ్డంకి వెనకా కొన్ని అవకాశాలు ఉంటాయి.**

సందేశాలు పంపారు. ఆ జలాంతర్గామిలోని వ్యక్తుల నుండి కూడా ఈ విధంగానే సందేశాలు అందుకున్నారు. రష్యా వైజ్ఞానికులు ఈ సమాచారాన్ని తెలుసుకుని వారు జరిపే టెలిపతి పరిశోధనల్ని తీవ్రతరం చేసారు. వాళ్ళు అప్పుడే పుట్టిన కుందేలు పిల్లల్ని జలాంతర్గామిలోకి పంపించారు. టెలిపతిని పరీక్షించడమే వారి ఉద్దేశ్యం. తల్లి కుందేలు మెదడులోను, పిల్లల మెదళ్ళలోను ఒకే రకమైన ఎలెక్ట్రోడ్స్ అమర్చారు. సముద్ర గర్భంలో ప్రయాణించాక ఒక్కొక్కటిగా పిల్లల్ని చంపడం మొదలుపెట్టారు. తల్లీ పిల్లల ఎలక్ట్రోడ్స్ మధ్య ఎటువంటి అనుసంధానం లేక పోయినా ఆ పిల్లల్ని చంపేటప్పుడు ఆ తల్లి విలవిల్లాడింది. తన కళ్ళ ముందే వాటిని చంపితే వాటిని రక్షించడానికి శతవిధాలా ఎలా ప్రయత్నించేదో అలాగే కొట్టుమిట్టాడినట్టు సంకేతాలు వచ్చాయి. ప్రాణుల మధ్య పరస్పర సంబంధాన్ని ఏర్పర్చే ఒక సూత్రం ఉన్నట్టు ఈ పరిశోధనలో తేల్చారు. ఈ సూత్రాన్ని బలపరుచుకోగలిగితే సులువుగా ఒకరికొకరు సంకేతాలిచ్చి పుచ్చుకోవచ్చు.

అమెరికాకు చెందిన జీవశాస్త్ర వైజ్ఞానికుడు క్లీవ్ వైవస్టొట్ సముద్రపు తేళ్ళ మీద ఇటువంటి పరిశోధననే జరిపారు. ఒక తేలును చంపితే మిగితా తేళ్ళకే కాక ఇతర నీటి జంతువులు కూడా బాధపడ్డాయి. ఈ అనుభూతి ప్రవాహాన్ని ఆపడానికి సీసంతో అడ్డుకట్ట వేసినా కూడా పీడింపబడే ప్రాణుల బాధ మిగిలిన ప్రాణుల్ని ప్రభావితం చేస్తూనే ఉన్నది. ఈ పరిశోధనా ఫలితాల ఆధారంగా ప్రాణులన్నిటి మధ్య ఒక చైతన్య ప్రవాహం సూత్రప్రాయంగా ఉంటుందని, దాని ద్వారా పరస్పర సుఖ దుఃఖాలను పంచుకుంటాయని క్లీవ్ వైవస్టొట్ ప్రతిపాదించారు. డా.గార్డెనర్ మర్ఫీ అనే మరో శాస్త్రజ్ఞుడు కూడా ఇటువంటిదే ప్రతిపాదించారు. అగ్ని పర్వతాలు చూడడానికి విడివిడిగా దూరంగా ఉన్నప్పటికి వాటిలోని లావా విస్ఫోటాలు, లోతు ఏ విధంగా అయితే ఒకదానితో ఒకటి ముడిపడి ఉంటాయో, అదే విధంగా ప్రాణులలో జీవం విడివిడిగా కనిపించినప్పటికి అవి పరస్పరం సంబంధం కలిగి ఉంటాయి. అనుభూతులన్నిటినీ పంచుకుంటాయి.

పాతికేళ్ళ క్రితం టెలిపతిని రష్యా ప్రజలు గారడీగా, మోసంగా భావించేవారు. దాన్ని తిరస్కరించి అపహాస్యం చేసేవారు. ఎటువంటి ఆలోచనా ప్రసారానికైనా అవసరమైన ఎలెక్ట్రో మాగ్నెట్ తరంగాలు మస్తిష్కంలో ఎక్కడా కనిపించవని వాదించారు. ఈ ప్రతిపాదనని గట్టిగా నమ్మిన వారిలో అలెగ్జాండర్ కితాయి గోరోరస్కీ అనే వైజ్ఞానికుడు అగ్రగణ్యుడు. కాని తరువాతి కాలంలో ఆయన ఎన్నో పరామనో వైజ్ఞానిక పరిశోధనలను నిశితంగా పరిశీలించి, అధ్యయనం చేసి, అందులో వెలువడ్డ ఫలితాల ఆధారంగా తన నమ్మకం తప్పని నిజాయితిగా ఒప్పుకున్నాడు.

బూల్ఫ్ మోసంగ్ అనే వ్యక్తి ఎక్కడో దూరంగా జరిగే సంఘటలని కూడా స్పష్టంగా వివరించగలిగేవాడు. ఇతనిపై గోరోరస్కీతో పాటు మరెందరో వైజ్ఞానికులు పరిశోధనలు జరిపి చివరికి తేల్చిందేంటంటే టెలిపతి అనేది గారడీ గానీ, మోసం కానీ కాదనీ అది ప్రామాణికమైన సత్యమని ఒప్పుకున్నారు.

మనిషికి సామాన్యంగా రెండు కళ్ళతో పాటు మరో నేత్రం ఉంటుందని, దాన్ని ఆజ్ఞా చక్రం అంటారని భారతీయ శాస్త్రాలు చెప్తున్నాయి. ఇది రెండు కనుబొమ్మల మధ్య ఉంటుంది. ధ్యానం చేసేడప్పుడు దృష్టిని ఇక్కడే కేంద్రీకరించాలని చెప్తారు. ప్రపంచంలోని స్థూల సూక్ష్మ పరిస్థితులను తెలుసుకుని అర్థం చేసుకోవడంతో పాటు వస్తువులను, మనుషులను కూడా ప్రభావితం చేయగల శక్తి దీనికుంటుంది. ఈ కేంద్రంలోని శక్తిని ఉపయోగించుకుని వాతావరణంలో మార్పులు కూడా తీసుకుని రావచ్చుట. దూరదృష్టి, పరోక్ష దృష్టి అనేవి ప్రారంభిక కళలు మాత్రమే. ఏ విధంగా అయితే ఎక్స్-రే కిరణాలు దట్టమైన పదార్థాలలో నుంచి దూసుకునిపోయి లోపలున్న వస్తువుల చిత్రాలను ఎటువంటి హాని కలుగజేయకుండా ప్రదర్శించగలవో, అదే విధంగా ఆజ్ఞాచక్రం యొక్క సంకల్ప కిరణాలు కూడా ఎక్కడో దూరంగా ఉన్న కనిపించని దృశ్యాలను కూడా అవరోధాలన్నిటినీ దాటి మరీ చూడగలదు. ఈ విధంగా పదార్థాలను చూడడమే కాక, ప్రాణుల మానసిక స్థితులను కూడా అర్థంచేసుకోవచ్చు. చూడడం, అర్థం చేసుకోవడం అనే శక్తులతో పాటు ఇతరులను ప్రభావితం చేయగల శక్తి, వారిని మార్చే శక్తి కూడా ఆజ్ఞాచక్రానికి ఉంటుంది.

సృష్టిలోని ప్రతి పదార్థంలోనూ శక్తి మరియు ప్రకాశంతో కూడిన విద్యుత్ కిరణాలు కలిగి ఉంటాయని విజ్ఞానశాస్త్రం కూడా ఒప్పుకుంటుంది. ఈ కిరణాలు ప్రకంపన తరంగాలుగా ప్రపంచ వ్యాప్తంగా ప్రవహిస్తూ ఈథర్ ద్వారా దూరదూరాలను చేరుకుంటుంది. వాటిని సరిగ్గా పట్టుకోగలిగితే దూరాన ఉన్న దృశ్యాలు కూడా చూడవచ్చు. చుట్టుపక్కల దృశ్యాలను, శబ్దాలను గ్రహించడానికి మామూలు కళ్ళు, చెవులు సరిపోతాయి. కాని దూరాన ఉన్న దృశ్యాలను చూడగలిగే, శబ్దాలను వినగలిగే సామర్థ్యం ఉన్నందుకు ఆజ్ఞాచక్రాన్ని ఆరవ ఇంద్రియంగా పేర్కొన్నారు. అంటే మనకున్న ఐదు స్థూలమైన ఇంద్రియాలు చేయలేనిది ఈ ఆరవ ఇంద్రియమైన ఆజ్ఞాచక్రం చేయగలిగినది. ఇదే అతీంద్రియ సామర్థ్యం, దాని విజ్ఞానం.

*– అఖండజ్యోతి, డిసెంబర్ 1979*

*అనువాదం : శ్రీమతి జయలక్ష్మి*


**పొరుగింటి గోడలు శుభ్రంగాలేవని విమర్శించడం కాదు. నీ గుమ్మం ముందున్న చెత్తను శుభ్రం చేసుకో.**

జన్మశతాబ్ది ప్రత్యేకం

# రచనా వ్యాసాంగ సాధనలో మునిగిపోయిన సమాధియోగి

'రచనావ్యాసాంగ సాధనలో మునిగిపోయిన సమాధియోగి' – పరమపూజ్య గురుదేవులు ప్రాతఃకాలంలో ఈ భంగిమలోనే దర్శనమిచ్చేవారు. ఆయన ప్రతి శ్వాస రామాయణం, ప్రతి కర్మ భగవద్గీత. ఇదేకాక ఇటువంటి అనేకానేక దైవీతరంగాల మధ్యన ప్రణామం–దర్శన కార్యక్రమము ఆరంభమయ్యేది. ప్రాతఃకాలము 5 గంటల కంటే ముందునుండే నిరీక్షణాగది వద్ద శిష్యులు, భక్తులు, కార్యకర్తలు బారులుతీరి ఒక వరుసలో నుంచుని ఉండే వారు. ప్రతి ఒక్కరి అంతరంగములో తమ ఆరాధ్యుని దర్శనము అవబోతోంది అన్న సంతోషము తొంగిచూసేది. పై తలుపులు తెరచుకోగానే అందరు క్రమబద్ధంగా అడుగులు వేస్తూ ఒక్కొక్కరుగా ముందుకు సాగి మెట్లెక్కి పైనున్న అఖండదీపమును దర్శించుకునేవారు. పిమ్మట వందనీయ మాతాజీ చరణ స్పర్శను పొందే సౌభాగ్యమును అందిపుచ్చుకునేవారు.

అక్కడినుండి ముందుకు కెళ్ళి ఇప్పుడు వంటశాల ఉన్న చోటునుండి నడుస్తూ మళ్ళీ మెట్లెక్కి పై అంతస్తుకు చేరుకునేవారు. అక్కడే తెరచి ఉన్న కిటికి వద్ద కూర్చుని వ్రాతపనిలో నిమగ్నులై ఉన్న గురుదేవులు దర్శనమిచ్చేవారు. సాధకులకు ఈ దర్శనము బ్రహ్మానుభూతితో సమానము. అనుభూతిని సరిగ్గా పొసగునట్లు మాటలలో వర్ణించుట ఎప్పుడు సాధ్యం కాదు. పైగా ఇటువంటి దర్శనానుభూతిని వర్ణించటం మరీ కఠినతరం. అయినప్పటికి భావభరితులైనవారికి ఈ దర్శనము ఎటువంటి విఘ్నాలు, అవరోధాలు లేకుండా రోజంతా నిరంతరము లభ్యమౌతూనే ఉండేది. ఒక కాలుమీద మరో కాలు వేసుకుని దానిమీద రైటింగ్ ప్యాడ్ పెట్టుకుని సోఫాలో ఆసీనులైన గురుదేవులు దర్శన మిచ్చేవారు. ఆయన చేతులలో అందంగా ఇమిడి ఉన్న కలము ద్వారా రైటింగ్‌ప్యాడ్ మీదున్న కాగితాల మీద ఆలోచనల –భావాల అవిరళ ప్రవాహము సాగుతు ఉండేది. వ్రాస్తూనే మధ్యలో అప్పుడప్పుడు వచ్చినవారి మీద దృష్టిని సారించేవారు. ఆ దృష్టి అమృతవర్షిణి. ఎవరిమీద ఆ అమృతవర్షం కురిస్తే వారు ధన్యులైనట్లే. ఆ దృష్టి పడనివారు మరునాడు ఆ అమృత వర్షం తమపై పడాలని మనస్సులోనే గురుదేవులను ప్రార్థించేవారు.



అనేకానేకమంది ఆర్తితో కూడిన పిలుపును గురుదేవులు స్వయంగా వినేవారు, ఆ పిలుపును ఆలకిస్తూనే తమ వ్రాతపనిలో మునిగిపోయేవారు. ఈ పంక్తులను చదువుతున్నవారిలో కొంతమందికి ఇలా అనిపించవచ్చు. చాలామంది రచనను చేస్తూనే ఉంటారు. మరి ఇందులో విశేషమేముంది? ఇది సామాన్యమైనది కాదు. ఈ విశేషతతో నిండిన సత్యము అనుభూతిపూర్వకమైనది, అనుభవైకవేద్యమైనది. ఒక మనిషి–ఋషి జీవితము మధ్య ఉన్న అంతరము లాంటిదే సామాన్యులు చేసే రచనకు–గురుదేవులు చేస్తున్న రచనా సాధనకు మధ్య ఉన్నది. మనిషి రచనలో కేవలము బుద్ధియొక్క ఆలోచనాసరళి అలలవలె తొంగిచూస్తూ ఉంటుంది. కానీ ఋషి చేతన బుద్ధియొక్క తలములను చాలా దూరము అధిగమించి గాఢ సమాధిస్థితిలో ఏదో సత్యమును దర్శిస్తుంది. ఆ సత్యమే అక్షరరూపంలో వారి రచన ద్వారా జాలువారుతుంది.

పరమ పూజ్య గురుదేవులు రచన ఇటువంటిదే. గురుదేవులు వ్రాసినదంతా హైందవ ధర్మానుసారం ఉద్భవించి, కల్పనలనే దారముతో అల్లబడినది. మనో–బుద్ధులు అడుగిడలేని ఉన్నత ఆధ్యాత్మిక స్థితి నుండి ఈ అక్షర ప్రవాహము జాలువారింది. గురుదేవుల సాహిత్యము ఊహలు–కల్పిత ఆలోచనల సమూహం కాదు. అవన్నీ వారి సమాధిచేతన నుండి బహిర్గతమై వచ్చిన సమాధానములు. పూజ్య గురుదేవులు 'రచనా సాధనలో మునిగి ఉన్న సమాధియోగి' అన్నదే సత్యము. ఈ విషయమును గురుదేవులే స్వయంగా అప్పుడప్పుడు చెబుతూ ఉండేవారు. దీనిని గురించి ప్రస్తావిస్తూ ఇలా అన్నారు గురు దేవులు, 'మేము వ్రాస్తున్నదంతా హిమాలయాలనుండి జాలువారు తున్నదే. మేము కేవలము ఆ సత్యములకు అక్షర రూపు నిస్తున్నాము.' దీనికి సంబంధించే గురుదేవులు మరోసారి ఇలా సెలవిచ్చారు, 'మీరు ఏమనుకుంటున్నారు? ఎవరో ఒక సామాన్య సంపాదకుడు మా అఖండజ్యోతి పత్రికను వ్రాయగలడనా? సంత్, ఋషి, తపస్వివలె జీవించేవారే దానిని వ్రాయగలరు.'

గురుదేవుల వాక్కులోని సార్థకతను స్వయంగా ఆయన జీవితమే నిరూపించినది. గురుదేవులు సంత్, ఋషి, తపస్వి కూడా. ఆయన సాధనయే ఆయన రచనగా మారింది. దాన్ని ఈవిధంగాను చెప్పవచ్చును. ఆయన రచనా వ్యాసంగమే ఆయన సాధనగా రూపుదాల్చినది. నిజమేమిటంటే ఈ రెంటి మధ్య తేడాను దర్శించుట అసంభవము. మాటల మధ్యలో గురుదేవులు ఇలా అనేవారు, 'మేము రచనను ఉపాసనగా భావిస్తాము.' మరోసారి గురుదేవులు ఇలా కూడా అన్నారు, 'మా రచనయే నా భజన–

**రహస్యం నీ దగ్గరున్నంతసేపు నీకు బానిస, మరొకరికి చెప్పావంటే ఇక అది నీకు యజమాని.**

కీర్తన, ఇదే మా ఈశ్వరభక్తి, గురుభక్తి.' ఇదే విషయానికి సంబంధించి గురుదేవులు ఎంతో భావోద్వేగంతో ఏమన్నారంటే 'మేము వ్రాస్తున్నది ఏదైనా ఉంటే అది కొంచెమే, కానీ మేము మా గురువర్యుల గురించి గీతాలాపన చేస్తున్నాను.' ఆయన మాటలను వింటుంటే బహుశా వినేవారి మనస్సులు కూడా భావోద్వేగాలకు లోనవుతాయి.

గురుదేవుల రచనలలో అగణితమైన విశేషతలు ఉన్నాయి. వీటిలో చాలా అదృశ్యమైనవి ఉన్నాయి. అయితే కొన్ని కనిపించేవీ ఉన్నాయి. దృశ్యవిశేషతలలో హృదయమును కదిలించేది ఒకటుంది. గురుదేవులు వ్రాత పనిని కొనసాగిస్తూనే దర్శకులను పరామర్శించేవారు. ప్రణామము-దర్శనముల చివరి క్షణాలలో కొంతమంది పరిజనులను కలుసుకుని వారితో మాట్లాడే క్రమం కూడా సాగేది. వారంతా ఆర్తులు. బహుశా వారిలో కొందరు దుఃఖములు-బాధలతో పీడింపబడుతూ వికలమనస్కులైనవారు. వందనీయ మాతాజీ వారిమీద కృపను జూపి గురుదేవులను కలుసుకునేందుకు పంపిస్తూ ఉండేవారు. వీరంతా గురుదేవులను కలుసుకునేందుకు వెళుతు ఉండేవారు. అదే సమయంలో గురుదేవులు రచనాక్రమము నడుస్తూ ఉండేది.

గురుదేవులు రచన చేస్తూనే దగ్గరికి వచ్చి నిల్చున్నవారి ఒక్కొక్కరి పరిస్థితిని అడిగి తెలుసుకునేవారు. అప్పుడు వారంతా గురుదేవులకు పాదాభివందనము చేసేవారు. అయితే గురుదేవుల రచనా కార్యక్రమమునకు ఈ సంఘటనలేవి అవరోధములయ్యేవి కాదు. గురుదేవులు వ్రాస్తూనే ఒక్కసారి తమ కన్నులను పైకెత్తి వీక్షించి వారినిలా ప్రశ్నించేవారు. 'కుమారా! నీ బాధేమిటో చెప్పు' అనేవారు. ఆర్తులలో కొందరు 'నా కుమార్తెకు వివాహము అవ్వటం లేదు' అని చెపితే, మరికొందరు తమ బంధువు లేక తన యొక్క అసాధ్యమైన రోగాన్ని గురించి విన్నవించేవారు, ఇంకొందరు గృహ, కార్యాలయ సంబంధ కష్టాలను మొరపెట్టుకునేవారు. గురుదేవులు వీరిలో ప్రతివొక్కరి మాటను ఆలకిస్తూ వారి బాధ, కష్టమునకు కరిగిపోయేవారు. అప్పుడప్పుడు వారి కన్నులు కూడా చెమరించేవి. కానీ మరుక్షణమే గురుదేవులు వారికి భరోసానిస్తూ 'ఎందుకు పరితపిస్తావు? తల్లిదండ్రులు ఉన్నప్పుడు అసలు సంతానమునకు కష్టములెలా ఉంటాయి? ఉండవు! అందుచేత దుఃఖించకు, మేము వాటిని తీసివేస్తాము. అంతా శుభమగుగాక!' అని చెప్పేవారు. గురుదేవుల నుండి భరోసాను పొంది దుఃఖితులైన జనులు నవ్వుతూ తిరిగి వెళ్ళేవారు. ఇదంతా జరుగుతున్నప్పటికి గురుదేవుల రచనా వ్యాసాంగం నిరంతరంగా కొనసాగుతూనే ఉండేది.

గురుదేవులు ఇలా అనేవారు. 'రచనా సాధనయే మా జీవితము. ఒకవేళ మేము రచనను చేయుట నిలిపివేస్తే, మేము జీవితేచ్ఛను కూడా వదిలివేశామని అర్థము చేసుకోండి. 'రచన చేయుట ఆగిపోతే మా భౌతికశరీరం కూడా రాలిపోతుంది.' గురుదేవుల ఈ మాటలు అక్షరసత్యములని నిరూపించబడ్డాయి. 1990 వసంతపంచమి నుండి గురుదేవులు ఏకాంతవాసం ఆరంభించారు. కానీ ఆయన వ్రాతపని మాత్రం ఆగలేదు. ఆయన సమాధిచేతన నుండి జాలువారే ఆలోచనలు కాగితం మీద అక్షరాలు, పేరాలు, వాక్యాలు మరియు పంక్తులుగా వ్రాయబడుతూనే ఉన్నాయి. కొన్ని మాసాలు గడిచిన పిమ్మట అకస్మాత్తుగా గురుదేవులు బ్రహ్మదీప యజ్ఞములను గురించిన ప్రకటన చేశారు. ఈ ప్రకటన కాలాంతరములో దేహత్యాగమునకు సంకేతంగా నిలిచింది. అయితే ఈ విషయమును గురించి గురుదేవులు ఇంతకు ముందు కూడా ప్రస్తావించారు. అంతేకాదు, 1990 వసంత పంచమి నుండి ఏకాంతవాసమునకు వెళ్ళేముందు ఆయన తన పరిజనులందరినీ ప్రత్యేకంగా పిలిపించుకుని వారిని చివరిసారిగా హరిద్వార్, శాంతికుంజ్ ఆశ్రమంలో కలుసుకున్నారు కూడా.

అయితే బ్రహ్మదీప యజ్ఞమునకు సంబంధించి ఒక ప్రత్యేకమైన గొప్పతనమున్నది. గురుదేవులు యజ్ఞము యొక్క కర పత్రమును తమ స్వహస్తాలతో వ్రాసి సిద్ధం చేశారు. దానితో పాటే తమ రచనావ్యాసంగ సాధనను కూడా నిలిపివేశారు. ఆ విరామం స్థూల జీవనం మరియు ఆయన సాధనకు విరామము నిచ్చుట. దానికితోడు స్థూలశరీరము-స్థూలజగత్తునుండి ఆయన జీవనం తిరోగమించసాగింది. 1990 జూన్ 2న గాయత్రీ జయంతినాడు గురుదేవులు దేహత్యాగం చేశారు. ఆ సమయంలోనే దేశమంతా బ్రహ్మదీపయజ్ఞములు నిర్వహించబడినాయి. గురుదేవుల ఆత్మజ్యోతి ఒకేసారి అనేక ప్రదేశములలో ప్రకాశించినది. 'రచనా సాధనలో మునిగి ఉన్న సమాధి యోగి' ఇప్పుడు సాకారం నుండి నిరాకారంలోకి వెళ్ళిపోయారు. అయినప్పటికి గురుదేవులు తమ పాఠకులకు, పరిజనులకు ఇలా భరోసా ఇచ్చారు. 'మేము ఎంత రచనను చేసి ఉంచామంటే మేము లేకున్నప్పటికి మీ అందరకు చదువుకునేందుకు కావలసినంత సాహిత్యం లభిస్తూనే ఉంటుంది.' పూజ్యగురుదేవులు ఇంకా ఇలా అన్నారు. 'మేము కొంతమంది వ్రాసేవారిని తయారుచేశాము. వారెవరైనాసరే, కానీ వారిలోని ఆలోచనా ప్రవాహము మాత్రము మాదే'. అదే జరుగుతున్నది కూడా! తమ జీవితాంతము రచనా సాధనలో లీనమయిన ఆ సమాధియోగి యొక్క చేతన ఇప్పుడు కూడా నిరంతరము అఖండజ్యోతి పుస్తకంలో ప్రతినెలా ముద్రించబడుతూనే ఉన్నది. అంతేకాదు ఇకముందుకూడా శాశ్వతంగా అలా సాగుతూనే ఉంటుంది. గురుదేవుల సమాధిచేతన నుండి అంకురించిన అక్షరాలు గాయత్రీ పరివారమునకే కాక మనిషి మనిషికి సమాధానమిస్తూనే ఉంటాయి.

*- అఖండజ్యోతి, ఫిబ్రవరి 2002,*
*అనువాదం: శ్రీమతి లక్ష్మీరాజగోపాలు*

**దురలవాట్లు మొదట్లో సాలెగూళ్లు, ఆపై ఇనుప గొలుసులు.**

# మనల్ని పరిపూర్ణులను చేసేందుకు అవతరించిన దివ్యసందేశమే భగవద్గీత

మార్గశిర శుక్లపక్ష ఏకాదశి రోజున గీత అవతరించింది. ఈ పుణ్యతిథి ఈసారి డిసెంబరు 6 మంగళవారం రోజున వచ్చింది. గీత కాలాన్ని జయించిన ఒక శాశ్వత ఆలోచనా ప్రవాహము. ఇది భగవానుని పవిత్ర వాక్కునుండి ఆవిర్భవించింది. 5000 సంవత్సరాల క్రితం ఉద్భవించిన ఈ జ్ఞాన ప్రవాహము మానవజీవిత వికాసమునకు ఒక కొత్త ఒరవడిని ప్రసాదించింది. మానవుడు కర్మయోగమును నైపుణ్యముతో చేసే పనిగా నేర్చుకున్నాడు. గీతలో చెప్పబడిన నిష్కామకర్మ మనకు జీవించడమనే సర్వోత్కృష్టమైన కళను నేర్పిస్తుంది. యోగత్రయము యొక్క పాఠ్యపుస్తకమే గీత. జ్ఞాన, భక్తి, కర్మల విలక్షణ సమన్వయము ఇంత చక్కగా మనకు వేరొకచోట కనిపించదు. వేదములు, బ్రాహ్మణములు, ఆరణ్యకములు, ఉపనిషత్తుల సారాంశమే గీత. ఈ గ్రంథములో 700 శ్లోకములు ఉన్నాయి. విభిన్న ఆర్షగ్రంథముల యందు వర్ణించిన ఆధ్యాత్మిక సత్యము లన్నింటినీ ఎంపికచేసి తయారుచేయబడ్డ పూలగుత్తివంటిది ఈ గీతామాత. అనంతకాలము పాటు విశ్వములో నివసించేవారి హృదయములను వెలిగించి వారి అంతరంగములో వెలుగులు నింపే దీపమే ఈ గీత.



గాంధీజీ గీతను తన తల్లిగా భావిస్తారు. వినోబాభావే గీతను "గీతాయి" అనే వారు (గీతాయి అంటే గీత నా తల్లి). గీత బిడ్డలకు పాలన-పోషణ చూసుకుంటూ వారిని స్నేహ పూర్వకంగా ఆదరించే తల్లివంటిది మాత్రమే కాక సద్గురువు కూడా. ఈ మహా పురుషులిరువురు ఈ గ్రంథ మాహాత్మ్యాన్ని ప్రజలందరి మనస్సు లోను స్థాపించారు. గీత అన్ని ధర్మగ్రంథాల లోకి మకుటాయమానమైనది, తేజోవంతమైనది అని లోకమాన్య తిలక్ చెప్పేవారు. ఆయన జైల్లో 'గీతా రహస్యము' అనే గొప్ప గ్రంథాన్ని రచించారు. అనంతకాలము నుండి గీత ఎంతోమందికి ప్రేరణ నిచ్చింది, ఇస్తూనే ఉంటుంది. సృష్టి, స్థితి, లయములకు సంబంధించి గీత చెప్పని రహస్యము ఏదీ లేదు. ప్రతి అధ్యాయము చివరలో భగవానుడు తనను తాను స్వయముగా పరిచయము చేసుకున్నాడు

**'ఓం తత్సత్ ఇతి శ్రీమద్ భగవద్గీతాః ఉపనిషత్సు బ్రహ్మ విద్యాయాం యోగశాస్త్రే శ్రీకృష్ణార్జున సంవాదే'** అని అధ్యాయం చివరన చెప్తాము. పరమేశ్వరుని తత్ సత్ రూపంలో స్మరించడమే ఓంకారము. ఇదే అసలైన స్వరూపము. ఇదే అన్ని ధర్మములలోకి శాశ్వతమైనది. ఈ భగవద్జ్ఞానమే - ఉప మరియు నిషద. ఇటువంటి దివ్యజ్ఞానము కేవలము ఆర్ష వాఙ్మయములోనే ఉన్నది. ఇదే బ్రహ్మవిద్య మరియు యోగ శాస్త్రము. అన్ని విద్యలకు శీర్షము వంటిదే బ్రహ్మవిద్య- ఆత్మజ్ఞానము. ఇదే జీవనవిధానము ద్వారా మనకు జీవించే కళను నేర్పిస్తుంది. యోగము ద్వారా ఆ పరబ్రహ్మ చేతనతో మన చేతనను ఏకత్వము చేసే విద్యకు సంబంధించిన జ్ఞానమును గీత అందిస్తుంది. శ్రీకృష్ణుడు మరియు అర్జునుడి మధ్య జరిగే సంవాదము ద్వారా ఈ దివ్యజ్ఞానము ప్రకటింప బడింది. దీనిని మనకు తెలియచేసే విధానములోనే లోతు, వ్యాపకత రెండూ ఇమిడి ఉన్నాయి. అందుచేతనే గీత ఉపనిషత్తులకు కూడా శిరోధార్యమైనది అని చెప్పారు. ఈ ఉపనిషత్తులో ఆచార్యునిగా - ఉపదేశకుడైన శ్రీకృష్ణుని రూపంలో ఉన్నది స్వయంగా భగవానుడే, శిష్యుడు గాండీవమును ధరించే యోధుడైన అర్జునుడు. ఆచార్యుడైన శ్రీకృష్ణుని జ్ఞానము ఆది, అంతం లేనది, అనంతమైనది. అర్జునుడు జిజ్ఞాసువు, గురువు పట్ల సందేహమనేది లేని నిష్ఠావంతుడు, సంపూర్ణంగా ఆయనకు సమర్పణ చేసుకున్నవాడు. ఈ ప్రపంచము ఒక కావ్యము వంటిది, ఒక సుందరమైన గానం వంటిదని చెప్పే ఈ గ్రంథము యుద్ధ భూమిలో ఆవిష్కరించబడింది అనేది ఇక్కడ గమనించాలి. మిగిలిన గ్రంథాలు ఏవైనా సరే అరణ్యాకాలలోనో, అడవుల్లోనో, ఋషుల ఆశ్రమాల్లోనో వినిపించబడేవి. ఈ దృష్టితో చూస్తే ఇది చాలా విలక్షణమైనది.

ఎప్పుడు సద్గురువుకు శ్రేష్ఠుడైన, జిజ్ఞాసాపరుడైన శిష్యుడు లభిస్తాడో అప్పుడు బ్రహ్మవిద్య ప్రకటితమౌతుంది. దీని పరిణామమే గీత. సృష్టి మరియు జీవితము యొక్క రహస్యాలన్నీ ఇందులో ఇమిడి ఉన్నాయి. ఇందులో యోగమునకు సంబంధించిన రకరకాల ప్రక్రియలు ప్రకటింపబడ్డాయి. గీతలో ఎక్కడా షట్చక్రాల గురించి కానీ, కుండలినీ-తంత్రము గురించి కానీ ప్రస్తావింపబడలేదు కానీ ఇందులో యోగశాస్త్రముల యొక్క మార్మిక గూఢ రహస్యాలు ఇమిడి ఉన్నాయి. దీనిని చాలా లోతుగా

**ఎదుటి వ్యక్తిని నోరెత్తకుండా చేసినంత మాత్రాన అతడిని నీ దారికి తెచ్చుకున్నట్లు కాదు.**

తరచి చదివితేనే ఇవన్నీ అర్థము చేసుకోగలుగుతారు. ఉపనిషత్తుల ద్వారా చెప్పబడ్డ ఈ బ్రహ్మవిద్య-యోగశాస్త్రములను నేర్చుకోవాలంటే సాధకుడు శ్రీకృష్ణుని రూపంలో సద్గురువును ప్రతిష్ఠించుకొని, తాను స్వయంగా అర్జునునిగా మారి సంవాదము అనే పరిస్థితి కల్పించగలిగితే అర్థమౌతాయి. అప్పుడు గీత మనకు తన స్వరంతో అన్ని సమస్యలకు పరిష్కారాన్ని సూచించడమేకాక పరిష్కరించి మనకు జీవనవిద్యయందలి ఒక్కో రహస్యాన్ని అర్థమయ్యేలా వివరిస్తుంది. గీతాజయంతి పర్వదినము సందర్భముగా మనము ఈ దివ్యజ్ఞానమును గుర్తు చేసుకుందాము.

గీతామాహాత్మ్య ప్రకరణములో ఇలా చెప్పబడివుంది.

**గీతా సుగీతా కర్తవ్యా కిమన్యై శాస్త్ర విస్తరైః ।**
**యా స్వయం పద్మనాభస్య ముఖ పద్మాత్ వినిఃసృతా॥**

అనగా సాక్షాత్తూ కమలనాభుడైన శ్రీకృష్ణ భగవానుని ముఖారవిందము నుండి ప్రకటమైన ఈ గీత సుగీత. ఈ గీతను చక్కగా అర్థసహితముగా స్వాధ్యాయము చేసుకుంటూ గానము చేయాలి. గీత మనకు ఉండగా మిగిలిన శాస్త్రములను వివరంగా తెలుసుకున్నా ఏమి ప్రయోజనం?

**సర్వోపనిషదో గావోదోగ్ధా గోపాలనందనః ।**
**పార్థో వత్సః సుధీర్భోక్తా దుగ్ధం గీతామృతమ్ మహత్॥**

సంపూర్ణ ఉపనిషత్తులన్నీ గోవుకు సమానము. గోపాల నందనుడైన శ్రీకృష్ణుడు పాలిచ్చే గోవు, ఆయన వద్ద గీతామృతమనే పాలను త్రాగే అర్జునుడు గోవత్సము. శుద్ధబుద్ధి కలిగిన శ్రేష్ఠ మానవులే దీని భోక్తలు కాగలరు.

నిజానికి ఈ శాస్త్రము చాలా మహిమ కలది. శ్రీరామకృష్ణ పరమహంస ఇలా చెప్పారు- 'మిగిలిన గ్రంథాలన్నీ అబద్ధాలు కావచ్చు. ఎందుకంటే అవి మానవుల ద్వారా రచించబడినవి. కానీ వేదములు, ఉపనిషత్తులు, గీత భగవానుని వాక్కు. ఆయన ఎన్నడు అసత్యాలు చెప్పడు.'

మహాభారతంలో యుద్ధము జరగడానికి సిద్ధంగా వుంది. ద్వేషము, ఈర్ష్య, కౄరత్వము చరమదశకు చేరుకున్నాయి. ఆ స్థితిలో గీతాజ్ఞానము అక్కడ అవతరించింది. అది కౌరవ-పాండవుల మధ్య జరుగుతున్న యుద్ధము కాదు, ధర్మము-అధర్మములకు మధ్య జరుగుతున్న యుద్ధము. అధర్మము అనగా అపసంస్కృతి, ఆసక్తి, తృష్ణ, అహంకారము, రాక్షసగుణములు. ధర్మము అనగా అనాసక్తి, ఈశ్వరుని పట్ల చరమదశకు చేరిన భక్తి, భాగవత పరాయణులై ఇతరుల కొరకు జీవించగలిగే మానసికస్థితి. గీత జీవితవిధానమును ఎలా మార్చుకోవాలో చెప్తుంది తప్ప రకరకాల కర్మకాండల గురించి చెప్పదు. ఇది విషాదము నుండి ఉద్భవించినది. ఆత్మశక్తిపై విశ్వాసము ఉంచుకోమని చెప్తుంది. నీ మనస్సే నీకు మిత్రుడు, కానీ ఒక్కోసారి అదే నీకు శత్రువుగా కూడా మారుతుంది. మనస్సును మిత్రునిగా మార్చుకొని ఆత్మబలసంపన్నుడివి కావాలి అని చెప్తుంది. గీత కర్మకాండని దాటిన కర్మయోగము వైపు తీసుకువెళ్తుంది. ఎంత బాగా చేయాలంంటే చివరకు అది యోగరూపము దాల్చి అత్యంత శ్రేష్ఠమైనదిగా మారాలి. (యోగః కర్మసు కౌశలం) మనగురించి మనకు, చుట్టూ ఉన్న పరిస్థితులను గురించి, ఇతరులతో మనకున్న సంబంధాల గురించి, పరమాత్మను గురించిన జ్ఞానాన్ని మనకు గీత అందిస్తుంది. జీవితములో భక్తిని నింపుకొని ప్రభు సమర్పిత జీవితమును ఎలా గడపాలో మనకు గీత నేర్పిస్తుంది. గీత ఈశ్వరుని గణిత నియమాలపై సంపూర్ణంగా ఆధారపడి నడిచే ఆదర్శముల సముచ్చయము. ఈశ్వరుని రూపమును మనము ఏ పరిభాషలో చెప్పాలని ప్రయత్నిస్తుంటామో ఆ రూపము గీతది.

ఇంతటి అద్భుతమును ఇచ్చినందుకు వేదవ్యాసుల వారికి శ్రీకృష్ణునికి మానవజాతి అనవరతము కృతజ్ఞత చూపించాలి. ఆయన మనకు జీవించేందుకు అద్భుతమైన పొదరిల్లును ఇచ్చాడు. ఇంతటి మహాగ్రంథమును గురించి మనకు గుర్తుచేయడానికే గీతాజయంతి వచ్చింది. గీతయందలి ఏ ఒక్క సూత్రమునైనా జీవితములో పాటిస్తామనే సంకల్పమును తీసుకోగలిగితే జీవితమే మారిపోతుంది. ఎల్లప్పుడు ఎన్నో రకాల సాధనలు చేయాలనే సంకల్పాలు తీసుకుంటుంటాము. కానీ మనోబలము, నిరంతరనిష్ఠ లేకపోవడం వల్ల అవి జావగారి పోతుంటాయి. గీతను నియమంగా స్వాధ్యాయము చేస్తాననే చిన్న సంకల్పము తీసుకుంటే అది మనస్సులోనే తళుక్కుమని, హృదయ స్పందనగా మారిపోతుంది. రండి జన్మశతాబ్ది సంవత్సరమును గీతాపర్వముగా జరుపుకుందాము.

*- అఖండజ్యోతి, డిశంబర్ 2011*
*అనువాదము: శ్రీమతి వల్లీశ్రీనివాస్*

## నిరాశయే మృత్యువు

*నావికుడు దీవిని ఉద్దేశించి "సోదరీ! నలుదిక్కులా అగాధమే చూస్తుంటే నీకు నిరాశగా అనిపించదా" అని ప్రశ్నించాడు. దీవి మంద్ర స్వరంతో "ఓ పూజ్యుడా! నేను నిరాశకు లోనైతే దూరం నుండి వచ్చే అతిథులకు విశ్రాంతిని ప్రసాదించటం, వారికి స్వాగతం పలకడం వంటి ఉత్కృష్ట కర్మాచరణ నుండి వంచించబడుతాను. కాబట్టి నేను నిరాశను దరిచేరనీయను. నా లక్ష్యం ఏమిటో నాకు తెలుసు. అది తెలియనివారే నిరాశకు లోనవుతూ ఉంటారు." అని పలికింది.* *- ప్రజ్ఞాపురాణం నుండి*

**దేశాన్ని చూసి గర్వించటం కాదు. దేశానికి గర్వకారణంగా నిలవాలి.**



పూజ్య గురుదేవుల అమృతవాణి

# సంస్కృతి అనే సీతను తిరిగి తీసుకురావటానికి ఇదే సరైన సమయం-3

*(గత సంచిక తరువాయి...)*

## కాంగో సంత్

నేనొకసారి కాంగో వెళ్ళాను. అక్కడి మనుష్యులు మర గుజ్జులు. ఎక్కువమంది దిగంబరంగానే ఉంటారు. స్త్రీలు ఆకులతో శరీరమును కప్పుకుంటారు. మరి మరగుజ్జులైన వారు వ్యవసాయం ఎలా చేస్తారు? చిన్న చిన్న లాటీలు, బల్లాలు పట్టుకుని తిరుగుతూ, కప్పల్ని, ఎలుకలనీ, పక్షులని చంపి కాల్చుకుని తింటూ ఉంటారు. పైగా వారు సంచారజీవులు. వారి దగ్గర డబ్బులుండవు. వారితోపాటు ఒక ఫాదరీ అక్కడ ఒక డేరా వేసుకుని 40 సంవత్సరాల నుండి వారితో కలిసి జీవిస్తున్నాడు. వారు ఫాదరీని ఇక్కడికి ఎందుకు వచ్చావు అని అడిగినప్పుడు మీరు అమాయకులు, వెనుకబాటు తనంతో జీవిస్తున్నారు, కనుక మీకు సేవ చేయటానికి వచ్చానని చెప్పాడు. అప్పుడు వారు ఆయనను తమతో ఉండమని అన్నారు. ఆ ప్రాంతంలో చలనచిత్రములు లేవు, తపాలాశాఖ లేదు, రహదారులు లేవు, వినోదము లేదు, రవాణాసౌకర్యం లేదు. ఆ అడవిలో ఇవేమీ ఉండవు. ఒక పడవ అప్పుడప్పుడు అక్కడికి వచ్చి కొంత మంచినీటిని, కొన్ని సామానులను వారికి అందజేసి వెళ్ళిపోతుంది. వచ్చిన అతి కొద్ది సామానులతోనే సర్దుకుపోతూ ఆ ఫాదరీ ఆ అడవిలోనే 40 సంవత్సరముల జీవితాన్ని గడిపాడు.

## సాధు పరివ్రాజకుడు

ఆయన ఎవరు? అన్న ప్రశ్న వచ్చినప్పుడు ఆయన ఒక సాధువు, ఒక ఫాదరీ, ఒక పరివ్రాజకుడు అని చెప్పవచ్చును. నా అంతరంగంలో కూడా ఒక ఆలోచన రూపుదాల్చింది. ఆయన పాద ప్రక్షాళన చేసి ఆ నీటిని తీసుకువచ్చి ఇక్కడున్న స్వాములవార్ల తలమీద చల్లాలని. మన దేశంలో 70 లక్షలమంది అడుక్కునే స్వాములవార్లు ఉన్నారు. ఊరికి పదిమంది స్వాములవార్ల చొప్పున 7 లక్షల గ్రామాలలో 70 లక్షలమంది స్వాములవార్లున్నారు. వీరందరు సమిష్టిగా కృషి చేస్తే ఆయా గ్రామాలలో నిరక్షరత సమస్య ఉండదు. సామాజిక అవకతవకలు ఉండవు. చెడు ఆచరణ ఉండదు. వెనుకబాటుతనం అసలే ఉండదు. ఒక గ్రామానికి పదిమంది స్వాములవార్ల చొప్పున అక్కడ జీవిస్తూ ఇటువంటి అనేకానేక సమస్యలను పరిష్కరించవచ్చు. కానీ జరుగుతున్నదేమిటి? మోసం, టక్కరితనం, ఆషాఢభూతులు స్వాములుగా చెలామణి అవుతూ దేవతల పేరుమీద ఆశ్రమాలు స్థాపించి ధర్మము పేరిట ఇష్టమొచ్చినట్లు ప్రవర్తిస్తున్నారు.

నిజానికి మనం చెయ్యవల్సినది ఏమిటి? మన ప్రాచీన పరంపరను అనుసరించి ఇంటింటికి వెళ్ళాలి. జన జాగృతి కలిగే విధంగా శంఖారావం చెయ్యాలి. కాయకల్పం చేయాలి. ఇది మనందరి సుదీర్ఘమైన కార్యప్రణాళిక. దీనికోసం మీరు ఏమి చెయ్యాలి? వెలిగే దీపం మరో దీపమును వెలిగించినట్లుగా; వ్యక్తిత్వంకల వ్యక్తే మరో వ్యక్తి వ్యక్తిత్వమును సంస్కరించగలదు. మీకు మాట్లాడాలనే అభిలాష ఉంటే మాట్లాడటం నేర్పుతాను. ఏవిధంగా నేర్పుతాను? ఒకరోజున ఒక ఇంట్లో దొంగపడ్డాడు. ఇంట్లో వారందరూ దొంగ దొంగ అని కేకలు పెట్టారు. ఊరి జనం పరిగెట్టుకు రావటం మొదలెట్టారు. ఇది చూసిన దొంగ వెంటనే తెలివిగా తనూ వారిలో కలిసిపోయి దొంగను పట్టుకోండి అని అరవటం మొదలెట్టాడు.

## ప్రవర్తనతోనే లోకశిక్షణ

దీని అర్థమేమిటి? ఇంటి యజమాని దొంగను పట్టుకోమని కేకలు వేస్తాడు. మీరూ దొంగను పట్టుకోమని కేకలు వేశారు. ఇంతకీ దొంగ ఎవరు? తెలియదు. కనుక ఇలా కాకుండా అవినీతిని, పాపాన్ని తరిమికొట్టాలి. ఎవరు తరిమికొట్టాలి? వ్యక్తిత్వమును సంస్కరించుకున్నవారు. ఆ అర్హత వారికే ఉంటుంది. లోకశిక్షణ ఏవిధంగా జరుగుతుంది? మీకు మాట్లాడే శక్తి ఉన్నా, లేకపోయిన ఇబ్బందేమీ లేదు. పాండిచ్చేరిలో శ్రీఅరవిందులు, అలాగే మహర్షి రమణులు కూడా మౌనమును ఆశ్రయించి తద్వారానే వాతావరణములో మార్పులు తీసుకొచ్చారు. అలా చేయవచ్చా? చేయవచ్చును. మీకు మాట్లాడటం వచ్చు. దానికితోడు మీ వ్యక్తిత్వమును ఉన్నతంగా తీర్చిదిద్దుకోండి. వ్యక్తిత్వమే ఎదుటివారిలో కోరుకున్న పరిణామమును తీసికొస్తుంది. ఒక త్రాగుబోతు ఒక జీవితంలో అనేకమందిని త్రాగుబోతులుగా తయారుచేస్తాడు. ఎందుకంటే ఆ వ్యక్తి మాటలు, ప్రవర్తన ఎదుటివారిని బాగా ప్రభావితం చేసేవిగా ఉంటాయి. కానీ మీరు మీ జీవితంలో ఒక్క సంత్‌ను కూడా తయారుచెయ్యలేకపోయారు. ఒక్క మంచి మనిషిని, ఒక రామభక్తుడిని సమాజమునకు

**చెప్పుల్లేని కాళ్ళతో నడిచేవారు దారిలో ముళ్లచెట్లు నాటకూడదు.**

అందించలేకపోయారు. ఇలా ఎందుకు జరుగుతున్నది? మీ మాటలకు, చేతలకు పొంతన ఉండదు కనుక. మరి అలాంటప్పుడు ఇతరుల మీద మీ ప్రభావం ఎలా పడుతుంది?

## అంకుశం పేరే తపస్సు

భావి కాలంలో ఏమి ఆచరించాలి? రాబోయే కాలంలో పరివ్రాజక ప్రణాళిక శుభారంభం జరుగబోతోంది. దాన్ని మీరే శుభారంభం చేస్తున్నారు. కనుక మీరు అదృష్టవంతులు. ఈ ప్రణాళిక ముందంజ వేస్తే ఏమి జరుగుతుంది? ఈ ప్రణాళిక ఆచరణలోకి వచ్చినప్పుడు అనేకమంది తాపసులు తయారవ గలరని నేను ఘంటాపదంగా చెప్పగలను. తపస్వి అంటే ఎవరు? తపస్సంటే ఏమిటి? తృష్ణలమీద, కోరికల మీద అంకుశము ఉంచుట. అదే పరివ్రాజక ప్రణాళికలో మీరు చెయ్యబోయే తపస్సు. మానవుడు తనలోని బలహీనతలను నశింపజేసుకుని స్వచ్ఛంగా మారాలి. మనస్సు చేస్తానంటుంది. శరీరం ఒప్పుకోదు. శరీరం ఒప్పుకుంటే మనస్సు సహకరించదు. ఈ ద్వంద్వయుద్ధం చేయటాన్నే తపస్సు అంటారు. మీ వ్యక్తిత్వమును ఉన్నతమైనదిగా తీర్చిదిద్దుకోవటానికి, మీలో ఉన్న దురలవాట్లను తరిమికొట్టటానికి తపస్సనే అంకుశమును ప్రయోగించాలి.

మరయితే ఈ తపస్సుతో భగవంతుడు కృప చూపిస్తాడా? ప్రసన్నుడౌతాడా? అసలు మీరు తపిస్తే భగవంతునికి ఒరిగే దేమిటి? తపస్సుతో మన చెడు అలవాట్లు సమసిపోతాయి. చెడు అలవాట్లను ఎంతగా నశింపజేసుకుంటే భగవంతుడు అంతగా మనకు దగ్గరౌతాడు. ఏ భావి తపస్వి ప్రణాళికను మేము కార్య రూపంలోకి తేవాలనుకుంటున్నామో అది అత్యంత మహత్వ పూర్ణమైన ప్రణాళిక. నా అభిమతం ఏమిటంటే మన కుటుంబాల నుండి వేలాదిగా పరివ్రాజకులు వెలువడాలి. అయితే వారికున్న విశేషత ఏమిటి? అన్న ప్రశ్న వచ్చినప్పుడు 'తపస్వి జీవితం' అనేది వారికున్న మహత్వపూర్ణ అంశం. మీరు మీ అంత రంగమును కుదిపివేయాలి. అదెలా సాధ్యపడుతుంది? మీరు ఈ ప్రణాళిక అమలుపరిస్తే మేము మీ అంతరంగంలోకి ప్రవేశించి అక్కడ కలకలం సృష్టిస్తాము.

నేను ఇప్పటివరకు సత్ప్రవర్తన గూర్చి వివరించాను. శిష్టాచారము, పంచశీలముల గురించీ విశ్లేషించాను. అది కేవలము ఒక మర్యాద మాత్రమే. మీరు మా దగ్గరకు వస్తే మేము మీకు జ్ఞానమును అందిస్తాము. ఆ జ్ఞానముతో మీరు ఇతరులకు సలహాలను ఇవ్వగలుగుతారు. ఇంతకుముందు మీకున్న జ్ఞానముతో మీరు ఇతరులకు సలహాలను ఇచ్చే స్థితిలో లేరు. ఆ శక్తి మీకు లేదు. కానీ మీరు మీ జ్ఞానంతో వ్యాఖ్యానం మాత్రమే చెయ్యగలరు. ఆ స్థితిలో మీరు ఇతరులకిచ్చిన సలహాలు తప్పుడు సలహాలుగా పరిణమిస్తాయి. మీరు మీ అంతరంగ స్థాయిని బట్టి సలహా ఇస్తారు. కనుక అది మీ వ్యక్తిత్వస్థాయిలోనే ఉంటుంది. కదా! అంతేతప్ప మీరు గొప్పగొప్ప సలహాలను ఇవ్వలేరు. ఈనాడు మనకు ఒక చక్కని సలహా ఇచ్చే మనుష్యులు కావాలి. అంతేకానీ వేదికలెక్కి వ్యాఖ్యానించే వక్తలు అవసరం లేదు.

## బుద్ధికి పదునుపెట్టాలి

అందువల్ల ఏమి చెయ్యాలి? చక్కని సలహాలను ఇవ్వగలిగే రీతిలో మీ బుద్ధికి పదునుపెట్టి ఎలా వికసింపజేసుకోవాలి? ఎటువంటి పరిస్థితులలో ఏ సలహాలను ఇవ్వాలి? ఏవిధంగా ఇవ్వాలి? ఈ సమస్త శిక్షణను బ్రహ్మవిద్య అంటారు. భావికాలంలో మీకు బ్రహ్మవిద్యను కూడా బోధిస్తాము. బ్రహ్మవిద్యను నేర్పుతు, తాపసిక జీవనయానమును అమలుచేయిస్తూ వాటితోపాటు సమాజంలోని పనులను చేయటానికి కూడా మిమ్మల్ని పంపిస్తాము. శిక్షణ లేకుండా పంపితే అనేక అవాంతరాలు ఎదురౌతాయి. అంతేకాదు మీవద్ద ఉన్నది కూడా చేజార్చు కుంటారు.

## ప్రతిమనిషి పరివ్రాజకుడే !

అందుచేత పుత్రులారా! మనం ఒక కొంగ్రొత్త ప్రయోగమును ప్రారంభిస్తున్నాము. ఎందుకంటే ఈ కాలం బహు వేగవంతమైనది. యుద్ధసమయంలో సైన్యంలో అవసరమైనప్పుడు 18 సంవత్సరముల వయస్సు దాటినవారిని కూడా సైన్యములో చేర్చుకుంటారు. పక్షం రోజులలోనే తుపాకీతో గురిచూసి కాల్చటం నేర్పి, శత్రువులను ఎదుర్కొనమని యుద్ధరంగానికి పంపుతారు. ఇప్పుడు మనం కూడా అదే చేయాలి. మీకు శిక్షణాకాలం పూర్తికాలేదు. మిమ్ములను తపింపజేయలేదు. మీరు శక్తివంతులు కాలేదు. కాబట్టి మీకు అప్పగించబడే బాధ్యతలు కూడా ఆ స్థాయికి చెందినవే ఉంటాయితప్ప కష్టమైన పనులు అప్పగించబడవు. అప్పగించినా మీరు వాటిని నిభాయించలేరు. కఠినమైన కార్యాచరణ కావించుటకు కుమారజీవునివంటి వారిని పంపాలి. మేము అలాంటి పరివ్రాజకులను సమాజంలోకి పంపిస్తాము. అందుచేత భావికాలంలో మన కార్యకర్తలందరు పరివ్రాజకులు కావాలి. సైన్యంలో చేరిన ప్రతిఒక్కరు సైనికుడే అయినట్లుగా ఈనాటి నుండి మీరందరు పరివ్రాజకులే!

ఈనాడు మీరు చేయవల్సినది చిన్నపాటి పనులే. 15 రోజుల శిక్షణానంతరము అప్పుడు మీరు కొద్దిపాటి పనులను అమలు

**కష్టాలను జయించడానికి చిరునవ్వు బలమైన ఆయుధం.**

చేయగలుగుతారు. కేవలం 15 రోజుల కార్యప్రణాళికను మాత్రమే మీరు అమలు చేయవలసి ఉంటుంది. అంతకు మించి చేయటానికి మీవద్ద తగిన శక్తిసామర్థ్యములు లేవు.

## ప్రజా సేవకులెలా కాగలరు?

గురుదేవా! ఏ పని చేయటానికి మమ్మల్ని పంపుతున్నారు? వర్తమాన కాలంలో మీరొక మహత్వపూర్ణమైన పనిని చేయవలసి ఉంది. అదేమిటంటే మనం ఒక పురశ్చరణను ఆరంభించినాము. అది దేనికోసం? వాతావరణమును పరిశుభ్రం చేయటానికి, దాన్ని పరిష్కృతం చేయటానికి. వాతావరణము అనుకూలంగా లేకపోతే మన సంకల్పం నెరవేరదు. మన ప్రయత్నం ఫలించదు. వర్షాలు కురిసేటప్పుడు చల్లదనం లేకపోతే పొలంలో జల్లిన విత్తనాలు అంకురించవు. వర్షాకాలంలోనే భూమిని దున్ని విత్తులు నాటాలి తప్ప ఎండాకాలంలో ఆ పని చేయకూడదు. చేసినా ఆ పని ఫలించదు. అంటే సకాలంలో చేసిన పని సత్ఫలితాలనిస్తుంది. గాలి వాలుగా వీస్తుంటే నావ ముందుకుసాగుతుంది. ఎదురుగాలికి సైకిల్ త్రొక్కితే కాళ్లు నొప్పి పుడతాయి. సైకిల్ వేగంగా ముందుకు కదలదు. సమయం హరించుకుపోతుంది. అదే గాలి వాలుగా ఉంటే వేగంగా గమ్యస్థానం చేరుతాము. కనుక ఇక్కడ నేను చెప్పదలచుకున్నది ఒక్కటే. వాతావరణమును అనుకూలంగా మార్చుకోవటానికి మనందరం కలసి ప్రయత్నిద్దాము. కృషి చేద్దాము. అయితే మానవీయ పురుషార్థమునకు, ప్రయత్నమునకు ప్రకృతిలో కొన్ని అవధులున్నాయి. కొన్ని కట్టుబాట్లు ఉన్నాయి. అందుచేత లక్ష్యమునకు తగిన వాతావరణము ఉండాలి.

వాతావరణమును మనకు అనుకూలంగా ఎలా మార్చుకోవాలి అన్నది వివరిస్తాను. ప్రస్తుతం మనం చేసే ఆ ప్రయత్నం ఎటువంటిది? శ్రీఅరవిందులు ఇంగ్లాండునందు చదువు ముగించుకొని వచ్చి ఆ తరువాత భారతావనికి స్వాతంత్రం కావాలని పోరు సాగించారు. మొదటగా ఆయన బరోడా సంస్థానంలో దివానుగా పనిచేసి అక్కడి రాజులతో పరిచయమును పెంచుకున్నారు. వారందరిని సంఘటితపరచి భారతభూమికి స్వేచ్ఛను ప్రసాదించటానికి తీవ్రంగా ప్రయత్నించారు. కానీ ఆ ప్రయత్నం బెడిసికొట్టింది. తదుపరి కలకత్తాకు చేరుకుని అక్కడ నేషనల్ కళాశాలను స్థాపించారు. నవయువకులకు శిక్షణ ఇయ్యటమే దాని లక్ష్యము. శిక్షణ తీసుకున్నవారిని కార్యకర్తలుగా మలచారు. అయితే యువకులు ఏమి చేశారు. ఇష్టమైనంత మేర చదువుకుని తర్వాత ఉద్యోగాల వేటలో పడ్డారు. కొందరు వివాహాలు చేసుకుని స్థిరపడ్డారు. మొత్తం మీద ఒక్క విద్యార్థి మిగలలేదు.

## శ్రీఅరవిందుల తపస్సుతో ఒక తుపాను ఉద్భవించినది

ఎంతో ధనం వెచ్చించి చేసిన కష్టమంతా బూడిదలో పోసిన పన్నీరైందని అరవిందులు నిరాశచెందారు. పిమ్మట ఆయన విప్లవకారుల పార్టీని స్థాపించి దానిద్వారా బాంబుల నిర్మాణం చేశారు. ఈ క్రమంలో ఆయన అన్నగారు ఉరితీయబడితే, అదృష్టవశాత్తు అరవిందులను ఒక పేరుమోసిన వకీలు ఉరిశిక్ష పడకుండా కాపాడారు. తరువాత అరవిందులు పాండిచ్చేరి చేరి వాతావరణమును అనుకూలంగా మార్చుకోవటానికి తపస్సు ఆరంభించారు. తన తపస్సుతో అరవిందులు భారతదేశమును ఎంతగా వేడెక్కించారంటే వందలకొద్దీ పెద్ద పెద్ద చక్రవాకాలు పుట్టుకొచ్చాయి. హిందూదేశ చరిత్రను ఒక్కసారి చదివితే చాలు గాంధీగారితోపాటు ఎంతమంది మహానుభావులు ఈ పుణ్యభూమిని తరింపజేశారో తెలుస్తుంది.

## వాతావరణము అప్పుడు తయారైనది

ప్రపంచములో ఈనాడు నాయకులెంతోమంది ఉన్నారు కానీ మహాపురుషులు లేరు. కానీ ఆరోజులలో నాయకులు లేరు. మహా పురుషులు ఉన్నారు. మాలవ్యాగారు, గాంధీగారు, తిలక్‌గారు ఇలాంటి ఎంతోమంది మహాపురుషులు ఈ భూమిమీద శ్వాస తీసుకున్నారు. వారంతా ఈ భూమికి కాయకల్పం చేశారు. బ్రిటిష్ వారితో పోరాడేటట్లుగా జనమానసములను తీర్చిదిద్ది అనేకమంది నాయకులను తయారుచేశారు. దీనికోసం వారు తపస్సు చేసి ఆ తపస్సుతో వాతావరణమును వేడెక్కించారు. దేశంలో వాతావరణము వేడిగా ఉన్నంతవరకు మహాపురుషులు పుడుతూనే ఉన్నారు. పుట్టి అనేక గొప్ప గొప్ప పనులను సాధించి చూపించారు. ఈనాడు పరిస్థితులు బాగానే ఉన్నాయి కానీ ఆ రోజులలో పరిస్థితులు అస్తవ్యస్తంగా ఉన్నాయి. అన్నీ ఆటంకాలే. ఆనాడు త్యాగబలిదానములను చేసినవారిని గురించి ఈనాడు మనం పత్రికలలో చదువుతున్నాము.

## మనం కొంగ్రొత్త వాతావరణమును నిర్మిద్దాము

ఆనాటి గాలి, ఆ వాతావరణము చల్లబడిపోయి వేరే గాలి వీస్తున్నది. ఆ గాలిని వేడెక్కించటానికి మనం ప్రయత్నం చేద్దాము. మీరందరూ ఆ పని చేయాలి అని నేను వాంఛిస్తున్నాను. యుగ నిర్మాణ యోజన కార్యక్రమమునకు ప్రణాళిక సిద్ధంగా ఉంది. వాతావరణమును వేడెక్కించాల్సిన అవసరముంది కనుకనే ఒక మహాపురశ్చరణను ఆరంభించాము. మేము 24 పురశ్చరణలు 24 ఏళ్ళపాటు పూర్తిచేసి దాని పూర్ణాహుతిగా సహస్రకుండి గాయత్రీ యజ్ఞం చేశాము. అయితే అది నా వ్యక్తిగత పురుషార్థం.

ప్రకృతి, కాలం, సహనం, ఈ మూడు మాన్పలేని గాయం లేదు.

ఈనాడు మనం మొత్తం ప్రపంచ వాతావరణమును వేడెక్కించటానికి ప్రయత్నిస్తున్నాము. ఆ ప్రయత్నంలో మీరు కూడా భాగస్వాములవ్వాలి. అయితే తస్మాత్ జాగ్రత్త! ఈ పని చేస్తున్నప్పుడు మీ నడవడి, విశ్వాసం ఉన్నతంగా ఉండాలి. మీరు ఏ క్షేత్రంలో పనిచేయటానికి వెళ్ళినా అక్కడి వాతావరణమును వేడెక్కించాలి. ఆ పనిచేస్తున్నప్పుడు మీకు సహకారం కూడ అనాయాసంగా లభిస్తుంది. ఒక్కముక్కలో చెప్పాలంటే అనుకూల వాతావరణ నిర్మాణం కోసము, జనమానసమును శీర్షాసనం వేయించటానికి గాయత్రీమహామంత్ర పురశ్చరణను మొదలుపెడుతున్నాము.

## యజ్ఞవిధానమును సిద్ధం చేద్దాము

ఈ మహామంత్ర పురశ్చరణ ఎటువంటిది? పంచకుండి యజ్ఞంతో పురశ్చరణ అవుతుందా? మనం చేస్తున్నది యజ్ఞం కాదు, పురశ్చరణ. యజ్ఞం-పురశ్చరణ వేరువేరు అంశాలు. ఈనాటి వరకు మనం నిర్వహించిన యజ్ఞములు 'ప్రశిక్షణ-ప్రచారము' అనే రెండు ప్రయోజనాల కోసం జరిగాయి. గాయత్రి-యజ్ఞము అనేవి భారతీయ సంస్కృతికి తల్లిదండ్రుల వంటివి అన్న విషయమును జనులకు తెలియజెప్పటానికి ఇప్పటివరకు యజ్ఞములు జరిగాయి. మరి తరువాత ఏమి చెయ్యాలి? ఇక సమర్థవంతమైన యజ్ఞములు జరగాలి. రెండు రకాలైన ఆలోచనలకు స్పష్టత నివ్వాలి. 1. యజ్ఞంయొక్క వైజ్ఞానికతను ఋజువు చేయుట. సిద్ధులు, చమత్కారముల కోసం మీరు యజ్ఞమును నిర్వహిస్తున్నారు. అది సరిపోదు. దానికోసం ప్రత్యేకమైన వస్తుసామగ్రి అవసరము. విశిష్టమైన సమిధలు కావాలి. ఎటువంటివారు, ఎటువంటి వృక్షాలనుండి, ఎప్పుడు, ఏ పద్ధతిలో వాటిని సమీకరించాలి? ఎటువంటి సంస్కారాలు వారిలోను, వస్తువులలోనే ఉండాలి? ఈ విషయములు తెలిసి ఉండాలి. హవనం కోసం సామగ్రిని సంతనుండి కొనుగోలు చెయ్యటం కాదు. యజ్ఞం కోసం పవిత్ర నదీజలాలను సమంత్రకంగా తీసుకు వస్తారు. అదేవిధంగా వనమూలికలను అభిమంత్రించి తీసుకురావాల్సి ఉంటుంది. అంతేకాదు హవనం చేసేవారు కూడా పరిష్కృత మనస్కులై ఉండాలి. అందుకుగాను వారు ఉపవాసం, బ్రహ్మచర్యము మొదలైనవి పాటించారా?లేదా అన్నవాటికన్నా, వారు చక్కని హృదయ సంస్కారమును కలిగి ఉండుట ముఖ్యము. సమర్థవంతమైన యజ్ఞములు చేయుటకు పెద్ద ప్రయత్నములు చేయాల్సి ఉంటుంది.

## ధార్మికమైన కట్టుబాట్లు వైజ్ఞానిక మాన్యతలు

యజ్ఞములు-వాటి ఫలితములు అన్న విషయములను అవగాహన చేసుకునేందుకు మనం పరిశోధనా సంస్థను స్థాపించుకున్నాము. ఇప్పటివరకు మనం ఏమి చేశామంటే- ప్రశిక్షణ కోసము యజ్ఞాలు చేస్తున్నాము. సంతనుండి సమిధలను కొనుగోలు చేస్తున్నాము. సంతలో వ్యాపారి చెప్పినదే మనం నమ్మాల్సి ఉంటుంది. ఇది మామిడి సమిధేనా అంటే అవును అంటాడు. అదే నమ్మాలి. ఇకమీదట అలాకాకుండా మనమే సమిధలను సమీకరించుకుంటాము. ఇప్పుడు వాటికి యజ్ఞములో ఉపయోగించుకునే సామర్థ్యము కలుగుతుందా? కలుగదు. మరేం చేయాలి? ఇప్పుడు మనం పురశ్చరణ చేస్తున్నాము. పురశ్చరణలో జపం, దానితోపాటు హవనం చేయుట తప్పనిసరి. యజ్ఞమునకు ఈ కట్టుబాట్లు, అనుశాసనము, క్రమశిక్షణ ఉన్నది. యజ్ఞ విధానము పూర్వపద్ధతిలో లేదు. 'యజ్ఞములకు రండి నాయనా!' అని ఎవరిని ఆహ్వానించినా, 'మాకు తీరికలేదు, చాలా పనులున్నాయి' అని జవాబిస్తున్నారు. యజ్ఞము పెద్దదికాదు, కేవలం 20 నిమిషాలలో పూర్తవుతుంది అని చెప్పినా ఏవేవో కుంటిసాకులు చెప్పి తప్పించుకుంటున్నారు. ఇలాంటి వేషాలు పనికిరావు.

## ఇది పురశ్చరణ యజ్ఞము

ఈనాడు జరిగే యజ్ఞములలో పలు కట్టుబాట్లు ఉన్నాయి. అయితే ప్రస్తుతం జపం చేస్తే చాలు యజ్ఞములో కూర్చోనిస్తాము. గాయత్రీ పురశ్చరణ హవనంలో పాలుపంచుకునేవారు నియమిత సంఖ్యలో గాయత్రీ మంత్ర జపం చేయాలి. వారే యజ్ఞములో పాల్గొనాలి. గాయత్రీ మంత్ర జపం చేస్తామని సంకల్పం తీసుకున్నవారే ఈ యజ్ఞములో భాగస్వాములవుతారు. ఇతరులు దీనిలో పాల్గొనలేరు. అంటే నియమిత ఉపాసన అనివార్యము. హవనం, సామగ్రి ముఖ్యం కాదు. ఇది ధనం ప్రాముఖ్యత వహించే యజ్ఞము కాదు. ఈ యజ్ఞము ప్రజల యొక్క సహకారమునకు, శ్రద్ధకు సంబంధించినది. శ్రద్ధను కూడుదీసుకుంటే చాలు యజ్ఞములో పాలుపంచుకొనగలరు. శ్రద్ధ లేకుండా, ఉపాసన చేయకుండా యజ్ఞములో భాగస్వామ్యం వహించుటకు ఎవ్వరు అర్హులు కారు. ఎందుకంటే ఇది జీవమున్న యజ్ఞము. పురశ్చరణ యజ్ఞము. మా గురుదేవులు సర్వేశ్వరానందగారు మాకు పురశ్చరణ చేయుటకు సంకల్పము నిచ్చారు. ఇప్పుడు మేము మీకు ఆ పురశ్చరణ సంకల్పమును అందిస్తున్నాము.

## ఏమి లాభం కలుగుతుంది?

ఈ పురశ్చరణ వల్ల కలిగే లాభమేమిటి? వాతావరణ కాలుష్య నివారణ అనేది మొదటి లాభము. గాయత్రీ పరివార్ సభ్యులను

**అనంతమైన దుఃఖాన్ని చిన్న నవ్వు చెరిపివేస్తుంది.**

ఇబ్బడిముబ్బడిగా పెంచాలి. 24 లక్షలమంది క్రొత్త కార్యకర్తలు చేరాలి అనేది సంకల్పము. ఒకసారి మా చేతికి చిక్కితేచాలు వదిలిపెట్టేదిలేదు. ఇప్పుడు గాయత్రిని వేదమాతగా కాకుండా, విశ్వమాతగా తయారుచేద్దాము. గాయత్రి వేదమాతగా ఉన్నప్పుడు చతుర్వేదాలను సృజించినది. ఆ తరువాత దేవమాతగా నిలిచింది. ఈ భరతభూమి మీద జన్మించిన ప్రతిఒక్కరు యజ్ఞోపవీతమును ధరించేటప్పుడు గాయత్రీమంత్రోపదేశమును పొందారు. అప్పుడు వారి నడవడి ఎంతో అందంగా నిర్మించబడి వారందరు దేవతలు అని పిలువబడేవారు. ఈ భారతదేశంలో ఆవాసమున్నవారంతా ముక్కోటి దేవతలుగా పిలువబడ్డారు. కనుక ఆనాడు గాయత్రి 'దేవమాత'గా నిలిచింది. మరి ఈనాడు ఏమి జరుగుతున్నది? ఇప్పుడు ప్రజ్ఞావతరణ జరుగుతున్నది. వర్తమానకాలంలో గాయత్రి విశ్వమాతగా రూపుదాలుస్తున్నది. రాబోవు సంవత్సరాలలో ఇది జరుగుబోయే తథ్యము. ఆ పిమ్మట సత్యయుగావతరణ జరుగుతుంది.

## గాయత్రి, యజ్ఞము అందరికి

వచ్చేది క్రొత్త యుగము. క్రొత్త సమాజము, ప్రపంచము రాబోతున్నది. అప్పుడు మనుష్యులు కూడా క్రొత్తవారొస్తారు. వారిలో దేవత్వం ఉదయిస్తుంది. భూమిమీద స్వర్గం వెల్లివిరిస్తుంది. ఇలా జరగటానికి విశ్వమంతటా గాయత్రి వెలుగులు, సవితా కాంతి వెల్లివిరిసి అంతటా ఆవరించాలి. ఒక్క భరతభూమి మీదే కాక, ప్రపంచమంతటా ఉన్న మనుష్యులందరిలో గాయత్రి వెలుగు వ్యాపించితీరుతుంది. గంగ, గాలి అందరిది అయినట్లు గానే గాయత్రి కూడా అందరికి చెందుతుంది. ఎందుకంటే గాయత్రి -వేదమాత, దేవమాత, విశ్వమాత. భావి కాలంలో గాయత్రిని విశ్వమాతను చేయుటకు ఈ పురశ్చరణ శక్తినిస్తుంది. ఆ శక్తిని ఇవ్వగల సామర్థ్యం పురశ్చరణలో ఉంది. ఆ శక్తితో జనమానసము లను జాగృతం చేద్దాము. గాయత్రి పట్ల నిష్ఠ కలిగినవారి సంఖ్య పెరగాలి. వాతావరణమును వేడెక్కించాలి. గాయత్రీ యజ్ఞం ద్వారా లోకశిక్షణా కార్యక్రమము నెరవేరాలి. అంతేకాకుండా జనులకు నవ్యమైన ఆలోచనలను అందిద్దాము. మానవ జీవితానికి సంబంధించి, కుటుంబ జీవనము, శారీరక-మానసిక-భౌతిక జీవనశైలిలోనేకాక, అన్నిరకాల శిక్షణలను అందిద్దాము. ఆలోచనలను మార్పు చేసే శక్తి గాయత్రిలో నిబిడీకృతమై ఉన్నది. గాయత్రితోపాటు యజ్ఞమును గురించి కూడా శిక్షణ నివ్వాలి. లోకశిక్షణకు రెండు ఆధారములున్నాయి. 1. ఆలోచనలలో ఉన్న కాలుష్యమును నివారించుట. అనగా మానసిక పవిత్రత. 2. ఆచరణలో అణుకువ, మర్యాద, సజ్జనత, సౌజన్యము సామాజిక జీవనంలో శ్రేష్ఠపరంపర అంటే జీవితమును శ్రేష్ఠముగా గడుపుట. ఆలోచనలు సమున్నతమైనవిగా, మంచివిగా తీర్చిదిద్దుట. ఇది ప్రముఖమైన లోకశిక్షణ. గాయత్రి మరియు యజ్ఞముల ద్వారా మనం పై లక్ష్యమును సాధించితీరాలి. అలా జరుగుతుందని ఆశిద్దాము.

*- అఖండజ్యోతి, సెప్టెంబర్ 2009*
*అనువాదం : శ్రీమతి లక్ష్మీరాజగోపాలు*

## కదిలించే కళ్లు

61 సీ॥ *మధురలో యజ్ఞంపు మహిమయేమోగాని*
*శిబిరాలు నడిపించు స్థితిని పెంచె*
*పరిజనుల ప్రేమ ప్రవహించుచున్ పోయి*
*శాంతికుంజుకు దోవ సాధ్యపరచె*
*ఆరాధ్యుదేయంచు మార్గదర్శకుడంచు*
*వేలుపట్టినడువ వేగపడిరి*
*ఈ స్నేహ సూత్రాలు దేశమంతటా పాకి*
*సందేశమందించి సఫలమందె*

తే॥ ఇట్టి యాత్రతో స్నేహంబు గట్టిపడగ
పరిజనుల సంఖ్య మరికొంత పెరుగు విధము
మానవాళికి దెలుపుట మరువకనుచు
కవిని కదిలించె గురుదేవు కంటిచూపు

62 సీ॥ *గత జన్మలందున సతియైన యిల్లాలు*
*ధర్మపత్నిగ నేడు తారసిల్లె*
*నేను చెప్పినటుల తాను నడచుకొంచు*
*సహకారమందించె సంతసమున*
*ధనధాన్యములనన్ని తగురీతి వెచ్చింప*
*భవనంబుకై తాను పసిడి నొసగె*
*సహధర్మచారిణి సహకారమున నేను*
*మనసైన మార్గాన మసలు కొంటి*

తే॥ మంచుకొండలకేగిన మర్మమెరిగి
పరిజనులకెంతయో ప్రేమపంచు విధము
మానవాళికి దెలుపుట మరువకనుచు
కవిని కదిలించె గురుదేవు కంటిచూపు

*రచన-మధుర కవయిత్రి*
*పొన్నూరు హైమవతీ శాస్త్రి*

**నువ్వు వెళ్లే దారిలో మొరుగుతూ ఉన్న కుక్కలన్నిటినీ నోరు మూయించాలనుకుంటే ఎన్నటికీ గమ్యాన్ని చేరలేవు.**

నావారితో నా మాట

# ఒక గొప్ప మహాకుంభమునకు తెరతీసిన ఉద్వేగమునకు నమస్కారము

జన్మశతాబ్ది మహోత్సవములను గురించి రాబోయే తరం వారు కథలుకథలుగా చెప్పుకుంటారు. కలిసి కదిలిన ప్రజాశక్తి చేయ లేనిది ఏమీ లేదు అన్నది సార్థకమవుతుంది. సెప్టెంబరు మొదలు కొని నవంబరులో జన్మశతాబ్ది మహోత్సవం వరకు దేశమంతటా, విశ్వమంతటా జరిగిన కార్యక్రమాలను తలుచుకుంటే పులకింత కలుగుతుంది. 2010లో హరిద్వార్‌లో జరిగిన బ్రహ్మాండమైన కుంభ కార్యక్రమాన్ని ఎవరూ మర్చిపోలేరు. అప్పుడు వచ్చిన పుణ్యతిథులలో భక్తులంతా పుణ్యస్నానాలు చేశారు. ప్రభుత్వం ఇందుకొరకు బడ్జెట్‌లో 100 కోట్ల రూపాయల నిధులను మంజూరు చేసింది. ఆ నిధులతో ఎంత పని జరిగిందో అందరికీ తెలుసు. కానీ గాయత్రీ పరివార్ స్వయంసేవకులు 3 నెలలుగా చేస్తున్న పనుల ఫలితాలను పర్యాటకులు కూడా చూడగలుగుతారు. ప్రభుత్వంతో సంబంధం లేకుండా ఒక విశేషమైన లక్ష్యం కోసం కదిలిన జనశక్తి ఏదైనా సాధించగలదని మన కార్యకర్తలు నిరూపించారు.

## చిన్నచిన్న సామర్థ్యములున్న వ్యక్తుల ద్వారానే భగీరథ ప్రయత్నం

శాంతికుంజ్ యుగసైనికులకు ఇంతటి కార్యక్రమం నిర్వహించడం ఇది మొదటిసారి కాదు. 1990 మన ఆరాధ్యులైన పూజ్య గురుదేవుల మహాప్రయాణం తరువాత అక్టోబరు 1 నుండి 4 వతారీకు వరకు జరిగిన శ్రద్ధాంజలి సమారోహం, నవంబరు 1 నుండి 7 వరకు హరిద్వార్‌లో జరిగిన మహాపూర్ణాహుతి సమారోహముల ద్వారా విభిన్న సేవాకార్యక్రమాల ద్వారా ఎన్ని చమత్కారాలు, అద్భుతాలు చేయవచ్చో గాయత్రీ పరివార్ చేసి చూపించింది. పరిమిత సాధనాలతో సామాన్య వర్గాలకు చెందిన సోదర సోదరీమణులు చేసిన సామూహిక ప్రయత్నము యొక్క కథ ఇది. కరసేవ అనేది గురుద్వారాలలోనే జరుగుతుందని వినిగాని, చూసిగాని ఉంటారు. కానీ ఇక్కడ హరిద్వార్ నుండి ఢిల్లీ వరకు ఉన్న మార్గమునంతటినీ గురుద్వారాగా భావించిన మన పరిజనులు పూజనీయమైన, అభినందించదగిన పనులు చేశారు. వీరి సమర్పణకు ఈ పనులు ఒక ఉదాహరణ మాత్రమే.

**వారధి నిర్మాణ చరిత్ర పునరావృత్తమైంది:** గంగామాత తన హృదయములో గాయత్రీపరివార్ యొక్క ఈ కార్యక్రమానికి స్థానము ఇచ్చింది. పుణ్యతీర్థమైన ఈ భాగీరథి ఇంత గొప్ప అవకాశము ఇవ్వకపోతే ఈ సమారోహమును నిర్వహించడం అసంభవమై ఉండేది. హరిద్వార్‌లో శతాబ్దాల నుండి మహా కుంభము జరుగుతూనే ఉంది. కానీ ఇక్కడ స్థలం చాలా తక్కువగా ఉంటుంది. కాలం గడిచేకొద్దీ ఇక్కడ జనాభా కూడా బాగా పెరిగి పోవడం వల్ల, ఉత్తరాఖండము తయారైన తరువాత కొండ మీద ఉన్న ప్రజానీకము క్రిందికి దిగిరావడం వల్ల, ఈ ధార్మిక నగరము పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చెందడం వల్ల స్థలము ఇంకా తగ్గిపోయింది. ఒక వైపు శివాలక పర్వతాలున్నాయి. వాటిమీద మానసాదేవి మందిరమున్నది. రెండోవైపు గంగానది ఉన్నది. ఇక్కడ గంగమ్మ ఒరవడి చాలా విపరీతమైన వేగంగా ఉంటుంది. ఆ వెనుక రక్షణనిచ్చే హిమాలయా శ్రేణులు ఉన్నాయి. చండీ పర్వతమునకు పట్టుచీర కట్టినట్లు ప్రవహించే గంగ ఇక్కడ నీలధారగా పిలువబడుతుంది. దీనిపై వంతెన ఆ వంతెనపై నుండే 3,4 లక్షల మంది పరిజనులు యజ్ఞశాలకు, ప్రవచన కక్షలకు ప్రతిరోజు రాగలుగుతారు.

## నూతన సంస్కరణలు

శ్రీరాముని కాలంలో సేతునిర్మాణమునకు పెద్దపెద్ద బండ రాళ్ళు మోసిన యుగసైనికులు ఇంకొంచెం ముందుకు వెళ్ళి గంగకు వంతెన కోసం ఇనుముతో తయారైన 10 మీటర్ల పొడవు గల బరువైన ఫ్రేముల్లో పెద్దపెద్ద రాళ్ళను వేసే పనిని ఇంజనీర్ల టీమ్ ఆధ్వర్యంలో అద్భుతంగా పూర్తిచేశారు. చండీ ద్వీపము నుండి గంగ యొక్క మధ్యప్రాంతమైన లాల్‌జీవాలా టాపూకి 815 అడుగుల దూరం వుంటుంది. రాత్రింబవళ్ళు కష్టపడి గంగ ప్రవాహం మధ్యలో ఫ్రేముల్లో పెట్టి వాటిమీద గర్డర్లు పెట్టి వెల్డింగ్ చేసి స్లీపర్‌లు పరిచే పనిని 14 రోజుల్లోనే చేసి చూపించారు మన మిషన్ యొక్క అభినవ కార్యకర్తలు. ఈ వంతెనలు అక్టోబరులో 24 నుండి తెరువబడ్డాయి. ఇందువల్ల 4 కి.మీ దూరం తగ్గిపోయింది. ఒక నిజంగానే అత్యంత విలక్షణమైన భగీరథ ప్రయత్నము. గంగ యొక్క పశ్చిమధార మధ్యలో నుండి లాలాజీవాలా యజ్ఞశాల ప్రవచన స్థలమునకున్న హైవేను కలిపే మరో వంతెన కూడా నిర్మించడింది. ఇది రాబోయే తరానికి రికార్డును నెలకొల్పే చరిత్ర.

2. ఇదే విధంగా వెయింటింగ్‌హాలు నుండి యజ్ఞశాల వరకు వెళ్ళే పరిక్రమస్థలానికి పైన ఓవర్‌బ్రిడ్జిని ఇక్కడి శాంతికుంజ్

**క్షమించడం వల్ల గతం మారిపోకపోవచ్చు. కానీ భవిష్యత్తు మాత్రం తప్పక నీకు అనుకూలంగా మారుతుంది.**

కార్యశాలలో నిర్మించారు. ఇక్కడినుండి 1551 కుండీయ యజ్ఞ శాల వరకు రాకపోకలు సాగించేందుకు వీలుగా ఉంటుంది.

### 3. నగరముల నిర్మాణము:

ఇది ఇంకా కష్టసాధ్యమైనపని. పంత్‌ద్వీపము నుండి బైరాగి ద్వీపము వరకు, గౌరీశంకర్ ద్వీపము నుండి రోడీ బేలవాలా వరకు విపరీతంగా పేరుకుపోయిన చెత్త, మురికిని తొలగించి శుభ్రం చేయడమనేది చాలా దుస్సాధ్యమైన పని. ఈ పనిని సెప్టెంబరు 15 నుండి అక్టోబరు 15 లోపు పూర్తి చేశారు. దాదాపు 5 లక్షల మంది కార్యకర్తలు ఉండేందుకు ఇక్కడ నివాసములు ఏర్పాటు చేయాలి. ఇదంతా ఎప్పుడు పూర్తౌతుంది అని ఆలోచిస్తుండగానే మన సేనానులందరు ఒకరొకరుగా వచ్చి పని పూర్తిచేశారు. ముందు పంత్‌ద్వీపము వద్ద శుభ్రము చేసి బేస్‌క్యాంప్ తయారుచేశారు. తరువాత భోజనాలయము ఏర్పాటు చేశారు. బీహార్, చత్తీస్‌గఢ్, ఒడిషాల నుండి వచ్చిన కార్యకర్తలు ఉండేందుకు నివాసములు తయారు చేయబడ్డాయి. ఈ స్వయం సేవకులందరు దూరదూరప్రాంతాల నుండి వచ్చి రోజుకు 10 గంటల చొప్పున పని చేసేవారు. ఎన్నడూ పార, పలుగు, కత్తి, దోకుడు పార వంటి ఆయుధాలు పట్టని వారుకూడా దైవీశక్తి సహకారంతో అన్ని పనులు చేయడంలో నిమగ్నులైనారు. మొత్తం హరిద్వార్‌లోని జనాభా అంతటికి సరిపోయేటంత నగరాన్ని ఒక నెలలోనే నిర్మించడమనేది అక్కడివారందరికి చాలా ఆశ్చర్యకరమైన విషయం. గౌరీశంకర్ ద్వీపము నుండి బైరాగి ద్వీపము వరకు శుభ్రం చేయడమే అన్నింటికంటే కష్టసాధ్యమైన పనిగా అనిపించింది. ఆ ప్రాంతంమంతటా 6 అడుగుల ఎత్తున ఉన్న అడవిగడ్డిని తీసివేసి శుభ్రం చేయడం సామాన్యమైన పని కాదు. కానీ పరిజనులు దానినంతటినీ కోసి ఎండబెట్టి తగలబెట్టేశారు. కొండల్లో నుండి ఏనుగులు దాహం తీర్చుకునేందుకు గంగ ఒడ్డుకు ఆ ప్రాంతానికే వస్తాయి. పరిజనులు వాటి బారిన పడకుండా తమని తాము కాపాడుకోవాలి. కానీ గురుదేవుల ప్రేమసాగరమనే మత్తులో మునిగి ఉన్న పరిజనులకు అటువంటి ఇబ్బందులు కలుగలేదు. అక్కడినుండి 4 కి.మీ దూరం వరకు శుభ్రం చేసి గౌరీశంకర్ 1,2,3,4 ద్వీపములు, చండీదేవి మందిరానికి సరిగ్గా క్రింది ప్రాంతము వరకు చదును చేశారు. నగరాలు నిర్మించ బడ్డాయి. ఆస్పత్రులు నిర్మించబడ్డాయి. అక్టోబరు 20 నుండి భోజనాలయాలు నిర్మించబడ్డాయి. ఆశ్వయుజ మాసంలో అందరికి ఆ పనులే దేవీ నవరాత్రుల సాధనగా సాగిపోయింది. హరిద్వార్ నుండి చాలా దూరంలో ఉన్న బైరాగి ద్వీపము ఎంతో కష్టంమ్మీద శుభ్రపడింది. దక్షప్రజాపతి మందిర ప్రాంతంలో ఉన్న ఈ క్షేత్రము చాలా దూరంలో ఉండే ఢిల్లీ హైవేకి సమీపంగా ఉంటుంది. రాజస్థాన్, గుజరాత్, దక్షిణ భారతదేశం లోని ప్రాంతాలవారు, ఇక్కడే ఉంటారు. దాదాపు ఒకటిన్నర లక్షల జనాభా ఉన్న ఈ ప్రాంతం చక్కదిద్దిన తరువాత ఒక కొత్త నగర శోభను సంతరించుకుంది.

### 4. ప్రదర్శనలు-కళావేది-ఆలోచనా వేదికలున్న బేల్‌వాలా క్షేత్రము:

ఇది హరికీపైడీకి చాలా దగ్గరలో ఉంటుంది. ఇది కూడా మనకు పెద్దసవాల్‌నే విసిరింది. హరిద్వార్‌కు హృదయంగా చెప్పబడే ఈ ప్రాంతంలో కుంభనగర్ యొక్క ముఖ్యకార్యాలయం, సి.సి.ఆర్. టవర్‌లు వున్న ఈ ప్రాంతం మొత్తం ఆక్రమణలతో నిండిపోయి ఉంది. గాయత్రీ పరిజనులు వినయంతో, విజ్ఞప్తులతో, ప్రభుత్వ ఒత్తిడులను ప్రయోగించి ఈ ప్రాంతన్నంతటిని ఖాళీ చేయించేసరికి తల ప్రాణం తోకకు వచ్చింది. ఎంతోమంది భిక్షగాళ్ళు ఈ ప్రాంతాన్నంతటినీ మురికిచేశారు. మరి అక్కడికి కనుచూపుమేరలోనే శ్రద్ధాళువులైన వారంతా గంగాస్నానం చేస్తుంటారు. అక్కడంతా చాలా మురికి పేరుకుపోయి ఉన్నది. కానీ ఈ ప్రాంతం దాదాపు 3 కి.మీ పొడవు ఉంది. అక్కడ పడి ఉన్న రాళ్ళకుప్పలు, మురికిని చాలా కష్టపడి శుభ్రం చేయవలసి వచ్చింది. పేడతో అలికిన ఒక బేస్‌క్యాంపును ముందు సిద్ధం చేశారు. వెంటనే రకరకాల గుడారాలు వేసే పని మొదలుపెట్టారు. అక్కడ కళానగరము (కళావేదికతో సహా), సంస్కార నగరము (సంస్కార శాల), విచారవేదిక (ఆలోచనలను మథించే వేదిక), మీడియ నగరము, ప్రదర్శనలు చూపించేందుకు మూడు విశాలమైన పండాలు (షామియానాలు), సాహిత్యమేళ, ఆయుర్వేదము, గ్రామ స్వావలంబన, ఆదర్శగ్రామాలు, ప్రమాదాలను ఎదుర్కొనుట, గోవుల పెంపకంతో సహా 30 పడకలతో కూడిన ఒక వైద్యశాల అన్నీ ఒక్క నెలలో సిద్ధమైనాయి. వీటినన్నింటిని చక్కగా అలంకరించేందుకు ఝాన్సీ, బైతూల్, ముంగేర్ నగరాల నుండి విశిష్ట కార్యకర్తలు వచ్చారు. ప్రతి ఒక్కరు తమ బాధ్యతలను చక్కగా నిర్వహించడం వల్ల పని అంతా చక్కగా సాగిపోయింది. హరికీపైడీ నుండి చూసే పర్యాటకులకు గంగానది నుండి మాయాపూర్ బైరాజ్ వరకు ఒక కొత్త పట్టణం వెలసినట్లుగా ఉంటుంది. ఇది వారికి ఎంతో కుతూహలమును రేకెత్తించే విషయము. విశ్వవిద్యాలయము యొక్క విద్యార్థినీ విద్యార్థులు ఉండేందుకు కూడా ఇక్కడే ఏర్పాటు చేయబడింది. విశ్వ విద్యాలయము జ్ఞానమును అందించే ఏర్పాటు జరిగింది.

**సాహసించేవాడి వెనుకే అదృష్టం నడుస్తూ ఉంటుంది.**

**5. ముఖ్య కార్యక్షేత్రము లాలాజీవాలా:**

ఇది విశాలమైన ప్రాంతము కాదు. రెండువైపులా ప్రవహించే గంగ మధ్య అక్కడి కేంద్రీయ వ్యవస్థను నిర్వహించేవారికి వసతి ఏర్పాట్లు, కార్యాలయము, జ్ఞానవేదిక (ప్రవచన వేదిక), 1551 కుండీలతో నిర్మించిన యజ్ఞశాల ఏర్పాటుచేశారు. ఈ నిర్మాణాలన్నీ చాలా అందంగా, అద్భుతంగా తయారైనాయి. మన పరిజనులు ప్రతికూల పరిస్థితులలో కూడా రోజుకు 20 గంటలపాటు నిర్విరామంగా చేసిన కృషికి ఫలితమే ఈ నిర్మాణాలు. ఈ క్షేత్రంలో ఒక్కసారే 3,4 లక్షలమంది కూర్చునేందుకు అవకాశమున్నది. ఇది చాలా ముఖ్యమైన ప్రదేశము. అత్యంత నైపుణ్యమును ప్రదర్శించి మన పరిజనులు ఉత్తచేతులతోనే తయారుచేసిన వంతెనలు మిగిలిన అన్ని మార్గాలను కలుపుతాయి. ఎక్కడా ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడకుండా ఉండే విధంగా వ్యవస్థను ఏర్పాటు చేయడం జరిగింది.

**4. పంత్‌ద్వీప క్షేత్రము:**

దీని నిర్మాణమునకు కూడా విలక్షణమైన భగీరథ ప్రయత్నము చేయవలసి వచ్చింది. ఇందులో రెండు భోజనాశాలలు నిర్మించారు. వీటిలో ఒక్కసారే ఒకటిన్నర లక్షమంది భోజనం చేయవచ్చు. ఈ ప్రాంతమునంతటినీ మన యుగసేనానులే శుభ్రము చేశారు. నిర్మాణాలకు కూడా వీరే సహకరించారు. దాదాపు 400 స్విస్ కాటేజీలు గంగ ఒడ్డున హైవేకి రెండోప్రక్కన అపరపంత్ ద్వీపంలో ప్రవాస భారతీయుల కొరకు నిర్మించారు. హోటల్స్‌లో ఉండడము అలవాటైన వారికి తగిన ఏర్పాటు చేశారు.

ఇక్కడ కొన్ని హైటెక్‌స్థాయి నిర్మాణాలు కూడా చేపట్టడం జరిగింది. అవి

1. 'దియా'కు చెందిన యువకార్యకర్తలు 5 లక్షలమంది ఇక్కడకు రాదలుచుకున్న పరిజనులందరినీ మొబైల్‌లో కాంటాక్ట్ చేసి వారికి అవసరమైన మార్గదర్శనం చేసేందుకు, వారిపేర్లను నమోదు చేసుకునేందుకై రాత్రింబగళ్ళు పనిచేసే కాల్ సెంటర్స్ ఏర్పాటు చేయడం జరిగింది.
2. ఆలోచనా వేదిక కొరకై ఆహ్వానించిన అతిథులందరినీ కలిసేందుకు అవసరమైన సాధనాలు, వారిని తీసుకువచ్చి మిషన్ యొక్క సర్వోత్కృష్టమైన ప్రణాళికలను, ప్రదర్శనలను చూపించే ఏర్పాటు కూడా చేయడం జరిగింది.
3. కళావేదికను అత్యాధునిక హంగులతో అలంకరించారు. మన భారతీయ సంస్కృతి గురించి తెలియచెప్పే అతి విలక్షణమైన ప్రదర్శనకు రంగం సిద్ధమైంది.
4. ఎన్.సి.ఆర్ కు చెందిన యువశక్తి ఈ బాధ్యతను స్వీకరించి విభిన్న కార్యకర్తలందరినీ ఒక త్రాటిపై చక్కగా నడిపించి మహాకుంభం జరిగే ప్రాంతం వరకు తీసుకువచ్చారు. వారు ఇచ్చిన మాటను చక్కగా నిలబెట్టుకున్నారు.

ఏదైతే జరుగుతున్నదో అది అతి విలక్షణమైనది, అతిమాన వీయమైనది. మనమంతా నిమిత్తమాత్రులవలె ఉన్నాము. ఏ గురుసత్తా కోసం ఇన్ని లక్షలమంది వస్తున్నారో వారంతా ఆయన ప్రణాళికాశక్తి వల్లనే రాగలుగుతున్నారు. మన ఇళ్ళల్లో ఒక పెళ్ళి చేయాలంటే ఎంత కష్టమో మనందరికి అనుభవమే ఇక్కడి వ్యవస్థ అంతా సామూహికంగా ఎటువంటి అభిప్రాయభేదాలు, మనో భేదాలు రాకుండా జరిగిపోతున్నది. గురుదేవుల తరువాత ఈ కార్యక్రమం జరిపించిన కీర్తి దక్కవలసింది మన వరిష్ట కార్యకర్తలకే. వారందరూ పరస్పర సమన్వయంతో ఒక అద్భుతమైన కార్యక్రమాన్ని మనముందుంచారు. రాత్రిపగలు అనేది చూడకుండా, శరీరమును, మనస్సును గురించి పట్టించు కోకుండా నెలరోజుల ముందుగా గురుసేవ కోసం వచ్చిన స్వయం సేవకులైన మన సోదర సోదరీమణులందరికీ మా హృదయపూర్వక కృతజ్ఞతలు సమర్పించుకుంటున్నాము.

*– అఖండజ్యోతి, డిశంబర్ 2011*
*అనువాదం : శ్రీమతి వల్లీశ్రీనివాస్*

## ఆకు ఎందుకు రాలింది?

*ఒక ఆకు ఎండి నేలరాలటం చూచి అజ్ఞానులు అది ఆకు దోషమేనని నిందించటం, సానుభూతిని చూపటం చేస్తుంటారు. కానీ విజ్ఞులు నేలరాలినంత మాత్రాన ఆదోషం ఆకుది కాదని, వృక్షం యొక్క రసవాహక నాళాలు సామర్థ్యం కలిగి ఉన్నంత వరకు లేదా త్రుంచి వేస్తే తప్ప ఆకులు రాలవని, అవి వృక్షం నుండి, తన స్వజనుల నుండి వేరుపడి ధూళిలో కలవటానికి ఎంతమాత్రం ఇష్టపడవని గుర్తించ గలుగుతారు. లోకువగా కన్పించే ఆకులను నిందించే మనుష్యులే ఈనాడు అధిక శాతం కన్పిస్తున్నారు. వృక్ష మూలంలోని వికృతిని గుర్తించగలిగే సామర్థ్యం అతి తక్కువమందిలో ఉందనే చెప్పాలి.*

*కుటుంబం వృక్షమైతే వ్యక్తి ఆకులాంటివాడు. కుటుంబంలో ఒక వ్యక్తి యొక్క ప్రగతికిగాని, పతనానికిగాని, వారు ఒక్కరే ఎంతమాత్రం బాధ్యులుకారు. మిగిలిన కుటుంబ సభ్యులందరి ప్రభావం వ్యక్తి మీద ఉంటుంది.*

– ప్రజ్ఞాపురాణం నుండి

**నిన్ను చూసి నవ్వే ప్రపంచాన్ని చూసి నవ్వగలగడమే నీ తొలి విజయం.**



ఆరోగ్యమే మహాభాగ్యం - 13

# హోమియో వైద్య సేవ

**డిప్రెషన్‌కి హోమియోలో చికిత్స ఉందా? పూర్తిగా తగ్గుతుందా? తెలియజేయగలరు?**

**- సువర్ణ, హైదరాబాద్**

డిప్రెషన్ అనేది ఒక మానసిక వ్యాధి.

**దీని లక్షణాలు :**

• ఏదో తెలియని బాధ • నిరాశ • ఏ పని చేయాలని పించకపోవడం • నిస్సత్తువ • జీవితంపై, కుటుంబంపై నిరాసక్తత • నిద్రలేమి లేదా అతినిద్ర • ఆకలి మందగించడం లేదా అతిగా ఆకలి వేయడం • బరువు తగ్గటం లేదా పెరగడం • దేనిమీద ఆసక్తి లేకపోవడం • ఆత్మహత్య ఆలోచనలు • ఆత్మ విశ్వాసం లేకపోవడం • ఒంటరితనం • ఇష్టమైన పనులపై కూడా ఆసక్తి లేకపోవడం.

పై లక్షణాలు ప్రతివారి జీవితంలో అప్పుడప్పుడు వస్తుంటాయి. కానీ ఈ లక్షణాలు కొన్ని వారాలుగా, నెలలుగా ఉండి దైనందిన కార్యకలాపాలకు అడ్డుగా వస్తుంటే దానిని మెడికల్‌గా డిప్రెషన్ అనుకోవాలి.

దీనికి ఇదమిద్ధమైన కారణమంటూ ఏమీ తెలియదు. డిప్రెషన్‌కి జన్యుపరమైన, వాతావరణ మార్పులతోబాటు సామాజిక, ఆర్థిక, ఆరోగ్యపరమైన బాధల వలన, దాంపత్య సమస్యలు, దగ్గరి వ్యక్తులు చనిపోవడం లేదా దూరమవటం, పరీక్షలలో తప్పటం, కొన్ని రకాలైన మందులు, స్టిరాయిడ్స్ వాడడం వగైరాలు డిప్రెషన్ రావడానికి దోహదపడుతాయి.

కొంతమందికి ఇది వంశపారంపర్యంగా ఉండవచ్చు.

**రకాలు :** డిప్రెషన్‌ను ముఖ్యంగా మేజర్ డిప్రెషన్, డిస్థీమియా, బైపోలార్ డిజార్డర్ అని మూడు రకాలుగా విభజించవచ్చు.

**మేజర్ డిప్రెషన్ :** ఇది చాలా తీవ్రస్థాయిలో ఉంటుంది. ఇది కొంతమందికి జీవితంలో ఒకసారే వస్తుంది, కాని కొందరిలో ఇది జీవితాంతం ఉంటుంది. ఇది వ్యక్తి జీవిత విధానంపైనా, చదువు, నిద్ర, ఆహార విహారాలు, ఇతర పనులపై కూడా ప్రభావం చూపుతుంది.

**డిస్థీమియా :** ఇది మేజర్ డిప్రెషన్ కన్నా తక్కువస్థాయిలో ఉంటుంది. కాని ఇది కూడా చాలా సంవత్సరాల పాటు ఉంటుంది. దీనితో బాధపడేవారు తమ రోజువారీ పనులను నిర్వహిస్తారు కాని ఉత్సాహంగా చేయలేరు. ఎప్పుడూ ఏదో కోల్పోయినట్లుగా, నిరుత్సాహంగా కనిపిస్తారు.

**బైపోలార్ డిప్రెషన్ :** దీనితో బాధపడే వ్యక్తులు మానిక్‌గా మారతారు. సాధారణ పరిభాషలో చెప్పాలంటే పిచ్చిగా ఉంటారన్నమాట. పరిసరాల జ్ఞానం, తమ మీద తాము పూర్తిగా అదుపు కోల్పోతారు.

**సాధారణ చికిత్స :** కౌన్సెలింగ్, యాంటి డిప్రెసెంట్ మందులు ద్వారానూ, ఎలక్ట్రో కన్వల్సివ్ థెరపీ ద్వారా మెదడులో రసాయన మార్పులు తీసుకురావడం, శారీరక శ్రమ, మెడిటేషన్ వంటి ద్వారా తగ్గించవచ్చు.

**హోమియో చికిత్స :** డిప్రెషన్‌కి హోమియో చికిత్స చాలా బాగా పనిచేస్తుంది. ముఖ్యంగా తొలిదశలోనే కనుక హోమియో చికిత్స తీసుకుంటే సత్వర ఫలితాలు ఉంటాయి. దీర్ఘకాలికంగా యాంటి డిప్రెసెంట్ మందులు వాడిన వారిలో మాత్రం పూర్తి చికిత్స సాధ్యం కాకపోవచ్చు. అయినాగాని కొంతమేర లాభం మాత్రం తప్పనిసరిగా ఉంటుంది.

హోమియోపతి మూలం నుండి వ్యాధికారకాలను తొలగిస్తుంది. అందులోను వ్యక్తియొక్క లక్షణాలను బట్టి మందును సూచిస్తారు, కావున మానసిక వ్యాధులలో హోమియో మందులు చేసే మేలు మరే ఇతర పద్ధతులలోను సాధ్యం కాదు.


ఆరమ్‌మెట్, జెల్సిమియం, ఇగ్నేషియ, అనాకార్డియం, పల్సటిల్ల, సెపియా మొదలగు మందులు రోగి లక్షణాలను బట్టి వాడినచో సత్వర ఫలితాలు ఉంటాయి.


సలహాల కొరకు సంప్రదించవల్సిన చిరునామా

**డా॥ టి. నీలవేణి,** బి.హెచ్.ఎమ్.ఎస్.
ఆర్.ఎన్..జి. అడ్వాన్స్‌డ్ హోమియో క్లినిక్
ఇ.నెం. 3-211, యశోద గార్డెన్స్ దగ్గర,
శాంతినగర్, కూకట్‌పల్లి, హైదరాబాద్ - 500 072.
ఇ-మెయిల్: drneelaveni@gmail.com


*ఈ శీర్షిక హోమియో వైద్య విధానం మీద అవగాహన పెంచుకోవడానికే. దయచేసి స్వంత వైద్యం ప్రయత్నించవద్దని మనవి.*

**విజయం, బద్ధకం రైలు పట్టాల్లాంటివి. ఎన్నటికీ కలవవు. ఒకదానితో చెలిమి చేయాలంటే రెండోదానిని వదులుకోవాలి.**



# సుభాషితాలలో సుధారస బిందువులు - 2

భర్తృహరి తనకుగల సామాజిక దృక్పథాన్ని, లోకవర్తనాన్ని, విశేష అనుభవాన్ని రంగరించి అందించిన అపూర్వ నవనీతమే శతక వాఙ్మయ చేతనం. లోకంలోని వ్యక్తుల మనస్తత్వాలు, తీరు తెన్నులను క్షుణ్ణంగా పరిశీలించిన భర్తృహరి సంస్కృత శ్లోకాన్ని అందిస్తే, దానికి చక్కని తెలుగు భావాలతో మెరుగులను దిద్దిన మేరునగధీరుడు శ్రీ ఏనుగు లక్ష్మణ కవి.

పరోపకారుల స్వభావాన్ని, అందులో ముఖ్యంగా సన్మిత్రుల లక్షణాన్ని ఇలా వివరించారు కవి ద్వయం.

**పాపాన్ని వారయతి, యోజయతే హితాయ,**
**గుహ్యం నిగూహతి, గుణాన్ ప్రకటీకరోతి,**
**ఆపద్గతం, చ న జహాతి, దదాతికాలే**
**సన్మిత్ర లక్షణ మిదం ప్రవదన్తి సన్తః ॥**

యదార్థ మిత్రుడు అనగా ఇతరుల మంచిని, శ్రేయస్సును కోరుతూ, వారి పురోగతికి తన వంతు సహకారాన్నిందించడమే కాక, అతని ఉన్నతిని సదా కాంక్షించేవాడేనని సర్వసాధారణంగా అందరికీ తెలుసు. కానీ ఇతరులు పాపకర్మలను ఆచరిస్తూ, చెడు మార్గంలోకి పయనించకుండా నివారించడం, ఆ ప్రయత్నంలో ఎన్నో మానావమానాలను ఎదుర్కొన్నప్పటికీ మైత్రీ బంధం కొరకు వాటిని లక్ష్యపెట్టకపోవడం మంచి మిత్రునికి ప్రధాన లక్షణం. ఏది మంచో, ఏది చెడో, తెలియచెబుతూ, మంచి మరియు శ్రేయస్సును కల్గించే మార్గంలో తన మిత్రుడు నడవాలి అని కోరడం మంచి మిత్రుని రెండవగుణం. ఎదుటి వ్యక్తిలోని బలహీనతలను, అశక్తతను (తనకు తెల్సినప్పటికీ) తనయందే దాచుకొని, ఇతరుల ముందు బయటపెట్టకుండా, నిజమైన ఆత్మీయునిగా, శ్రేయోభిలాషిగా, మిత్రునిలోని అనుకూలమైన అంశాలనే అందరిముందు ప్రశంసిస్తూ, ప్రతికూల అంశాలను ఏకాంతంలో చెప్పి, వాటిని తొలగించుకొనే రీతిలో ప్రయత్నం చేస్తాడు. ఆపదలు సంభవించినపుడు, అందరిలాగా విడిచిపెట్టి వెళ్ళకుండా, తగిన సహాయాన్ని చేయడం, కష్టకాలంలో ఆదుకోవడం, అనేవి సన్మిత్ర లక్షణాలుగా తెలుపబడ్డాయి. ఏనుగు లక్ష్మణ కవి ఇదే భావాన్ని ఇలా చెప్పారు.

**అఘము వలన మరల్చు, హితార్థ కలితుఁ**
**జేయుఁగోప్యంబు దాచుఁ బోషించు గుణము**
**విడువఁడాపన్ను, లేవడి వేళనిచ్చు**
**మిత్రుఁడీ లక్షణంబుల మెలంగుచుండు**

మంచి మిత్రుల మధ్య అనుబంధం ఎలా ఉంటుందంటే, ఒకరికొకరు పరస్పరం సహకరించుకోవడం, ఒకరికి కష్టం వచ్చినప్పుడు మరొకరు ఆదుకోవడం మాత్రమే కాకుండా స్నేహితునికి అపకారం చేసే శత్రువు విషయంలో ఎలా ప్రవర్తిస్తారో ఈ క్రింది శ్లోకంలో చక్కగా వివరించారు.

**క్షీరేణాత్మగతోదకాయ హి గుణాదత్తాపురాతేఽఖిలాః**
**క్షీరోత్తాపమవేక్ష్య తేవ పయసా స్వాత్మా కృశానౌహుతః।**
**గన్తుం పావక మున్మనస్త దభవద్దృష్ట్వాతుమిత్రాపదం**
**యుక్తం తేన జలేన శామ్యతి, సతాం మైత్రీ పునస్త్వీదృశీ ॥**

పాలు, నీళ్ళు ఒకరిలో ఒకరు, ఒకరితో ఒకరు అవ్యక్తమైన ఆనందానుభూతిని పొందుతూ తాదాత్మ్య దృష్టితో మమేక మౌతాయి. అటువంటి పాలను వేడిచేయడం కొరకు నిప్పులపై ఉంచినపుడు, ఆ వేడికి తాళలేక నీరు ఆవిరి రూపంలో (పొంగు రూపంలో) పైకి ఎగిరి నిప్పుల్లో పడుతుంది. ఈ సందర్భంలో మిత్రులైన తమ (పాలు, నీరు) అనుబంధాన్ని చూచి ఓర్వలేని అగ్ని అలా బాధించే ప్రయత్నం చేస్తున్నపుడు అగ్ని పై కోపంతో ఆ అగ్నిని ఆర్పే యత్నం చేస్తూ, నీళ్ళు నిప్పులో పడతాయి.

అయితే తన మిత్రుడైన నీరు, నిప్పుల్లో పడిపోవడం చూసి, తట్టుకోలేని పాలు, నీళ్ళతోబాటు తాను కూడా నిప్పుల్లో పడిపోవ డానికి సిద్ధపడి మైత్రీ ధర్మాన్ని నిర్వహిస్తాయి. కానీ ఆ పాల పొంగును చల్లార్చడానికి మళ్ళీ ఆ పాలగిన్నెలో నీళ్ళను చిలకరిస్తూ ఉంటాం. ఆ నీటిని చూసి, తన మిత్రుని తాను తిరిగి పొందానన్న ఆనందంతో, పాలు చల్లబడి తిరిగి మామూలు స్థితికి చేరతాయి. ఇదీ! మైత్రీ బంధమంటే.

స్నేహితుడు ఆపదలో ఉండి, అగ్నికి ఆహుతి అయిపోతుంటే, ఆ స్నేహితుని కొరకు అవసరమైతే తాను కూడా నిప్పుల్లో పడడానికి సిద్ధపడడం, మళ్ళీ ఆ నీరు తిరిగి చేరడంతో ఉపశమనాన్ని పొందడం అనేవి కవి హృదయాన్ని సూచించే అద్భుత తార్కాణాలు.

మామూలుగా పూర్వం రోజులలో పాలను కుంపటిపై మరగ బెట్టేటపుడు జరిగే పరిణామాలను, అందంగా ఇద్దరి మధ్య కలిగే

**పర్వతం ఎత్తు చూసి జంకితే, శాశ్వతంగా కిందనే; సాహసించి ఒక్కో అడుగు పైకి వేస్తే శిఖరాగ్రం మీదనే**

స్నేహ ప్రవృత్తికి నిదర్శనంగా చూపడం కవి ప్రతిభకు తార్కాణం. దానినే ఏనుగు లక్ష్మణ కవి ఇలా వివరించారు.

**క్షీరము మున్ను నీటి కొసగెన్ స్వగుణంబులు దన్నుఁజేరుటన్**
**క్షీరము దప్త మౌట గని చిచ్చు తికెన్ వెతచే జలంబు, దు**
**ర్వార సుహృద్విపత్తిఁగనివహ్నిఁజొరంజనె దుగ్ధ, మంతలో**
**నీరముగూడిశాంతమగు, నిల్చు మహాత్ముల మైత్రి యీ గతిన్ ॥**

పరోపకార గుణం కల్గినవారు, తమశక్తి కొలదీ తర, తమ భేదాలు లేకుండా అందరికీ ఆశ్రయమిస్తారు. ఎంత కష్టాన్నైనా సరే, భరిస్తూ, నిస్వార్థంగా అందరినీ అక్కున చేర్చుకునే 'అమ్మ' గుణం కలవారై ఉంటారు. దానికి సముద్రుడే ఉదాహరణగా తెలుపబడ్డాడు.

**ఇతః స్వపితి కేశవః, కులమితస్తదీయద్విషా**
**మితశ్చ శరణార్థినాం శిఖరిణాం గణాః శేరతే**
**ఇతోఽపి బడబానలః సహ సమస్త సంవర్తకై**
**రహో వితత మూర్జితం భరసహంచ సిన్ధోర్వపుః ॥**

నిత్యం అలల తాకిడితో, ఆటుపోట్లతో కూడి ఉండే సముద్రం, పదునాలుగు లోకాలను ఉదరంలో దాచుకున్న విరాట్ స్వరూపుడైన విష్ణువుకు నెలవై ఉంటుంది. మరొక ప్రక్క కాల కేయాది రాక్షసులు, పగటి సమయంలో దాగుకునే అవకాశాన్ని కల్గిస్తోంది. మరొక ప్రక్క ఇంద్రుని వజ్రాయుధ దెబ్బలకు భయపడి శరణుకోరిన మైనాకుడు మొదలైన పర్వతాలకు ఆశ్రయమిచ్చింది. ప్రళయ కాలమేఘాలు, బడబాగ్నికి కూడా తనయందు ఇముడ్చుకున్న గంభీరమూర్తి సముద్రుడు.

పరోపకారులు ఇతరుల గుణదోషాలతో నిమిత్తం లేకుండా, తమకు ఎన్నో ఇబ్బందులు ఉన్నప్పటికీ, ఏ మాత్రం బెదరక, చెదరక తమ వంతు ఉపకారం చేయడం వారి నైజం. నదులు ఎన్ని కల్సినా, ఎటువంటి వరద ప్రమాదం లేకుండా స్థిరచిత్తుడై ఉండడం సముద్రుని తత్త్వం. అటువంటి తత్త్వాన్ని పరోపకారులు సదా కలిగి ఉంటారు.

**ఒక యెడఁబవ్వళించు హరి, యొక్క యెడన్ వసియించు రాక్షస**
**ప్రకరము, లొక్కచోనడగుఁబర్వత సంఘము, లొక్కెడన్ బలా**
**హకముల తోడనుండు బడబాగ్నియు, విస్తృత మూర్జితంబునుం**
**బ్రకట రక్షమం బగుచు భాసిలు నౌర సముద్రమెంతయున్ ॥**

"కమలాక్షు నర్చించు కరములు కరములు
శ్రీనాథువర్ణించు జిహ్వ, జిహ్వ"

అన్న రీతిలో లోకకల్యాణం కొరకు జీవించడం, అత్యద్భుత సాహస కృత్యాలను ఇతరుల కోసం ఆచరిస్తూ, ఉన్నత స్థితిలో ఉండడమే ఉత్తముల లక్ష్యం. వారి దృష్టిలో శిఖరాయమానంగా శ్రేష్టమైన రీతిలో, అందరికి ఆదర్శ ప్రాయంగా ఉండడమే నిజమైన జన్మ, సామాన్యునిలా అందరితో బాటు పుట్టి, ఎటువంటి పరమార్థం లేని జీవితం వృథా అని భావిస్తారు.

ఆ భావాన్ని ఇలా వివరించారు. ఈ శ్లోకంలో

**జాతః కూర్మ స ఏకః పృథు భువన భర యార్పితం యేన పృష్ఠం**
**శ్లాఘ్యం జన్మ ధ్రువస్య భ్రమతి నియమితం యత్ర తేజస్వి చక్రమ్**
**సంజాతవ్యర్థ పక్షాః పరహిత కరణేనోపరిష్టాన్న చాధో**
**బ్రహ్మాణ్డో దుమ్బరాన్తర్మ శకవదపరే జన్తవో జాతనష్టాః॥**

ఈ లోకంలో పరహితం కోసం తన వీపు (వెనుక భాగాన్ని) భాగాన్ని అర్పించి, 14 లోకాలను నిత్యం మోస్తూ, సృష్టి క్రమానికి దోహదపడుతున్న కూర్మావతారం సార్థక్యం పొందిన జీవి. కేవలం సముద్రంలో లోకాలు మునిగి పోకూడదన్న లక్ష్యంతో, తనకు ఎటువంటి లాభాపేక్ష లేకుండా (కూర్మం) లోకకల్యాణం కొరకు ధర్మంగా భావించడమే లోకోత్తమ భావన. అదేవిధంగా ధృవుడు విష్ణువు నుండి వరప్రసాదితుడై, సమస్త జగత్తును నడిపించే సూర్య, చంద్రాదుల తేజశ్చక్రాన్ని నియంత్రించే శక్తిమంతుడై వెలుగొందు చున్నాడు. ప్రతివ్యక్తి వీరిని ఆదర్శంగా తీసుకుని అనుసరించే యత్నం చెయ్యాలి. అంతేకాక, బ్రహ్మాండమనే అత్తిపండు (మేడి పండు) లోని పురుగులలాగా ఎటువంటి ప్రయోజనం లేని జీవితాన్ని గడపడం వృథా. కాబట్టి ఉత్తమ జీవనాన్ని సాధించే రీతిలో ప్రయత్నించాలి.

**వితత జగద్భరంబు ద న వీపుఁనఁదాల్చిన కూర్మనాథుఁడుపన్**
**సతతము చంద్రభాస్కరుల చక్రముఁద్రిప్పుఁధృవుండు సజ్జనుల్।**
**ప్రతిభన జాండ జంతుఫలరంధ్రవ సన్మశకంబులట్లనిం**
**దిత విఫలార్థసంగతి జనించి నశించుఁదదన్య జంతువుల్ ॥**

– సాధన నరసింహాచార్య


యుగశక్తి గాయత్రి
మాస పత్రిక చదవండి !
చదివించండి !!


హింసకు హింస సమాధానం కాదు, కన్నుకు కన్నే జవాబైతే లోకమంతా గుడ్డివారే మిగులుతారు.

# ముక్తికి మార్గం - మార్గశిర మాసం

**"మాసానాం మార్గశీర్షోహం"** అన్న గీతాచార్యుల వారి ఉక్తిని బట్టి మార్గశిర ప్రాధాన్యత, ప్రాశస్త్యం మనకు తెలుస్తున్నాయి.

కార్తీక మాసంలో దీపావళి అనంతరం వచ్చే చలిగాలులలో వాతావరణంలో మార్పు సంభవించి, మనిషిలోని బద్ధకాన్ని, సోమరితనాన్ని పోగొట్టే రీతిలో మన పండుగలు, ఉత్సవాలు రూపొందించబడ్డాయి.

మృగశిర నక్షత్రంతో కూడిన పౌర్ణమి ఈ మాసంలోనే వస్తుంది కనుక మార్గశిర మాసమనెడి పేరు వచ్చింది. ఇది తెలుగు నెలల్లో 9వ నెలగా వచ్చుటవల్ల 9 సంఖ్య శుభప్రదం కావడంవల్ల, ఈ మాసానికి అత్యంత ప్రాధాన్యత కల్గినది.

ఈ మాసంలో వచ్చెడి 'షష్ఠి' ని సుబ్రహ్మణ్య షష్ఠిగా పంచాంగ కర్తలు పేర్కొనిరి. నాగపంచమి, నాగుల చతుర్థి రీతిలోనే సుబ్రహ్మణ్య షష్ఠిని కూడా సర్పాలను దైవస్వరూపులుగా కొలుచుట ఆనవాయితి. ముఖ్యంగా దేవతల సేనాని అయిన సుబ్రహ్మణ్య స్వామి (కుమారస్వామి)ని ఈ పండుగనాడు కొలుస్తారు. ఈయనకు కార్తికేయుడు, స్కందుడు, షణ్ముఖుడు అనే పలు నామాలు ఉన్నాయి. పాము రూపానికి, సుబ్రహ్మణ్యస్వామికి గల అనుబంధాన్ని ఇలా చెప్పారు. మూలాధారము నుండి సహస్రారము వరకు వెన్నెముక మధ్య నుండి పాము ఆకారములో ఉండే "కుండలినీ శక్తి" గా చెప్పబడే సుషుమ్నా నాడియే సుబ్రహ్మణేశ్వరుడు సమాధిస్థితి యందు పుచ్ఛము (తోక) సహస్రారమునందు, శిరస్సు సహస్రారమునందు ఉండును.

మార్గశిర పౌర్ణమిని దత్తజయంతిగా పరిగణించి, దత్తాత్రేయుని ప్రార్థించడం పరిపాటి.

**"అనసూయాత్రి సంభూత దత్తాత్రేయ మహామతే**
**సర్వదేవాది దేవత్వం మమ చిత్తం స్థిరాకురు"**
అంటూ దత్త స్తవం చేస్తారు.

సౌరమానం రీత్యా మనం మార్గశిరమాసంగా పరిగణించినా, చాంద్రమానం ప్రకారం ధనుర్మాసంగా పేర్కొంటారు. ప్రణవం (ఓంకారం) ధనస్సు వలే ఉంటుంది. కావున మనస్సు అనే వింటినారిని సంధించి, భక్తి అనే బాణంతో భగవంతుని పాదాలను చేరడమే ఈ ధనుర్మాసవ్రత ప్రాశస్త్యం.

గోదాదేవి విష్ణువును అర్చించే నెపంతో, తెల్లవారుఝామున నే మేల్కొని, ఇతర సఖులను (గోపికలను) మేల్కొల్పడం, తిరుప్పావై పాశురాలతో ప్రాతఃకాల పూజా విశేషాలను వివరిస్తూ 30 రోజులు పాటు 30 పాశురాలతో అర్చిస్తుంది. సరిగ్గా 'భోగి' రోజున వ్రతం సమాప్తమై గోదాకల్యాణం జరుగుతుంది.

అకుంఠిత భక్తితో శ్రీరంగనాథుణ్ణే భర్తగా పొందాలనుకోవడం, ఆ కోరిక సిద్ధించుటకు అత్యంత పవిత్ర భక్తితో స్వామిని వరించడం ప్రధాన అంశాలే అయినా, భక్తుల కోరికలను నెరవేర్చడమే భగవంతునికి ఇష్టం అన్న అంశం నిరూపితమైంది. కాత్యాయనీ వ్రతాన్ని కూడా ధనుర్మాసంలోనే ఆచరిస్తారు.

వైకుంఠ ఏకాదశి, పర్వదిన సందర్భంగా ఆలయ ఉత్తర ద్వారం నుండి ప్రవేశించడమే మానవులకు వైకుంఠ ప్రవేశంగా భావించడం పరిపాటి. అటువంటి ఆధ్యాత్మిక పర్వదినం ఈ నెలలోనే వస్తుంది.

ముఖ్యంగా ధనుర్మాసముగా చెప్పబడే ఈ వ్రతకాలంలో పొంగలి, దద్యోదనము వంటి నైవేద్యాలు సమర్పించడం ఆరోగ్య ప్రదంగా చాలా మంచిది. ఉదయాన్నే ప్రసాదంగా తినడం వల్ల జీర్ణశక్తి నేత్ర దృష్టి వృద్ధి చెంది, ఎటువంటి అనారోగ్యం లేకుండా చేస్తుంది. పొంగలిలో ఉపయోగించే పెసరపప్పు, బుధ గ్రహ అనుగ్రహం కొరకు నిర్దేశించబడిన పప్పు దినుసులు, చంద్రుని అనుగ్రహం కొరకు నిర్దేశించబడిన బియ్యము వల్ల శరీరము, బుద్ధి సరియైన రీతిలో పనిచేస్తూ ఆరోగ్యానికి తోడ్పడుతాయి.

ఉదయం, సాయంత్రం గోమయంతో తులసి కోటను అలికి, ముగ్గులతో గొబ్బెమ్మలతో దీపారాధన చేయుట వల్ల ఏర్పడిన వాతావరణంతో మనస్సు ఆహ్లాద కరంగా ఉంటుంది. అందుకే మార్గశిరమాసము మనోరంజకమైన ఆవాసానికి నిలయం.

ఏకాదశి రోజున ఉపవాసము ఆచరించుట కేవలం భక్తి కొరకే కాదు, ఆరోగ్యరీత్యా కూడా చాలా మంచిది. ప్రతి పక్షం రోజులకు (15) ఒకసారి వచ్చే ఏకాదశి నాడు ఉపవాసం చేయడం వల్ల జీర్ణశక్తి పెంపొందింపబడి అనారోగ్యం నుండి రక్షణ లభిస్తుంది.

అందువల్లనే భీష్మ ఏకాదశి, వైకుంఠ ఏకాదశి, తొలి ఏకాదశి, ముక్కోటి ఏకాదశి, శయనైకాదశి, ప్రబోధ ఏకాదశి, ఉత్థాన ఏకాదశి పేర్లతో నెలలో రెండు రోజులపాటు ఉపవాసాన్ని ఆచరించడం మంచిదని, అట్లే జాగరణ చేయడం వల్ల శారీరికంగా, మానసికంగా ఉత్తేజాన్ని పొందెడి లక్ష్యం కూడా దీని వెనుక దాగి ఉన్నది.

గొబ్బెమ్మలను అలంకరించి, ఇలా పాడటం ఆనవాయితి.

**"సుబ్బీగొబ్బెమ్మా, శుభము (సుఖము) వియ్యవే**
**తామర పూవంటి తమ్ముణ్ణియ్యావే**
**చేమంతి పూవంటి చెల్లెనీయవే**
**బంతి పూవంటి బావనీయవే**
**మల్లెపూవంటి మామనీయవే**
**మొగిలిపూవంటి మొగుణ్ణివ్వవే"**

ఇలా చలాకీగా, హుషారుగా పాడుకొనే యువతుల గీతాలతో తెలుగు లోగిళ్ళు మార్మోగుతూ ఉంటాయి.

– సాధన నరసింహాచార్య

**దుష్టుల ఆప్యాయత పగకన్నా ప్రమాదం.**

నిత్యస్మరణీయులు - 2

# ఆదర్శానికి ఆనవాలు అబ్దుల్ కలామ్



"మనమందరం ఒక దివ్యాగ్నితో జన్మించాం. అది మన అంతరాంతరాలలో దాగి ఉన్నది. మన ప్రయత్నాలెప్పుడూ ఆ అగ్నికి రెక్కలొచ్చేలా ఉండాలి. తద్వారా ఈ ప్రపంచమంతా సత్ప్రకాశంతో ఆ వెలుగులో విలసిల్లాలి" అని కాంక్షించిన అమృతమూర్తి డా॥ ఎ.పి.జె. కలామ్.

"ది వింగ్స్ ఆఫ్ ఫైర్" అన్న పేరుతో డా॥ ఎ.పి.జె. కలామ్ గారి జీవితానుభవాలను రంగరించి, భారతీయ విలువలకు సజీవ ప్రతీకగా మనముందుంచారు వారి సహోద్యోగి శ్రీ అరుణ్ తివారీ. దానిని మన కోసం తెలుగులోకి అనువదించారు డా॥ వాడ్రేవు చిన వీరభద్రుడు "ఒక విజేత ఆత్మకథ" పేరుతో. అందులోని అనర్ఘ రత్నాలను మనం ఏరుకొని, కనీసం కొన్ని మంచి అలవాట్లైనా అలవర్చుకొనే ప్రయత్నం చెయ్యాలి. అదే మహనీయుల ఆత్మకథల అంతర్యం.

తాను నమ్మిన సిద్ధాంతానికి, లక్ష్య సాధన కొరకు ప్రాణాలను సైతం అర్పించగలిగే నిర్భరత, గాంధీజీకి ఉంది. నమ్మిన సత్యాన్ని నిరంతరం స్మరిస్తూ, ఆ సత్యాన్ని శోధిస్తూ, తన జీవితాన్నే సత్య శోధనకి అంకితం చేసిన అసలైన మహాత్ముడు గాంధీజీ. అందుకే ఆయన ఆత్మకథ 'సత్యశోధన' గా (An experiment with Truth) చరిత్రలో నిలిచిపోయింది.

నిరుపేద యువతకు ఓదార్పునిచ్చే చుక్కాని ఈ అబ్దుల్ కలామ్ గారి ఆత్మకథ. నేటి యువత దార్శనిక స్పష్టత లేకపోవడం, దిశానిర్దేశనం లేని కారణంగా, నిరాశ, నిస్పృహలకు గురి అవుతోంది. అటువంటి యువతకు వారి జీవితంలో ఎదురైన పరిస్థితులు, వారికి మార్గదర్శనం చేసిన మహనీయులను గురించి తెలియచేయడమే డా॥ ఎ.పి.జె. కలామ్‌గారి "విజేత ఆత్మకథ" లక్ష్యం.

గాంధీజీ రాట్నం గురించి మాట్లాడినా, కలాం రాకెట్ గురించి తెలియ చేసినా, ఈ రెండూ రెండు భిన్న దృక్పథాలను సూచిస్తున్నా, వారి ఆలోచనా తీరు ఒకటే. నీ స్వాతంత్ర్యం నీ చేతుల్లోనే ఉంది. నీ మార్గాన్ని (టెక్నాలజీ) నువ్వు రూపొందించుకోకపోతే, బాహ్య శత్రువుతోబాటు, అంతశ్శత్రువును కూడా జయించడం చాలా కష్టతరం అవుతుంది. నీ ప్రపంచం, శత్రు రహితం కావాలంటే నీ దృక్పథాన్ని ఆధ్యాత్మికతతో ముడిపెట్టినప్పుడే విజేతవు కాగలవు అన్న హెచ్చరిక కూడా స్పష్టంగా అగుపిస్తోంది.

సైన్స్‌ను, ఆధ్యాత్మికతలను సమన్వయము చేసుకుంటూ, తన జీవన మార్గాన్ని నిర్దేశించుకోవాలి. సైన్సు మానవుని సత్యతృష్ణకు, జ్ఞానార్జనకు ఆధారం కావాలి. సైన్సు, అంటే సాంకేతిక పరిజ్ఞానం. అది టెక్నాలజీగా పరివర్తనం చెందుతుంది. టెక్నాలజీ అంటే కేవలం యంత్రాలు, కర్మాగారాల పని విధానంగా అనేకమంది భావిస్తారు. కానీ ప్రతివ్యక్తి తన జీవన మార్గంలోని వృత్తి, ప్రవృత్తులను సమన్వయం చేసుకుని, తన ఎంచుకున్న రంగంలో పరిణామాలకు, పురోగతికి తోడ్పడే జ్ఞానదీపమే టెక్నాలజీ అంటారు డా॥ ఎ.పి.జె. కలామ్.

'అవుల్ పకీర్ జైనులాబ్దిన్ అబ్దుల్ కలామ్' అన్నది కలామ్ గారి అసలు పేరు. అదే మనకు ఎ.పి.జె. కలామ్‌గా చిరపరిచిత మైంది.

1931 అక్టోబర్ 15న ప్రాచీన మద్రాసు రాష్ట్రంలోని రామేశ్వరం ద్వీప పట్టణంలో జైనులాబ్దీన్, అశియమ్మ దంపతులకు జన్మించారు అబ్దుల్ కలామ్. తల్లిదండ్రులు విద్యాధికులు కాకపోయినా, వారికి గల విజ్ఞత, ఔదార్యము అనే నేపథ్యం కలామ్ గారి సంస్కారానికి, సత్ప్రవర్తనకు మూల కారణాలయ్యాయి. రామేశ్వరం మసీదు వీధిలో గల సాధారణ కుటుంబంలో జన్మించారు. ఆర్థిక పరమైన ఆటుపోటులెన్నున్నా కనీస అవసరాలకు, అన్న వస్త్రాలకు లోటులేకుండా, చూసేవారు కలామ్ తల్లిదండ్రులు. రామేశ్వరంలోని ప్రసిద్ధ శివాలయానికి చేరువలోనే ఉండేది కలామ్ జన్మించిన ఇల్లు. అందువల్ల హిందూ కుటుంబ పరిసరాలు, సహజీవనం కూడా కలామ్ ఉత్తమ ప్రవర్తనకు దోహదపడ్డాయి.

రామేశ్వరం దేవాలయ ప్రధాన అర్చకులు లక్ష్మణ శాస్త్రిగారితో తండ్రికి గల స్నేహం, వారిద్దరూ కలిసి చర్చించుకునే ఆధ్యాత్మిక విషయాలు, రెండు మతాల మధ్య అంతరాలు లేవని, అవి సమాంతరంగా పయనించే మానవతా వాదానికి బాటలు వంటివని అర్థమయ్యేవి.

ప్రతిరోజూ తండ్రితో సాయంత్రం మసీదులో ప్రార్థనాలు చేయడం ఆ తర్వాత తన తండ్రి ఎందరో రోగగ్రస్తుల కోసం ప్రార్థన చేసి మంత్రించిన జలాన్ని ఇవ్వడం, ఆ ప్రార్థనల ప్రభావంతో కొందరి రోగాలు నయమయ్యి, తండ్రికి కృతజ్ఞతలు తెల్పేవారితో, కలామ్ ఇల్లు సందడిగా ఉండేది. అయితే ఆయన

**అన్ని వేళలా గంభీరంగా ఉంటే సరిపోదు. అప్పుడప్పుడు నక్కజిత్తులు కూడా అవసరమవుతాయి.**

తండ్రి మాత్రం ఆ కృతజ్ఞత తనకు చెందదని, అది అల్లాకు అర్పించమని చెబుతూ ఉండడం కలామ్‌లో కర్మనిష్టకు, దైవ చింతనపట్ల నమ్మకాన్ని పెంపొందింపచేసాయి.

కలామ్‌కు ఆరేళ్ళ వయస్సు ఉండగా కలామ్ తండ్రి పడవ లను తయారుచేసే వృత్తిలో ఉండేవారు. ఆయనకు కలామ్ బావ (సోదరి భర్త) అహ్మద్ జలాలుద్దీన్ సహాయం చేసేవాడు. అతడే కలామ్‌కు ప్రియ మిత్రుడు. రోజూ సముద్ర తీరాన నడుచు కుంటూ, ఎన్నో ఆధ్యాత్మిక విషయాలను చర్చించుకునేవారు. కలామ్ బాగా చదువు కోవడానికి జలాలుద్దీన్ స్ఫూర్తి నిచ్చాడు. ఆనాటి పరిస్థితులలో ఇంగ్లీషులో చక్కగా వ్రాయగలిగే వ్యక్తి జలాలుద్దీన్ ఒక్కడే. సమకాలీన సాహిత్యం, వైద్య విజ్ఞాన పరిణామాలు గురించి విశేషంగా చర్చించడం కలామ్‌కు నవ్య ప్రపంచ ధోరణిని నిగూఢ విశ్లేషణాత్మకతను వృద్ధి చేసాయి.

కుటుంబ ఆర్థిక స్థితిగతులు అంతంత మాత్రంగా ఉన్న రోజులలో ఎస్.ఆర్.టి. మాణిక్యం అనే జాతీయ వాది యొక్క గ్రంథాలయం కలామ్‌కు తరగతి విజ్ఞానంతోబాటు, సామాజిక విజ్ఞానం కల్గించింది.

"దినమణి" పత్రికలోని బొమ్మలు చూస్తూ, కొంచెం, కొంచెం ఇ.వి.రామస్వామి నాయకర్, పెరియార్‌లు చేస్తున్న రాజకీయ ఉద్యమం గురించి వాడిగా, వేడిగా చర్చలు జరుగుతుండేవి. వాటిలో కలామ్ ఉత్సాహంగా వింటూ పాల్గొనేవాడు.

రెండవ ప్రపంచ యుద్ధం కారణంగా రామేశ్వరంలో రైళ్ళు ఆగడం మానేసాయి. అందువల్ల న్యూస్ పేపర్ కట్టలను రామేశ్వరం ధనుష్కోటి మధ్యన గల రోడ్డు పైకి, రైలు నుండి విసిరివేసేవారు. అపుడు శంషుద్దీన్ (దగ్గరి బంధువు) న్యూస్ పేపర్ పంపిణీదారుడు కావడంతో అతనికి సహాయంగా కలామ్ ఉండి, పేపర్లను పంచుతూ మొదటిసారి కష్టార్జితాన్ని చవిచూసి, ఎంతో మానసిక ఆనందాన్ని పొందాడు.

కలామ్‌కు ముగ్గురు సోదరులు, ఒకసోదరి, అంటే ఐదుగురు పిల్లలు, తల్లిదండ్రులతో కలిపి మొత్తం ఏడుగురు సభ్యులు ఉండటం, నిత్యం బంధుమిత్రుల రాకపోకలతో ఆర్థిక పరిస్థితి క్లిష్టంగా తయారయ్యింది.

కలామ్‌కు బాల్యమిత్రులైన రామనాథశాస్త్రి, అరవిందం, శివప్రకాశన్‌లు సాంప్రదాయక హిందు, బ్రాహ్మణ కుటుంబీకులు కావడం వల్ల ప్రతి సంవత్సరం జరిగే సీతారామకళ్యాణ ఉత్సవంలో 'రామతీర్థ' కొలనుకు ఉత్సవ విగ్రహాలను పడవలలో చేర్చే బాధ్యత కలామ్ కుటుంబానికి ఉండడం వల్ల ఇతర మతాలు, ముఖ్యంగా హైందవ ధర్మం పట్ల గౌరవం, మత సహనం అనే లక్షణాలు చిన్ననాటి నుండే అలవడ్డాయి.

పాఠశాలలో కూడా శివ సుబ్రహ్మణ్య అయ్యర్ అనే ఉపాధ్యాయుడు ఇచ్చిన ప్రోత్సాహం, జీవిత గమ్యాన్ని, లక్ష్యాన్ని నిర్దేశించుకునే శక్తిని ఇచ్చింది. విద్యార్థులలో సామాజిక తారతమ్యాలను లేకుండా చేసిన పురోగమవాది ఆయన.

ఒక సందర్భంలో ఆయన కలామ్‌కు ఇలా మార్గదర్శనం చేసాడు. "సమాజంలో దురాచారాలను రూపుమాపడానికి ప్రయత్నించినపుడు కొన్ని చేదు అనుభవాలు కలుగక మానవు. వాటికి ఎదురీదినప్పుడే నువ్వు నీ లక్ష్యాన్ని చేరుకోగలవు".

రామనాథపురం జిల్లా క్షేత్రంలోని ష్వార్జ్ పాఠశాలలో చేరాలనుకొన్నపుడు, కలామ్ తండ్రి మాటలు అతనిపై ఎంతగానో ప్రభావితం చేసాయి. సముద్రపు పక్షి ఎటువంటి గూడులేక పోయినప్పటికీ, సూర్యునికి ఎదురుగా ఎగిరినట్లే, మనిషి కూడా, పుట్టిన ఊరుపై మమకారాన్ని తగ్గించుకుని, ప్రగతి పథం వైపు పయనించాలి". తల్లి కూడా సంశయిస్తూ ఉంటే ఆమెను కలామ్ తండ్రి ఇలా ఓదార్చాడు "పిల్లలకు తల్లిదండ్రులు ప్రేమను ఇవ్వగలరేమో కానీ, ఆలోచనలను కాదు. పిల్లల ఆలోచనలు పిల్లలకు ఉంటాయి. కాబట్టి పిల్లల అభివృద్ధికి పెద్దల ప్రేమ అవరోధం కాకూడదు. పెద్దల అవసరాలు పిల్లల చదువుకు ఆటంకం కారాదు" అని ప్రతి తల్లి, తండ్రి అలా భావించినపుడే పిల్లలు కలామ్ వంటి జాతిరత్నాలుగా తయారవుతారు.

తండ్రి కలామ్‌ను జిల్లా కలెక్టర్‌గా చూడాలని ఆశించాడు. ఆ ఆశయాన్ని అర్థం చేసుకున్న కలామ్ తన బెంగను, పాఠశాల మారినప్పటికీ క్రొత్త వాతావరణం పట్ల గల భయాలను పోగొట్టుకుని చదువుదారిలో పడ్డాడు.

ఆ చదువు వైనాన్ని వచ్చే సంచికలో తెలుసుకుందాం.

– సాధన నరసింహాచార్య

## ఎవరు ఎక్కువ సౌభాగ్యశాలి

*సీతారాములతో పాటు లక్ష్మణుడు కూడా వనవాసానికి బయలుదేరటంతో లక్ష్మణుని భార్య, తల్లి కూడ అతడు వారివెంట వెళ్ళటం పట్ల తమ ఆనందాన్ని వ్యక్తం చేశారు. సీత కంటే ఊర్మిళ, కౌసల్య కంటే సుమిత్ర, రాముని కంటే లక్ష్మణుడు – ఈ త్యాగభావన వల్లనే లోకమంతటిచేత కొనియాడబడ్డారు. ఇటువంటి సౌభాగ్య లాభాన్ని ముగ్గురిలో ఏ ఒక్కరు కూడా వదలుకోలేదు. అంతేకాదు ఎవ్వరికైనా సరే జీవితంలో ఇటువంటి అవకాశాలు లభిస్తే వాటిని వదులుకోవద్దని తమ జీవితాల ద్వారా సందేశాన్ని అందించారు.*

*– ప్రజ్ఞాపురాణం నుండి*

**అన్నింటికీ దేవుడే ఆధారమన్నట్లు ప్రార్థించు. మొత్తం నీ మీదనే ఆధారపడినట్లు పనిచెయ్యి.**

# యుగ ఋషి, వేదమూర్తి పండిత శ్రీరామశర్మ ఆచార్య జన్మశతాబ్ది మహోత్సవములపై ఒక సమీక్ష

యుగ ఋషి, వేదమూర్తి, పండిత శ్రీరామశర్మ ఆచార్య జన్మశతాబ్ది మహోత్సవములకు సంబంధించిన భూమిపూజ, వేదిక మరియు ఆవాస తదితర నిర్మాణములు అక్టోబరు మాసము మొదటివారము నుండి ప్రారంభించిరి. భారతావని నలుమూలల నుండి ముఖ్యంగా రాజస్థాన్, ఛత్తీస్‌ఘడ్, మధ్యప్రదేశ్, ఒరిస్సా, గుజరాత్, మహారాష్ట్ర, జార్ఖండ్ మున్నగు రాష్ట్రముల నుండి వేలాది మంది గాయత్రీ పరివార్ స్వచ్ఛంద కార్యకర్తలు శ్రమదానమిచ్చిరి. జన్మశతాబ్ది వేడుకల ప్రారంభ ఘడియలు సమీపించే కొలది కార్యకర్తల సంఖ్య దాదాపు లక్షకు చేరినది. వీరంతా నేలను శుభ్రపరచి, కార్యకర్తలు నిద్రించుటకు అనువుగా నేలను తయారు చేసిరి. అట్లే వంటశాలలలో నేలను శుభ్రపరచుట, రహదారులు నిర్మించుట, టెంట్లలో పరివార్ సభ్యులు విశ్రమించుటకై కార్పెట్లు, ప్లాస్టిక్ షీట్లు పరచుట మున్నగువానిని పూర్తి చేశారు. అట్లే టెంట్లలో లైటింగ్, వంటశాలలలో లైటింగ్ నీటి సరఫరా వ్యవస్థ వంటి సదుపాయాలు పూర్తి చేశారు. జన్మశతాబ్ది వేడుకలకై విచ్చేయనున్న లక్షలాది జనవాహిని ప్రశాంతంగా కదిలిపోవుటకై గంగానదిలోని ద్వీపాలను, ప్రధాన రహదారిని కలుపుచూ నాలుగు తాత్కాలిక సేతువులను (బ్రిడ్జిలను) నిర్మించారు. దీనిలో యజ్ఞశాలను చేరుకొనుటకు ఉద్దేశించిన దానికి రామ సేతువని నామకరణం చేశారు. పై కార్యకలాపాలనన్నింటిని శాంతికుంజ్‌లోనున్న జోనల్ సమన్వయ కార్యాలయ సారథి గారైన ఆదరణీయ శ్రీ కాళీచరణ్ గారి పర్యవేక్షణలో అంతా నిర్మింపబడినది.

ఆసేతు హిమాచలం నుండి కన్యాకుమారి వరకు గల పూజ్య గురుదేవుల శిష్యులు, అభిమానులు, ఆరాధకులు, నివాసం ఉండుటకై దాదాపుగా 5500 గుడారాల నిర్మాణం జరిగింది. వీని మధ్య రాకపోకలకనువుగా విశాలమైన రహదారులు నిర్మించారు. సౌకర్యవంతంగా చలికి తట్టుకుని, విశ్రమించుట కనువుగా గుడారాలలోపల తివాచీలను పరచారు. చుట్టూరా గుడ్డతో గుడారాలను మూసివేశారు. వీరందరికి స్నానపానాదులకు, కాల కృత్యముల తీర్చుకొనుటకై కావలసిన వసతులను వేల సంఖ్యలో నిర్మాణం చేశారు.

గంగానదిలోని హరిద్వార్ సమీపములో గల వివిధ ద్వీపాలను 13 విభాగాలుగా విభజించి వివిధ నగరాలను నిర్మించారు.

యావత్ భారతావనిలోని పరిజనులు ఆయా నిర్దేశిత ప్రదేశాలలో ఉండుటకై తగిన వసతి ఏర్పాట్లు చేసి, ఆయా ప్రదేశాలకు మహర్షుల పేరిట నామకరణం చేశారు. "మేరా భారత్ మహాన్" అని అలనాడు దూరదర్శన్‌లో చూపెట్టిన విశిష్ట ప్రదర్శన వాస్తవ రూపంలో నేడు సర్వులకు అనుభవంలోనికి వచ్చి "ఇదేనా మహోన్నత భారతదేశం" గా అందరి కళ్ళముందు సాక్షాత్కరించింది. భారతదేశంలోని విభిన్న సంస్కృతులు, జాతులు వివిధ జాతులు, వేష భాషణలు కలగలిసి పూజ్య గురుదేవులు చెప్పినట్లుగా ఒకే భాష (గాయత్రీ భాష), ఒకే మతం (గాయత్రీ మతం), ఒకే కరెన్సీ (వినిమయం) ఈ జన్మశతాబ్ది వేడుకలలో దర్శనమిచ్చింది.

అన్ని జాతులు, సంస్కృతులవారు, సోదరభావంతో, మిత్ర భావంతో ఒకరు మరొకరికి ఆతిథ్యమిస్తూ, రుచులు చూపిస్తూ, కలసి మెలసి పూవుల్లో దారంలా కలసిపోయారు. గంగామాత ఒడిలో, హిమాలయాల నీడలో, పవిత్ర వాతావరణంలో, దేవీ దేవతా సమక్షంలో విడిది చేశారు.

యజ్ఞశాలను గరుడపక్షి ఆకారంలో నిర్మించిరి. తత్ఫలితంగా యజ్ఞశాలలో కూర్చున్న ప్రతిఒక్కరు యజ్ఞబ్రహ్మను సందర్శించెడి అవకాశం లభించింది. అట్లే ప్రధానద్వారముల రెండింటిని, హిమాలయాలలోని ఛార్‌ధామ్‌గా పేరొందిన నాల్గింటిలో రెండైన బదరీనాథ్ మరియు కేదారనాథ్ దేవాలయాలు ప్రతిబింబించేలా ఏర్పాటు చేయుట ప్రధాన ఆకర్షణ.

## ఐతిహాసిక కలశయాత్ర

06.11.2011 భగీరథుడు, విశ్వామిత్రుడు, యాజ్ఞవల్క్యుని స్థాయి గల ఈ యుగపు ఋషి పరమపూజ్య గురుదేవులు పండిత శ్రీరామశర్మ ఆచార్య జన్మశతాబ్ది మహోత్సవం ఐతిహాసిక కలశయాత్రతో శుభారంభం జరిగింది. యజ్ఞశాలలో వైదిక విధి విధానంతో దివ్య కలశములలో దైవీశక్తుల ఆవాహనం 24 మంది కన్యల ద్వారా జరిపించబడింది. ఈ కార్యక్రమంలో ఆదరణీయ శైలదీదీ, ఆదరణీయ డాక్టర్ సాహెబ్‌తోపాటు కేంద్రమంత్రి శ్రీ హరీష్ రావత్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు.

తరువాత 24000 కలశములతో ఐతిహాసిక కలశయాత్ర హరిద్వార్ ముఖ్య వీధుల గుండా జరిగింది. ఈ కలశయాత్ర ఎంత శోభాయమానంగా ఉన్నదంటే దాని గురించి చెప్పడానికి మాటలు చాలవు. ఎక్కడ చూచిన పసుపే పసుపు. ఎక్కడ చూచిన

**నువ్వు ఉత్సాహంగా తిరుగుతూ ఉంటే మొత్తం దేశమే నీ నేస్తమవుతుంది.**

కలశములే కలశములు. ఇలాంటివి ఎన్నడూ చూడలేదు. చూచేవారికి భగవంతుని పొలంలో చామంతి పూలు విరగ పూసినవా అని అనిపించింది. ఈ అద్భుతమైన కలశయాత్రలో ఫ్రాన్స్, టాంజనియా, సౌదీ అరేబియా, ఆస్ట్రేలియా, న్యూజిలాండ్ మొదలైన దేశాల ప్రజలు కూడా తమ తమ దేశాల పతాకములతో, బ్యానర్స్‌తో అత్యంత ఉత్సాహంగా పాల్గొన్నారు.

యుగ యాజ్ఞవల్క్య పరమపూజ్య గురుదేవుల జన్మశతాబ్ది మహోత్సవంలో 1551 కుండముల గాయత్రీ మహాయజ్ఞం యొక్క శుభారంభము 07.11.2011 దేవపూజనంతో ప్రారంభించ బడింది. దేవపూజన కార్యక్రమంలో సుమారు 5000 మంది దంపతులు పాల్గొన్నారు. 40 మంది సదస్సుల ద్వారా గీత సంగీతమయ కర్మకాండ అత్యంత భావనాత్మకమైనది. ఈ కార్యక్రమ ముఖ్య సంచాలకులు డా॥ ప్రణవ్ పండ్యాగారు దేవశక్తులను గురించి చెప్తూ ఆ శక్తులను ఆవాహనం చేశారు. ఉదయపు మొట్టమొదటి సూర్యకిరణములు తనువు మీద పడినపుడు పులకించిన విధంగా గురుదేవుల అనుదాన వరదానాలు ఉపాసకులపై వర్షించాయి. ఈ అనుభూతి శబ్దాతీతమైనది, జీవితాంతం గుర్తుండిపోయేది. ఉద్గాతల వాద్య సంగీతం వాతావరణంలో అలౌకిక దివ్యత్వాన్ని ప్రసరింపజేసింది.

జన్మశతాబ్ది మహోత్సవ విశాలమైన యజ్ఞశాలలో వేరేవేరు వేదికలపై దేవశక్తుల పూజ, ప్రతిష్ఠ నిర్వహించబడింది. సర్వతోభద్ర మండలంలో 33 కోట్ల దేవశక్తులతో పాటు ఆద్యశక్తి, యజ్ఞ పురుషుడు, జ్యోతి పురుషుని, సప్తర్షి మండలం, నవ గ్రహములు విశిష్ఠ వ్యక్తుల ద్వారా దేవపూజన కార్యక్రమం నిర్వహించబడింది.

ముందుగా ఉత్తరాఖండ్ ముఖ్యమంత్రి శ్రీ భువనచంద్ర ఖండూర ప్రభుత్వం తరపున దేశ విదేశ పరిజనులకు స్వాగతం పలికారు.

పరమపూజ్య గురుదేవుల, పరమ వందనీయ మాతాజీల పాదుకలకు ఆదరణీయ శైలదీదీ, ఆదరణీయ డా॥ ప్రణవ్‌పండ్యా పూజ చేశారు. తరువాత కౌస్తుభమణి సహాయంతో సూర్యరశ్మి ద్వారా అగ్ని ప్రజ్వలన చేసి యజ్ఞాశ్వమును ప్రవేశపెట్టారు (అశ్వము శక్తికి ప్రతీక). ఈ అగ్నియే అన్ని కుండలములలో స్థాపించబడింది.

ఈ మహాయజ్ఞములో రాష్ట్ర శక్తి (దేశ) సంవర్ధన కొరకు, మానవుల కళ్యాణం కొరకు, విశిష్ఠమైన ఆహుతులు సమర్పించబడ్డాయి. గాయత్రీ మహామంత్రం, మహా మృత్యుంజయ మంత్రంతోపాటు దేవ సంస్కృతి దిగ్విజయ యాత్ర కొరకు, ఋషి పరంపర సంవర్ధన కొరకు, సర్వ మానవుల శ్రేయస్సు కొరకు, ప్రదూషణ నివారణ కొరకు, పర్యావరణ పుష్టికి, సృజన శక్తి సంవర్ధన కొరకు, సమృద్ధి కొరకు ప్రత్యేక ఆహుతులు సమర్పించ బడ్డాయి.

యజ్ఞం యొక్క రెండవరోజు (07.11.2011) సుమారు రెండు లక్షల మంది యజ్ఞ ఆహుతులు సమర్పించారు. సుమారు 40000 – 50000 మంది గాయత్రీ మంత్ర దీక్ష స్వీకరించారు. ఇంకా వేరొకచోట నిర్వహించబడిన సంస్కారశాలలో కూడా సుమారు 10000 మంది మంత్ర దీక్ష స్వీకరించారు.

అట్లే పూజ్యగురుదేవుల భారీ విగ్రహం ఆశీర్వదించుచున్నట్లుగా రూపొందించి ఏర్పాటు చేయుట ఒక ప్రత్యేక ఆకర్షణ.

ప్రతిసారి పుణ్యకార్యక్రమాలు జరిగెడివేళ, మిక్కిలి విశేషముగా యుగపరివర్తనదిశగా జరిగెడి మార్పు సమయము లందు అసురీశక్తులు చురుకుగా పనిచేస్తూ, ప్రతిబంధకములు కల్పించుట సర్వసాధారణ విషయం. అదేవిధముగా నవంబరు 6 మొదలుకొని 8 వరకు, అసురీశక్తులు స్త్రీల మెడలోని మంగళ సూత్రములు హారముల తస్కరించెడి దిశగా, గాయత్రీ పరివార్ ప్రవాహములో కలిసిపోయి, స్త్రీల గొంతు నులిమి, హారములు కత్తిరించిరి. తత్ఫలితముగా ఈ అసాంఘిక శక్తుల కబంధ హస్తముల నుండి తప్పించుకొనలేని వయోభారముతో శక్తి హీనులైన స్త్రీలు శ్వాస ఆడక అసువులు బాయుట జరిగినది. కొన్ని లక్షల సంఖ్యలో పాల్గొనిన గాయత్రీ పరిజనులు ఉత్సాహముగా, క్రమబద్ధముగా, కార్యక్రమములలో, పాలుపంచు కొనుట అత్యంత ముదావహం.

దీనికి ఉదాహరణగా హరిద్వార్‌లోని రక్షకభటుడు శ్రీ ముఖేష్ చంద్ర మాటలలో "జన సమూహం భారీగా ఉన్నది. అయిన ప్పటికి, తదితర మేళాలలో పాల్గొనెడివారికి, ఈ కాషాయ వస్త్రాలు ధరించిన గాయత్రీ పరివార్ సమారోహానికి మధ్య ఎంతో వ్యత్యాసమున్నది. గాయత్రీ పరివార్ సమూహం, తదితర సమూహాల వలె తోపుడు, త్రొక్కిసలాటలతో కాక, అత్యంత భక్తి శ్రద్ధలతో క్రమశిక్షణతో మెలగుచూ లక్ష్యసాధనతో, ప్రేరణాదిశగా నడచుచున్నది" అని చెప్పారు.

గంగానది ద్వీపములలో జరిగిన పనులను చూచి, అచ్చట శుభ్రతను చూచి జిల్లా కలెక్టర్ మరియు తదితర జిల్లా అధికారులు తమ ఆశ్చర్యాన్ని వెళ్ళబుచ్చారు. గంగానది పుష్కరాల సమయ మందు దాదాపుగా 550 కోట్ల రూపాయలకు పైగా వెచ్చించి గంగానది ద్వీపాలను పరిశుభ్రం చేయగా, ఇంత చక్కగా రాలేదు. ప్రభుత్వం నుండి ఒక్కపైసా ఆర్థిక సహాయం కోరకుండా ఇంత

**ఎప్పుడు పడుకుని ఉంటే నీ చాపే నిన్ను ఏవగించుకుంటుంది.**

గొప్పపనిని గాయత్రీ పరివార్ చేయుట అత్యంత ప్రశంసనీయం అని ప్రకటించిరి.

నవంబరు 5వ తేది దక్షిణ భారత భోజనాలయం, బాలాజి భోజనాలయం సాయంత్రం ఆదరణీయ గౌరీశంకర శర్మగారి చేతులమీదుగా ప్రారంభించబడింది. ఆ రోజున శ్రీ అశ్విని సుబ్బారావుగారు ఆదరణీయ డా॥ బ్రిజ్‌మోహన్‌గౌర్‌జీ, ఇతర రాష్ట్రాల గాయత్రీ పరివార్ ప్రముఖులందరూ కార్యక్రమానికి పదుల సంఖ్యలో విచ్చేసి ఆంధ్ర వంకటాలను రుచిచూచిరి. యావత్ భారత గాయత్రీ పరివార్ ఆంధ్ర వంటకాల రుచి చూచుటకై ఎదురు చూచుచున్న క్షణాలు ఎదురైనాయి. మొత్తం 11 రకాల వంటలతో ఆహుతుల జిహ్వను సంతృప్తిపరచిరి. ఆదరణీయ డా॥ ప్రణవ్ పండ్యా మరియు ఆదరణీయ శైలాబాలా జీజీలకు కూడా ఆంధ్ర వంటకాలను రుచి చూపించుట జరిగింది. పూటకు 5వేల మందిచొప్పున అనునిత్యము దక్షిణ భారతీయుల తోపాటు ఉత్తరాది రాష్ట్రాల వారు కూడా మన వంటకాలను ఆస్వాదించుట జరిగింది.

గాయత్రీ జ్ఞానాన్ని, మంత్రాన్ని, యజ్ఞాన్ని ప్రప్రథమంగా ఆంధ్రప్రదేశ్ ప్రజానీకానికి పరిచయం చేసిన పూజ్యులు డా॥ మారెళ్ళ శ్రీరామకృష్ణ మాష్టారు నవంబరు 8వ తేది సాయంత్రం హరిద్వార్ చేరుకొన్నారు. అటుపిమ్మట, రహదారిలో జనం తాకిడికి వాహన మార్గం మూతపడగా, మాష్టారు కాలి నడకన, కొంతదూరం, మరికొంత దూరం ఆటోలో ప్రయాణం చేసి, ఆది శంకరాచార్య నగరంలోని బాలాజీ భోజనాలయానికి విచ్చేసి అందరిని ఆనందంలో ముంచారు. వారి దర్శనంతో ఆంధ్రదేశ పరివారమంతా పులకించిపోయి, చలిని లెక్క చేయకుండా వచ్చివారి ప్రవచనం వినాలని భోజనశాలలో సమావేశమైనారు.

పూజ్యులు డా॥ మారెళ్ళ మాష్టారి ప్రసంగం ఈ విధంగా సాగింది. వారి మాటలలో – "ఒక భయంకర విస్ఫోటన పరిస్థితు లందు మానవాళి నేడు పయనించుచున్నది. దీనిని చెప్పవచ్చో, చెప్పకూడదో కాని, నాకు చెప్పాలనిపిస్తున్నది. 1970 ప్రాంతంలో ఇద్దరు మహా పురుషులు, ఒకరు పూజ్యగురుదేవులు పండిత శ్రీరామశర్మ ఆచార్యవర్యులు, రెండవవారు పుట్టపర్తి నివాసి సత్యసాయిబాబాగార్లు దక్షిణాఫ్రికా దేశాన్ని సందర్శించుట జరిగింది. అచ్చటనున్న దుష్టశక్తులను సంస్కరించి మంచి వారినిగా మార్చుట వారి సంకల్పము – దీనిలో అంతర్భాగంగా వారు కొన్ని తాంత్రిక కార్యక్రమాలను చేపట్టారు. పూజ్య గురుదేవులు ఓడలో ప్రయాణించారు. ప్రయాణ సమయమందు ఓడ సారథి నుండి ఆఫ్రికన్ భాషను అభ్యసించి, దానిలో ప్రావీణ్యాన్ని పొందారు. ఆఫ్రికాదేశంలో ప్రయాణిస్తూ ఉండగా ఒకరోజు వీరు ప్రయాణిస్తున్న బస్సును, మానవుల చంపి వారి మెదడును భక్షించెడి సమూహము అడ్డగించింది. గురుదేవులు బస్సును దిగి ఆ పాశవిక మనుష్యులతో వారి భాషలో మాట్లాడి, వారు చేసెడి పని మానవజాతికి ఎంతటి కళంకమునాపాదించుచున్నదో వారికి తెలియజెప్పి, ఒప్పించి, వారికి కనువిప్పు కల్గించి, ఆ సమూహాన్ని సన్మార్గంలో ప్రవేశింపజేసిరి. నాటి నుండి అచ్చటి ప్రజాజీవనంలో ఒక నూతన పరివర్తన ప్రవేశించింది. వారిలో దైవగుణాలు వికసితమయ్యాయి. అచ్చట వ్యాప్తిలోనున్న దుష్ట తాంత్రిక విద్యలకు పరిసమాప్తం పలికించారు.

పై ఘటనలో భాగంగా ఈ రోజు జరిగిన సంఘటనను విశ్లేషించి చూడాలి. దేవాసుర శక్తుల మధ్య సమరం సూక్ష్మ జగత్తులో జరుగుచున్నది. నేడు అసురీశక్తులు విజృంభించాయి. కొంత నష్టాన్ని కల్గించాయి. అంతిమ విజయం దేవతలదే. మీ అందరికీ తెలుసు పూజ్య గురుదేవులు స్కైల్యాబ్ భూమిపై పడి జననష్టము సంభవించకుండా చూచి, దానిని సముద్రపు నీటిలో పడేలా చేశారు. అట్లే భారత్ పాక్ యుద్ధ సమయంలో 1971లో అమెరికా సప్తమ నౌకాదళమును భారత సరిహద్దులను చేరుకోకుండా మార్గమధ్యంలోనే వెనుత్రిప్పి పంపించారు. కావున నేటి ఈ సంఘటన అతిస్వల్పమైనది. రానున్న మార్పులకిది ఒక సంకేతం. రానున్న 5 లేక 6 మాసాలలో విశ్వంలో అనేక మార్పులను మీరు చూడబోవుచున్నారు. ఆధ్యాత్మిక జగతిలో, జీవనంలో మీ సమర్పణే ప్రదానం. అప్పుడు గురుదేవులు తమ పనిని అత్యంత సులువుగా చేసేస్తారు.

ఇలాంటి యజ్ఞం మళ్ళీ రాదు. మీరంతా మహాభారత సంగ్రామంలోని అర్జునుడులా మారి వెళ్ళుచున్నారు. రామాయణం లోని హనుమంతునిలా వెళ్ళుచున్నారు. రానున్న డిశంబరు మాసంలో గీతాజయంతికి ఒక అద్భుత సాధనను మీకు అందిస్తాను. పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వామి తమ కాలజ్ఞానంలో నిత్యపూర్ణిమను ప్రస్తావించిరి. దానిని నేను మీకు అందిస్తాను. సూర్యకిరణాలు చంద్రునిపై ప్రసరించి కళలుగా వస్తాయి. బ్రహ్మవర్చస్సు చాంద్రాయణ వ్రతమే దీని పేరు. ఋషి మొదట దీనిని చేస్తాడు. పూర్ణిమనాడు 16 ముద్దలతో ప్రారంభించిన భోజనాన్ని అమావాస్యనాడు పూర్తిగా తీసుకొన కుండా మానివేస్తాడు. తిరిగి పాడ్యమినాడు ఒక్కొక్క ముద్ద పెంచుకుంటూ పౌర్ణమి నాటికి తిరిగి 16 ముద్దలు స్వీకరిస్తాడు. దీనితో సాధకుని ఆలోచనలు సన్మార్గంవైపు పయనిస్తాయి. అతరి ఆచరణ, వాక్కు కూడా మారుతాయి. క్రాంతిధర్మిసాహిత్యంలోని 2వ పుస్తకంలోని 42వ పేజిలో ఇవ్వబడిన సూర్యధ్యానం చాలా ముఖ్యమైనది, ప్రతిరోజు చెయ్యాలి. ఆంధ్రప్రదేశ్‌లో అనేకచోట్ల రహదారుల వెంట

**ఆచరణలేని ఆలోచన, ఆలోచనలేని ఆచరణ రెండూ ఓటమికి రహదారులే.**

భారీ ఎత్తున ఆంజనేయుని విగ్రహాలు రూపుదాల్చాయి. హనుమంతుడు శక్తికి ప్రతీక. కావున ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం పరివర్తన కేంద్రంగా మారుచున్నది. దీపయజ్ఞాలను ప్రోత్సహించండి. 33 వనస్పతులతో కూడిన హవన ద్రవ్యం మనలోని 33 ప్రక్క టెముకలకు, వెన్నెముకకు ప్రతీకలు.

గాయత్రీ హవనంతో మీ మేరుదండాన్ని మీరు వజ్ర సమానం చేయండి. యజ్ఞంలో ఆహుతులు వేయు వేళ మీ 33 ఎముకలు యజ్ఞ సమిధలుగా మారుచున్నట్లు అనుభూతి చెందండి. జ్ఞాన యజ్ఞం చేస్తే కల్కి అవతారం ప్రాప్తిస్తుంది. ఇచ్చట జరిగిన యజ్ఞం ప్రపంచ స్థితిని మార్చెడి యజ్ఞం దీనిని జ్ఞాపకముంచుకోండి.

తదుపరి మౌంట్ శంబళ గురించి వివరించుట జరిగింది.

నవంబరు 13వ తేది ఆదరణీయ డా॥ బ్రిజ్‌మోహన్‌గౌర్‌జీ గారు సౌత్‌సెల్‌లో కార్యకర్తలనుద్దేశించి ప్రసంగించారు. వారి మాటలలో – "ఉల్లాస, ఉత్సాహభరితంగా జన్మశతాబ్ది మహోత్సవా లను నిర్వహించుకొన్నాం. ప్రప్రథమంగా సౌత్ జోన్‌కు శాంతికుంజ్ కార్యక్రమాలలో ఒక గౌరవప్రదమైన స్థానం దక్కింది. ఎన్నో అశ్వ మేధాలు, యజ్ఞాలు జరిగాయి. ఎచ్చట దక్షిణభారతం తన ఉనికిని చాటుకొనలేదు. కాని నేడు ఊహించని రీతిలో, దేశ విదేశాల వారు కూడా మనల్ని గుర్తించారు, మెచ్చుకున్నారు. డాక్టర్ సాహెబ్ కూడా మెచ్చుకున్నారు. శ్రద్ధాభక్తులతో అంకిత భావంతో పనిచేసెడి వారిని వెన్నంటి భగవత్ శక్తి అంతర్లీనంగా పనిచేస్తూ ఉంటుంది. అదే నేడు మన సౌత్‌సెల్ శంకరాచార్యనగర్‌కు బాలాజీ భోజనాలయానికి దక్కాయి. ఎవరైతే బంధువులను, స్నేహితులను విడచి అప్పగించిన బాధ్యతల నిర్వహించెదరో వారి స్థానం పదిలంగా ఉంటుంది. సంస్థలో – పిరికివాడు ఈర్ష్యాళువులు నిందలు వేస్తూ మాటలతో ప్రొద్దు పుచ్చుతారు. మాటలతో, మంత్రాలతో పైకెదగజాలరు. దీనికి కఠోర శ్రమ కావాలి – వచ్చెడి వారిని సాదరంగా ఆహ్వానించి, వారిని సంతుష్టులగావించాలి. వెళ్ళెడివారికి ఆదరణతో వీడ్కోలు పలకాలి. బాధ్యతలు మరచిన వారి మధ్య తుఫానులు వస్తాయి. అంగదునిలా నిలచి మన కార్యకర్తలు పనిచేశారు. మీ శ్రద్ధానిష్ఠలు బాగా పనిచేశాయి. రాముని సమక్షంలో కూడా లక్ష్మణుడు మూర్ఛిల్లాడు సుమా! దీనిని వారింపజాలకపోయాడు. మహాభారత యుద్ధంలో అర్జునుడు స్వయంగా తన కుమారుని కోల్పోయాడు. 8వతేది జరిగిన దుస్సంఘటనను ఈ దృష్టితో చూడాలి. ఆంధ్రప్రదేశ్‌లో చాలా పని జరగాల్సి ఉంది. ముఖ్యంగా ప్రజ్ఞామండళ్ళు, మహిళా మండళ్ళు క్రియాశీలం కావాలి. వారానికి ఒకసారైనా సామూహిక ప్రార్థన జరగాలి. స్వాధ్యాయం జరుగుతూ ఉండాలి. మనమంతా క్రాంతికారులం, సమాజాన్ని మార్చేవాళ్ళం. పండితుల్లా యజ్ఞం చేసి హారతి డబ్బు ఆశించేవారం కాదు. మీ వ్యక్తిత్వం బ్రాహ్మణునిది – సరియైన జమాఖర్చు చూపని కార్యకర్త గాయత్రీ సంస్థను కూల్చేస్తాడు. అట్టి సెంటర్లను మూయుటకు వెనుకాడం – శాంతి కుంజ్ అనుశాసనంతో పని చేయండి. మిమ్ముల మీరు సంస్కరించు కోండి – తోటివారిలో తప్పులెంచుతూ కాలక్షేపం చేయకండి – తప్పులున్న వారిని సంస్కరించుట మన సంస్కృతి, అంతేకాని వారిని తరిమివేయుట మన విధానం కాదు కారాదు. మన పోరు వ్యక్తులపై కాదు, వారిలోనున్న చెడుపైన. మిషన్ డబ్బు, సొత్తును అపహరించుట కంటే మరణించుట మేలు.

సామర్థ్యంలేనివారికి బాధ్యత అప్పగించుట, బాధ్యత అప్పజెప్పినవాని తప్పిదం. గుర్రాల్లో మూడు రకాలుంటాయి, మొదటిది రౌతు మాటలకే స్పందించి తదనుగుణంగా నడుస్తుంది. రెండవది మాటసైగతోపాటు కళ్ళెం పట్టు విడుపులకనుగుణంగా నడుస్తుంది. ఇక మూడవది చెర్నకోల్ దెబ్బలకు మాత్రమే స్పందిస్తుంది. కావున కార్యకర్త సామర్థ్యాన్ని బట్టి బాధ్యతల ప్పగించుట విజయానికి తొలిమెట్టు.

ఈ రీతిగా పూజ్య గురుదేవుల జన్మశతాబ్ది మహోత్సవ వేడుకలు పూర్తియైనాయి.

★★★

## గాయత్రీ సాధకులకు ఆహ్వానం

పూజ్య గురుదేవులు యుగఋషి, యుగద్రష్ట, పండిత శ్రీరామశర్మ ఆచార్య జన్మశతాబ్దిని పురస్కరించుకొని **2011 డిశంబరు 9 నుండి 18 వరకు గొల్లపాలెం, శ్రీహరిపురం దగ్గరలోని హరిహరక్షేత్రం వైజాగ్‌లో** 24 లక్షల అఖండ గాయత్రీ జపం మరియు 24 కుండముల గాయత్రీ యజ్ఞము నిర్వహింప బడుచున్నది.

2011 డిశంబర్ 9 నుండి ప్రారంభించెడి 24 లక్షల గాయత్రీ అఖండజపము, 18వ తేదీతో పరిసమాప్తమై, అదేరోజు 24 కుండముల గాయత్రీ మహాయజ్ఞముతో ముగుస్తుంది. గాయత్రీ అఖండ జప సాధన పట్ల అభిరుచి ఉన్న సాధకులందరికీ ఇది ఒక చక్కని అవకాశము మరియు సరియైన వేదిక. దీనిలో పాల్గొనెడి వారికి ఉచిత భోజన, వసతి సౌకర్యములు కల్పించబడతాయి.

దీనిలో పాల్గొనదలచినవారు ఈ క్రింది వారిని సంప్రదించ గోరుచున్నాం.

**శ్రీ జగదీశ్ అసోపా, వైజాగ్**
**సెల్ : 9394803836 / 9490132923**

**మంచి నడవడిక అనేది ఎవరో ఇచ్చే కానుక కాదు, ఎవరికి వారు అనుసరించి సాధించవలసిన విషయం.**

# ఆణిముత్యాల శోధన - 1

*నిర్వహణ : సాధన నరసింహాచార్య*

పాఠకులందరికీ !

నమస్తే, మన "యుగశక్తి గాయత్రి" అనేక అపురూప విషయాలను పంచే అమృత నిధి అని ప్రతి ఒక్కరూ నమ్ముతున్న సత్యం. అయితే ఈ పత్రికను మరింత శ్రద్ధాసక్తులతో చదివి, ఆణిముత్యాల వంటి విషయాలను మీ స్మృతిపథంలో నిలుపు కోవాలన్న లక్ష్యంతో ఆణిముత్యాల శోధన అనెడి శీర్షికను ప్రవేశ పెడుతున్నాం. మీరు చేయవలసినదల్లా, నవంబర్ 2011 పత్రికను క్షుణ్ణంగా చదివి, మేము అడిగిన ప్రశ్నలకు సమాధానాలు వ్రాసి పంపించాలి. షరా మామూలే.

1. *ఈ క్రింద మేము అడిగే ప్రశ్నలకు కొట్టివేతలు, తుడుపులు ఉండరాదు.*
2. *సమాధానం క్లుప్తంగా మా "కీ" సొల్యూషన్స్‌కు సరిపోవాలి.*
3. *ఒకరికంటే ఎక్కువమంది కరెక్ట్ సమాధానాలు వ్రాసినచో, బహుమతులు సమానంగా పంచబడును.*
4. *ఈ ఎంట్రీలను 18.12.2011వ తేదీలోగా పంపించవలెను.*
5. *తపాలశాఖ వారి ఆలస్యానికి మేము బాధ్యులం కాదు.*
6. *బహుమతుల విషయంలో తుదినిర్ణయం నిర్వాహకులదే.*

***మొదటి బహుమతి :*** *రూ. 100/-*
***రెండవ బహుమతి :*** *రూ. 50/-*

**1వ ప్రశ్న:** "నమే భక్తః ప్రణశ్యతి" అని ఎవరు ఎవరికి ఆశ్వాసన ఇచ్చారు?

**2వ ప్రశ్న:** ఆత్మ యొక్క పంచ ఆవరణల పేర్లు ఏమిటి?

**3వ ప్రశ్న:** కళ్ళు లేనివాడు, కాళ్ళు లేనివాడు మనకు ఏ కథలో కనిపిస్తారు? ఆ కథ పేరేమిటి?

**4వ ప్రశ్న:** వశిష్ఠుని ఆశ్రమంలోగల ధేనువు పేరేమిటి?

**5వ ప్రశ్న:** "సావిత్రి విద్య" అని దేనిని పిలుస్తారు?

**6వ ప్రశ్న:** నామంతోబాటు దేనిని కలుపుకొనిపోయే విధానం సరియైన పద్ధతి అని పెద్దలు చెప్పారు?

**7వ ప్రశ్న:** ఎడ్గర్‌కేసీ యొక్క ప్రత్యేకత ఏమిటి?

**8వ ప్రశ్న:** దుష్కర్మకు ఫలితం అనే కథలో చిన్ననాటి స్నేహితుని పేరేమిటి?

**9వ ప్రశ్న:** గృహస్థధర్మంలో మనోయోగ అధ్యయనం సువర్చలను ఎలా తయారుచేసింది?

**10వ ప్రశ్న:** అన్నాహజారే ఆదర్శాలు ఏమిటి?

పేరు : ..........................................................
చిరునామా : ..........................................................
..........................................................
.............................. పిన్ కోడ్ : ..........................
ఫోన్ నెం : ..........................................................

| సమాధానాలు | | పేజీ నెం. (ఏ పేజీలో గలదు?) |
|---|---|---|
| 1వ | ______ | ______ |
| 2వ | ______ | ______ |
| 3వ | ______ | ______ |
| 4వ | ______ | ______ |
| 5వ | ______ | ______ |
| 6వ | ______ | ______ |
| 7వ | ______ | ______ |
| 8వ | ______ | ______ |
| 9వ | ______ | ______ |
| 10వ | ______ | ______ |

**ఎంట్రీలు పంపవలసిన చిరునామా**

**ఆణిముత్యాల శోధన C/o. యుగశక్తిగాయత్రి,** అశ్విని హౌస్ ప్రక్కన, గాయత్రీ చేతనా కేంద్రం, మూసాపేట, హైదరాబాద్-18